www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 12-11-2019 | పేజీలు: 14 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 | సంచిక (Issue) : 207 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 7.05 తదుపరి బ. పాడ్యమి; నక్షత్రం: భరణి రా. 8.52 తదుపరి కృత్తిక; వర్జ్యం: శే. ఉ. 7.13; దుర్ముహూర్తం: ఉ. 8.37-9.22, రా. 9.48-10.38; అమృతఘడియలు: మ. 3.45-5.27; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

వెంకయ్య మనవళ్లది ఏ మీడియం?

చంద్రబాబు కొడుకు చదివింది ఎందులో?

పవన్‌కు ముగ్గురు భార్యలు నలుగురైదుగురు పిల్లలు

వారిని ఏ మీడియంలో చదివిస్తున్నారు?

నాలుగేళ్లలో మొత్తం 'ఆంగ్లం'

వచ్చే ఏడాది 1 నుంచి 6 వరకు..

ఆ తర్వాత ఏటేటా 10 వరకు విస్తరణ

ఇంగ్లీషు మీడియం లేకుంటే రాష్ట్రం, జాతి నష్టపోతాయి: జగన్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం పూర్తిగా తొలగించి... ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న వారిపై ముఖ్యమంత్రి జగన్ విరుచుకుపడ్డారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడునూ వదలకుండా విమర్శలు గుప్పించారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగన్ ప్రసంగించారు. "మన స్కూళ్లన్నింటినీ వచ్చే సంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియం చేయనున్నట్లు వారం కిందట ఒక జీవో ఇచ్చాం. ఆ వెంటనే... కొన్ని కొన్ని స్వరాలు వినిపించాయి. ఇంగ్లిష్ మీడియం పేదవాడికి ఎందుకు, తెలుగు మీడియం చాలదా అని ప్రశ్నించారు. ఇలా అడిగిన వారు చిన్నవాళ్లేం కాదు. ఏకంగా చంద్రబాబువంటి పెద్ద వాళ్లు. వెంకయ్య వంటి ఇంకా ఇంకా పెద్ద పెద్ద వాళ్లు. పవన్ కల్యాణ్ వంటి ఇంకా పెద్ద పెద్ద సినిమా యాక్టర్లు! వీళ్లందరూ సరిపోరన్నట్లు

మిగతా 11వ పేజీలో...

జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో ఓ చిన్నారిని పలకరిస్తున్న సీఎం

నాడు మీదే 'మీడియం'?

- అప్పట్లో బాబు నిర్ణయంపై జగన్ మీడియాలో విమర్శలు
- పాక్షికంగా ప్రవేశపెట్టినా తీవ్ర స్థాయిలో ధ్వజం
- ఇప్పుడు 'ఆంగ్లాంధ్రప్రదేశ్' చేస్తున్న ముఖ్యమంత్రి
- నిపుణుల అభిప్రాయాలు చెప్పిన పత్రికలపైనా సీఎం అక్కసు

11

పది వరకు తల్లి భాషే!

- ఆ తర్వాతే మాధ్యమాల యోచన
- మాతృభాషలో ఉపాధి పెరగాలి
- రాష్ట్రపతి,నేను,ప్రధాని చదివింది మా మాతృభాషల్లోనే: వెంకయ్య

జగన్.. క్షమాపణ చెప్పు!

- వెంకయ్యపై ఏకవచన సంబోధనా?
- ఆయన పదవికైనా గౌరవమివ్వరా?
- ఓ మతం రుద్దడానికే 'ఆంగ్లం': కన్నా

భాషను చిన్నబరుస్తారా?

- గతంలో మీ పత్రిక ఏం చేసింది?
- తెలుగు కోసం గుండెలు బాదుకోలేదా?
- అప్పటికీ, ఇప్పటికీ మీలో ఇన్ని కపటాలా?
- ట్విటర్ వేదికగా ప్రభుత్వంపై పవన్ ఫైర్

ఆంగ్లానికి పెద్దపీట వేస్తూనే...

తెలుగును కాపాడుకోవాలి

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

జగన్‌కు తెలుగు రాదని 'అవతరణ'తో తేలింది: బీజేవైఎం

నీలం సాహ్నికి కేంద్రం

పచ్చజెండా

- ఏపీకి పంపేందుకు అంగీకారం
- రేపు రిలీవ్ కావాలని ఉత్తర్వులు
- సీఎస్‌గా నియామకానికి రెడీ

9

150 కోట్లు అందుకున్న ఆంధ్రా ముఖ్యుడెవరు!?

- కలకలం రేపుతున్న ఐటీ ప్రకటన
- తొలివారంలో భారీగా సోదాలు
- బోగస్ బిల్లులతో 3300 కోట్ల నగదు బదిలీ
- కార్పొరేట్లతో హవాలా బంధం
- దక్షిణాది ప్రాజెక్టుల్లో 'నకిలీ దందా'
- ఏపీ ప్రముఖుడికి 150 కోట్లు
- ఆధారాలు లభించాయన్న ఐటీ

12

కాచిగూడలో రెండు రైళ్లు ఢీ!

- 'హంట్రీ'ని ఢీకొన్న ఎంఎంటీఎస్
- ఎగిరిపడ్డ ఎంఎంటీఎస్ బోగీలు
- 17 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- చిక్కుకున్న డ్రైవర్ వెలికితీతకు ఏడున్నర గంటల ఆపరేషన్

ఎన్ఎల్‌పీ చౌదరి

12

యాప్‌లో పాస్‌పోర్టు సేవలు

- ఎంపాస్‌పోర్టు ద్వారా దరఖాస్తు
- నకిలీ వెబ్‌సైట్లతో జాగ్రత్త
- 'ఆంధ్రజ్యోతి'తో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి

10

పాడి పశువుకూ హెల్త్‌కార్డు!

- పుట్టినప్పటి నుంచి ప్రతినెలా ఆరోగ్యస్థితి నమోదు
- రైతుల ఇంటికే వెళ్లి పశువైద్యుల సేవలు

ఉమ్మడి పౌర స్మృతి?

శీతాకాల సమావేశాల్లో మోదీ మరో సిక్సర్!

- పంద్రాగస్టు ప్రసంగంలోనే సంకేతం
- సంఘ్ చిరకాల వాంఛ నెరవేర్చడమే లక్ష్యం
- ఉమ్మడి స్మృతి అవసరం లేదన్న లా కమిషన్
- పట్టుదలగా ఉన్న కేంద్ర ప్రభుత్వం
- గోవా తరహాలో ఒకే చట్టం తెచ్చే యత్నం
- ట్రిపుల్ తలాక్ నిషేధంతో తొలి అడుగు

హిందూ సంప్రదాయాలూ మారతాయి

"ఉమ్మడి పౌర స్మృతి అంటే అందరూ హిందువులు, ముస్లింల గురించే మాట్లాడతారు. అది కరెక్ట్ కాదు. ఈ ఉమ్మడి చట్టం వల్ల హిందూ సంప్రదాయాలు కూడా కొంత మారతాయి. దేశంలో ఉన్న భిన్నత్వం దృష్ట్యా యూసీసీపై సమాజంలో ఏకాభిప్రాయం తేవాలి. ఇది దేశంలో ఏకతకు చిహ్నం కావాలి.. అంతే తప్ప విద్వేషాన్ని, అగాధాన్ని పెంచరాదు"

- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్(2018)

న్యూఢిల్లీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన ఎజెండాలో ఒక్కొక్క అంశాన్ని నెరవేరుస్తోంది. కశ్మీరుకు ప్రత్యేకమైన 370 ఆర్టికల్‌ను రద్దు చేసింది. ముస్లిములకు ప్రత్యేకమైన ట్రిపుల్ తలాక్‌ను చట్ట విరుద్ధంగా ప్రకటించింది. తాజాగా హిందూ ముస్లిం వర్గాల మధ్య శతాబ్దాలుగా నలుగుతున్న బాబ్రీ మసీదు-రామజన్మభూమి వివాదాన్ని తేల్చేసింది. ఇప్పుడు అదే ఊపులో మరేం చేయబోతోంది? బీజేపీ సర్కారు తదుపరి అడుగు ఏమిటి? అనేదే అందరి మదిలో నలుగుతున్న ప్రశ్న. దానికి సమాధానం ఉమ్మడి పౌరస్మృతి. బీజేపీ తప్ప నిసరిగా దేశంలో ఉమ్మడి పౌర స్మృతిని ప్రవేశపెడుతుందని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. దేశంలో వివాహం, విడాకులు, జనన మరణాలు, ఆస్తుల విషయంలో అన్ని మతాలవారికీ ఒకే చట్టం అమలు చేయాలని మోదీ సర్కార్ భావిస్తోంది. ఇందుకు సంబంధించిన బిల్లును శీతాకాల సమావేశాల్లో కానీ, బడ్జెట్ సమావేశాల్లో కానీ ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని విశ్వసనీయ

మిగతా 14వ పేజీలో...

మరిన్ని మసీదులు

మదర్సాల బలోపేతానికి బోర్డు

- ఆ పిల్లలకూ ఆధునిక విద్య
- ఒప్పుకొంటే వారికీ 'అమ్మఒడి' అమలు
- ఉన్నత విద్య విద్యార్థి తల్లికి మరో 20 వేలు
- మార్చి దాకా టైం ఇస్తే పెళ్లికానుక రూ.లక్ష
- ఇమాం, మౌజన్లకు నెలకు 15 వేలు: జగన్

అమరావతి, విజయవాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ముస్లిం పిల్లలు చదువుతున్న మదర్సాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అందుకోసం ఒక బోర్డును ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 132వ జయంతి సందర్భంగా

మిగతా 2వ పేజీలో...

వీవోఏలకు రూ.10వేలు!

'మెప్మా' రిసోర్స్ పర్సన్లకు కూడా

మా వాళ్లున్నారు.. వెళ్లిపోండి

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినులపై వైసీపీ జులుం
- తొలగిస్తున్నట్టు ఆదేశాలు రావడంతో తట్టుకోలేక ఫినాయిల్ తాగిన ఇద్దరు

10

ఎవరి బలమెంత?

మొత్తం సీట్లు	288
బీజేపీ	105
శివసేన	56
ఎన్‌సీపీ	54
కాంగ్రెస్	44
మజ్లిస్	2
ఎస్‌పీ	2
ఎంఎన్ఎస్	1
సీపీఎం	1
ఇతరులు	23

రాష్ట్రపతి పాలన?

శివసేనకు తీవ్ర ఎదురుదెబ్బ

చివరిలో హ్యాండిచ్చిన కాంగ్రెస్

మద్దతు సాధనలో శివసేన విఫలం

ఎన్‌సీపీకి గవర్నర్ ఆహ్వానం

145 ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ..

- ఈ రాత్రి 8.30 దాకా గడువు
- అదీ విఫలమైతే కేంద్ర పాలనే?
- బీజేపీ వ్యూహమూ ఇదే..!
- సోనియాకు 2 సార్లు శాక్రే ఫోన్
- పవార్‌తో చర్చించాకే నిర్ణయిస్తానంటూ దాటవేత
- కాంగ్రెస్, ఎన్‌సీపీ సూత్రప్రాయ మద్దతు ఉంది
- ఇది ఇప్పటికీ చట్టబద్ధమే: శివసేన
- క్షణక్షణం మారిన 'మహా' నాటకం

ముంబై, నవంబరు 11: మహారాష్ట్ర రాజకీయం రాష్ట్రపతి పాలన దిశగా సాగుతోందా..? సోమవారంనాడు అనేక సంచలన మలుపులు తీసుకున్న నాటకీయ పరిణామాలు చివరకు దీన్నే సూచిస్తున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు తగిన మద్దతు సాధించలేకపోయానని బీజేపీ చేతులెత్తేసిన వెంటనే రాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ రెండో అతి పెద్ద పార్టీ అయిన శివసేనను ఆహ్వానించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఏర్పాటు విషయాన్ని సోమవారం సాయంత్రం 7-30 గంటల కల్లా చెప్పాలని గడువు పెట్టారు. కానీ ఆలోగా కాంగ్రెస్, ఎన్‌సీపీల నుంచి మద్దతుకు సంబంధించిన

మిగతా 14వ పేజీలో...

అమెరికాలో ఆరుగురు తెలుగు విద్యార్థులకు జైలు

- ఇమిగ్రేషన్ మోసాలే కారణం.. త్వరలోనే మరో ఇద్దరు కూడా

14

చిన్నారిని చిదిమేశాడు

ఎదురింటి వాడే యముడు.. అత్యాచారం జరిపి.. హత్య

- పెదనాన్నా అంటూ వచ్చిన ఎనిమిదేళ్ల పాపపై ఘోరం
- సంచిలో మూటగట్టి ఇంట్లో ఒక రోజంతా..
- చిన్నారి జాడకోసం వెతుకుతున్నట్టుగా నటన
- గతంలో ఒకసారి మైనర్‌పై రేప్ కేసులో రెండేళ్లు జైలు
- 'వివాహేతర' కోణంలోనూ కృష్ణా పోలీసుల విచారణ?

విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎదురింటివాడే యముడయ్యాడు. 'నోరారా పెదనాన్నా' అని పిలిపించుకున్నవాడే చిన్నారిని చిదిమేశాడు. తన చేతుల్లో రోజూ ఆడుకొనే పాపాయిపైనే కనికరం లేకుండా అత్యాచారం జరిపి, ఆపై అమానుషంగా హత్య చేశాడు. మధ్యాహ్నం వరకు తన పక్కనే నిద్రపోయిన చిన్నారి సాయంత్రం నుంచి మాయమయి, చివరకు చిద్రమై కనిపించేసరికి పాప తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం మండలం నల్లకుంట గ్రామంలో జరిగిన ఈ ఘటన సోమవారం

మిగతా 14వ పేజీలో...

గోనెసంచిలో మూటగట్టిన పాప మృతదేహం



పరంజ్యోతి

కర్మలే మోక్షానికి ప్రతిబంధకం



కృతిమహోదధౌ పతన కారణం
ఫలమశాశ్వతం గతి నిరోధకం

ఆత్మజ్ఞానంపై భగవాన్ శ్రీ రమణులు రచించిన 30 శ్లోకాల 'ఉపదేశసారం'లో రెండో శ్లోకమిది. జడమైన కర్మలు శాశ్వత ఆనందాన్ని ఇవ్వలేవని, జన్మసాఫల్యాన్ని కలిగించలేవని తొలి శ్లోకంలో చెప్పారాయన. మరి అలాంటి కర్మలను నిరంతరం చేసుకుంటూ పోతే ఏం జరుగుతుందో చెప్పేదే ఈ రెండో శ్లోకం. "కర్మలను అలా చేసుకుంటూ పోతే కర్మసముద్రంలో మునిగిపోవడమే జరుగుతుంది. పోనీ కర్మఫలాలు శాశ్వతంగా ఉండేవా అంటే కాదు. పైగా మోక్షమార్గానికి అవి ఆటంకం కలిగిస్తాయి" అని దీని అర్థం. కర్మలు మోక్షానికి ప్రతిబంధకం అని రమణుల ఉద్దేశం. ఈ లోకంలో మానవులు ఎప్పుడూ ఉన్నవాటితో తృప్తి పడరు. కోరికలతో, అసంతృప్తితో వేగిపోతుంటారు. ఏదేదో కావాలని కర్మలు చేస్తుంటాడు. కానీ, వాటి ఫలితం తప్పక అనుభవించాలనే విషయాన్ని మర్చిపోతాడు. కర్మఫలం.. సంతోషం కలిగించేది కావచ్చు లేదా దుఃఖాన్ని కలిగించేది కూడా కావచ్చు. ఏదేమైనా అనుభవించి తీరాల్సిందే. ఇలా కర్మఫలాలను అనుభవించడం వల్ల ఆ అనుభవాలు మానవుల్లో వాసనలుగా, సంస్కారాలుగా ముద్రపడిపోతాయి. అంటే.. సుఖమైతే మళ్లీ అనుభవించాలని, దుఃఖమైతే రాకుండా తప్పించుకోవాలనే భావనలు బలపడతాయి. ఈ వాసనలే మళ్లీ మళ్లీ కర్మలకు ప్రేరేపిస్తాయి. సుఖాన్నిచ్చే కర్మలు చేయాలని, ఇంతకు ముందు పొందిన దుఃఖాన్ని మళ్లీ పొందకుండా ఉండే కర్మలు చేయాలని ప్రేరణలు కలుగుతాయి. దాంతో మళ్లీ కర్మలు చేస్తారు. మళ్లీ ఫలితం వస్తుంది. మళ్లీ అనుభవిస్తారు. మళ్లీ వాసనలు, సంస్కారాలు పేరుకుంటాయి. ఇదో చక్రభ్రమణం. కానీ, కాలం గడిచే కొద్దీ దేహం బలహీనమవుతుంది. ఫలితంగా కర్మలు చేస్తూ పోవడానికి దేహం అనుమతించదు. మనసులో మాత్రం ముద్రపడిన సంస్కారాలు, వాసనలు మాత్రం అలాగే ప్రబలంగా ఉంటాయి. చివరికి ఈ దేహం పడిపోయినా.. వాసనాబలం అలాగే ఉండి, మళ్లీ దేహాన్ని తీసుకుని ఈ లోకంలోకి వస్తారు. పూర్వజన్మల వాసనాబలం వల్ల మళ్లీ తమకు నచ్చిన కర్మలు చేస్తూ చక్రభ్రమణాన్ని ప్రారంభిస్తారు. ఈ దేహం పోతే మరో దేహం. ఇలా జన్మ-కర్మ-జన్మ వలయంలో చిక్కుకుని గిరగిర తిరుగుతుంటారు.

ఇదే కర్మ మహాసముద్రం. మనం నిత్య సుఖాంబుధిలో ఉండాలని కోరుకుంటూ.. ఇలా కర్మసముద్రంలో పడిపోతున్నాం. పాపం, పుణ్యం.. రెండూ కర్మఫలాలు. పుణ్యఫలాలు బంగారు సంకెళ్లయితే, పాప ఫలాలు ఇనుప సంకెళ్లు. రెండూ సంకెళ్లే. జీవుణ్ని బంధించేవే. అనుభవించడానికి వీలుగా జన్మలను కలిగించేవే. మంచిదైనా సరే.. మళ్లీ జన్మ కోరుకోకూడదు. మానవుడు కోరుకోవాల్సింది జన్మరాహిత్యం. అంటే మోక్షం. దానికి ప్రతిబంధకం కర్మలే. కానీ, అసలు కర్మలు చేయకుండా వదిలేద్దామా అంటే.. అది అస్సలు కుదరదు. 'నహికశ్చిత్ క్షణమపి జాతుతిష్ఠత్యకర్మకృత్' అన్నారు. ఒక్క క్షణం కూడా కర్మలు చేయకుండా కుదరదు. మరేమిటి మార్గం? ఈ ప్రశ్నకు సమాధానాన్ని రమణులు 'ఉపదేశసారం'లోని మూడో శ్లోకంలో వివరించారు.

- దేవిశెట్టి చలపతిరావు, care@srichalapathirao.com

లోకం తీరు

ఎవరు ఎవరితో పొత్తు పెట్టుకుంటారో.. మీకే తెలియడం లేదు.. ఇక చిలక ఎలా చెబుతుందయ్యా..!

తెలుగు దివ్వెల ఉత్సవం

శ్రీశైలంలో లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని అధికసంఖ్యలో భక్తులు మల్లికార్జున స్వామి దర్శనానికి తరలివచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజావేళల్లో మార్పులు చేసి వేకువజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. ఉచిత దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. స్వామిఅమ్మవారలకు, పుష్కరిణికి హారతులు ఇచ్చారు. -శ్రీశైలం



కాకినాడ సాగర తీరంలో ఏర్పాటు చేసిన శివుడి సైకత శిల్పం ఆకట్టుకుంది. తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన దేవిన శ్రీనివాస్ దీన్ని రూపొందించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రకృతిని కాపాడుదాం అనే నినాదంతో ఏర్పాటు చేశారు.

మార్పులు జరిగితే..

మొబైల్‌కు సందేశం

- రికార్డు మార్చినా, రిజిస్ట్రేషన్ జరిగినా ఖాతాదారుడికి సమాచారం
- బోగస్ అయితే అధికారులపై చర్యలు
- రిజిస్ట్రేషన్, వెబ్‌ల్యాండ్ సవరణలపై ప్రతిపాదన

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని అవకతవకలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టనుంది. గుట్టుచప్పుడు కాకుండా అడ్డగోలుగా రికార్డులను మార్చేసే అధికారులపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోనుంది. రికార్డుల్లో ఎలాంటి సవరణలు చేసినా సంబంధిత ఖాతాదారుల మొబైల్‌కు వెంటనే సంక్షిప్త సందేశం వెళ్లేలా వెబ్‌ల్యాండ్‌లో సాఫ్ట్‌వేర్ చెక్‌ను ఏర్పాటు చేయబోతోంది. అంతేకాదు... ఏ మండలంలో ఎన్నిసార్లు లాగిన్ అయ్యారు? ఎన్ని ఖాతాలను మార్చారు? ఏ సమయంలో సవరణలు చేపట్టారు అనే వివరాలు తెలుసుకునేందుకు లాగిన్ హిస్టరీని రికార్డు చేసి బ్యాకప్ ఉంచాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. రికార్డుల సవరణలపై వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌ను ఒక నిగూఢమైన నిఘావ్యవస్థలా పనిచేసేలా కీలక మార్పులు చేయాలని నిర్ణయించింది. ఇటీవల రెవెన్యూశాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ అంశం చర్చకొచ్చింది.

తేడా వస్తే చర్యలు

రెవెన్యూ రికార్డులను వెబ్‌ల్యాండ్ నుంచి ప్రతి ఒక్కరు చూడగలిగే పరిస్థితి వచ్చింది. అలాగే, ఖాళీగా ఉన్న ప్రైవేటు, ఎవరూ క్లెయిమ్ చేయని విలువైన భూములు, ఇంకా ప్రభుత్వ పరిధిలోని భూముల గురించి తెలుసుకొని రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయి వాటి రికార్డులను మార్చేస్తున్నారని రెవెన్యూశాఖ కార్యదర్శి ఉషారాణి ఇటీవల ఆ వర్క్‌షాప్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు యుద్ధప్రాతిపదికన తీసుకురావాలన్నారు. అవి ఎలా ఉండాలో కూడా దిశానిర్దేశం చేశారు. దీనికి రిజిస్ట్రేషన్‌శాఖతో కలిపి మార్పులు చేయాలని ఆమె సూచించారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్‌ను రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌తోపాటు బ్యాంకులు, ఇతర శాఖలు ఉపయోగించుకోగలుగుతున్నాయి. కానీ రికార్డుల సవరణలు మాత్రం ఒక్క రెవెన్యూ శాఖే చేస్తోంది. ఇకపై, మండల కార్యాలయాల్లో రికార్డుల సవరణకు పూర్తి బాధ్యత తహసీల్దార్‌దే. 'డిజిటల్ కీ'ని కంప్యూటర్ ఆపరేటర్‌కు ఇచ్చి చేయించే సవరణల్లో తప్పులు దొర్లినా, ఉద్దేశపూర్వక తప్పిదాలు చేసినా తహసీల్దార్‌నే బాధ్యులుగా చేస్తారు. రికార్డుల సవరణ సమయంలో తహసీల్దార్ వేలిముద్ర వేసే విధానం తీసుకురాబోతున్నారు. అయితే, తహసీల్దార్‌లకు పనిభారం ఎక్కువగా ఉంటోన్నందున కొందరు 'డిజిటల్ కీ'ని ఆపరేటర్లకు ఇస్తున్నారని, అలాంటి కేసుల్లో ప్రత్యామ్నాయం చూడాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. దీంతో, తహసీల్దార్ ఇతర పనులపై బయటకు వెళ్లినప్పుడు 'డిజిటల్ కీ'ని కంప్యూటర్ ఆపరేటర్‌కు బదులు డిప్యూటీ తహసీల్దార్(డీటీ)కు అందించాలని ప్రతిపాదించారు. డీటీ సమక్షంలోనే రికార్డుల సవరణలు జరిగేలా చూడాలని నిర్ణయించారు. దీంతోపాటు ప్రతి మండల ఆఫీసుకు ఒక జూనియర్ అసిస్టెంట్‌పోస్టును త్వరలో మంజూరు చేయనున్నారు. మండల ఆఫీసులో ఏ రికార్డునైనా అధికారి మారిస్తే వెంటనే సంబంధిత ఖాతాదారుని సెల్‌ఫోన్‌కు మెసేజ్ వెళ్లేలా వెబ్‌ల్యాండ్‌లో ఆటోమెసేజ్ సెంట్ అప్షన్ పెట్టాలని నిర్ణయించారు. ఒకవేళ అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా భూమి రికార్డులను మార్చినట్లు ఖాతాదారుడు గుర్తించి ఫిర్యాదు చేస్తే సంబంధిత తహసీల్దార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించారు. అంతేకాదు... ఇలాంటి కేసులు అదే మండలంలో ఏమైనా జరిగియా అన్నది విచారించడానికి ప్రత్యేకంగా అధికారుల బృందంతో పరిశీలన చేయించాలని నిర్ణయించారు. రిజిస్ట్రేషన్‌శాఖలోనూ దాదాపు ఇదే పద్ధతిని తీసుకురావాలని ఆ శాఖ ఐజీ సిద్ధార్థ్ జైన్ ప్రతిపాదించారు. ఈ అంశాలపై త్వరలో రెవెన్యూశాఖ మార్గదర్శకాలు ఇవ్వనుంది.

మసీదు నిర్మాణానికి ఆ 67 ఎకరాల్లోనే స్థలమివ్వాలి

మసీదు నిర్మాణానికి మాకు స్థలాన్ని ఇవ్వాలనుకుంటే, మేం ఒప్పుకున్న చోటే.. అది కూడా ప్రభుత్వ అధీనంలో ఉన్న ఆ 67 ఎకరాల్లోనే ఇవ్వాలి. అప్పుడే మేం స్థలాన్ని తీసుకుంటాం. లేకపోతే తిరస్కరిస్తాం. అంతే కానీ ఎక్కడికో పోయి మసీదు కట్టుకోమనడం న్యాయం కాదు

- ఇక్బాల్ అన్సారీ, అయోధ్య కేసులో కక్షిదారు

తీర్పు అద్భుతం

భిన్నాభిప్రాయాలున్న అయోధ్య కేసును ఐదుగురు న్యాయమూర్తులు విచారించిన తీరు, తీర్పు ఇచ్చిన విధానం అద్భుతం. గొగోయ్ ధైర్యం, ఉత్సాహం, వ్యక్తిత్వమే ఈ లోపాల్లేని తీర్పును సాధ్యం చేశాయి

- జస్టిస్ బోబ్డే, సుప్రీం కోర్టు న్యాయమూర్తి

ఏటీ నాటి వైభవం?

పవిత్రసంగమం(ఇబ్రహీంపట్నం): పవిత్రసంగమం వద్ద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నవ హారతులు.. ఇప్పుడు పంచ హారతులయ్యాయి. అవి కూడా సాదాసీదాగా ఏదో మొక్కుబడిగా ఉందని భక్తులంటున్నారు. గతంలో విద్యుత్ దీపకాంతులతో నదీ గర్భంతో ఏర్పాటు చేసిన ఫంట్‌పై నుంచి ప్రతి రోజు సాయంత్రం 6:50 గంటలకు నవ హారతులు ఇచ్చేవారు. ప్రభుత్వం మారిన తర్వాత కొంత కాలంగా నవహారతులు నిలిచిపోయాయి. సోమవారం మళ్లీ హారతులు పునఃప్రారంభమయ్యాయి. అయితే అవి పంచ హారతులుగా మారిపోయాయి.

లోటు నిధుల్ని గ్రాంటుగా ఇవ్వండి

- ఆంధ్రను ప్రత్యేక దృష్టితో చూడండి
- విభజన సమస్యలన్నీ పరిష్కరించండి
- కేంద్ర ఆర్థిక మంత్రికి బుగ్గన వినతి

న్యూఢిల్లీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ లోటు నిధులను తక్షణమే గ్రాంటు రూపంలో విడుదల చేయాలని కోరారు. ఆయన సోమవారమిక్కడ కేంద్రఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. పెండింగ్ సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాల్లా చూడకుండా ప్రత్యేక దృష్టితో చూడాలని కోరాను. వేల కోట్ల రెవెన్యూ లోటుతో రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. అందుకే ఆర్థికంగా రాష్ట్రం అనేక ఇబ్బందులతో సతమతమవుతోంది. గత ప్రభుత్వం పరిమితులకు మించి అప్పులు చేయడంతో పాటు దాదాపు రూ.40వేల కోట్ల మేరకు పెండింగ్ బిల్లులు మాపై రుద్ది వెళ్లిపోయింది. ఈ నిధులు చెల్లించేందుకు కూడా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొత్తగా అప్పు చేయడానికి కూడా ఇప్పుడున్న నిబంధనలు అనుకూలించడంలేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నిచ్చి అన్నివిధాలా ఆదుకోవాలని మంత్రిని కోరాను. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసిన నిధుల్లో మూడు రోజుల క్రితమే రూ.1,850 కోట్ల విడుదలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మిగతా నిధులు కూడా త్వరలోనే విడుదల చేస్తామని నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీకి లోబడి ప్రత్యేక హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేశాను. ప్రత్యేక హోదాతోనే పారిశ్రామిక, ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధ్యమని, నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని చెప్పాను. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు కోరాను' అని బుగ్గన తెలిపారు.

పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్!

- రాష్ట్రంలో సానుకూల వాతావరణం
- సహజ వనరులే సంపద : మేకపాటి
- ముంబై సదస్సుకు మంత్రి హాజరు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన బుగ్గన

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సహజ వనరులు, నిక్షేపాలు, అవకాశాలు అపారంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా అనుకూల వాతావరణం ఉందన్నారు. పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ వేస్తామని వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.2లక్షల కోట్లు పెట్టుబడులుగా వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. సోమవారం ముంబైలో జరిగిన గ్లోబల్ కెమికల్స్, పెట్రో కెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ సదస్సులో మంత్రి ప్రసంగించారు. 'రసాయనాలు, గ్యాస్, చమురు వంటి రంగాలదే భవిష్యత్. మా తీరంలో గ్యాస్, ఆయిల్, పెట్రోలియం వంటి సహజ వనరులు భారీగా ఉన్నాయి. అవే మాకు అరుదైన సహజ సంపద' అని పేర్కొన్నారు. విశాఖ-కాకినాడ మధ్యలో ఏర్పాటు చేసే పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రో-కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్) గురించి వివరించారు. భూ కేటాయింపులు, అనుమతుల వంటి విషయాల్లో సింగిల్ విండో విధానం ద్వారా పెట్టుబడులను పరుగులు పెట్టిస్తామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక విధానం అమల్లో నాలుగు మూల స్తంభాలుంటాయని చెప్పారు. పారదర్శకత, సుపరిపాలన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ స్థాయిలో అపారమైన మానవ వనరుల వంటి సానుకూల అంశాలతో భారత ప్రభుత్వం నిర్దేశించిన ఐదు లక్షల ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములం అవుతామని చెప్పారు. ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రి సదానందగౌడను త్వరలో రాష్ట్రంలో పర్యటించాలని గౌతమ్‌రెడ్డి కోరారు. ఒడిసా పరిశ్రమల మంత్రితోనూ ఆయన మాట్లాడారు.

కేరళలో పబ్‌లు!

సందడి, ఉత్సాహం లేని జీవితం దేనికి? 24 గంటలూ పని గురించే ఆలోచిస్తే ఎలా? కాస్తంత సేద తీరే మార్గాలూ ఉండాలి కదా! అందుకే కేరళలో పబ్‌లు తెరిచే ఆలోచన ఉంది. ముఖ్యంగా ఎంతో శ్రమించే ఐటీ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకోబోతున్నాం. పబ్‌లకు అవకాశం కల్పించడం లేదనేదే మాపై ఉన్న అతి పెద్ద ఆరోపణ!

- పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

మనిషంత ఎత్తున్న చేప!

మనిషి అంత ఎత్తు.. 30 కేజీల బరువున్న ఈ చేప పేరు నల్ల మట్ట. సోమవారం వేకువజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లిన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మరువాడ మత్స్యకారుల వలకు ఈ చేప చిక్కింది. కాగా.. నల్లమట్ట చేప చాలా అరుదుగా వలకు చిక్కుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఇది మనిషంత ఎత్తు ఉండడంతో దాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు.

- సంతబొమ్మాళి

మరిన్ని మసీదులు..

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం విజయవాడలోని ఓ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. మదర్సాలలో కేవలం మత బోధనే కాకుండా ఆధునిక విద్యకు శ్రీకారం చుట్టాలని సూచించారు. వారు ఒప్పుకుంటే అమ్మఒడిని కూడా అమలు చేస్తామన్నారు. చదివించడం ఒక చాలెంజ్‌గా ఉందని, ఈ దశను దాటి ప్రతి ఒక్కరూ చదువుకునేలా ఆకాంక్షించానని చెప్పారు. దేశవ్యాప్తంగా 27 శాతం నిరక్షరాస్యత ఉంటే మన రాష్ట్రంలో 33 శాతముందన్నారు. పిల్లలను బడికి మన పిల్లలు గొప్పగా చదివితేనే మన ఆర్థిక పరిస్థితి మారుతుందన్నారు. స్కూళ్ల వద్ద నుంచి మొదలై రేపు ఉన్నత విద్యలోనూ మార్పు రాబోతోందన్నారు. ఈ మార్పులన్నీ వారిని ఉద్యోగానికి దగ్గర చేసేందుకేనన్నారు. అప్రెంటిస్ తీసుకువస్తామని, హాస్టల్ ఖర్చులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. గతంలో చాలీచాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేదని, మిగిలిన సొమ్ము చెల్లించలేక పిల్లలు విద్యకు దూరమయ్యారన్నారు. ఉన్నత విద్యలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలు కాకుండా ఆ తల్లికి ఏడాదికి మరో రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన పెళ్లికానుక అప్పుడే ఆగిపోయిందన్నారు. తనకు మార్చి వరకు సమయమిస్తే ఆ కానుకను రూ. లక్షకు పెంచి అందిస్తామని చెప్పారు. మసీదుల సంఖ్య పెంచుతామని, ఇమాం, మౌజన్‌లకు రూ.15 వేలు, మసీదులకు ఇచ్చిన హామీలనూ అమలు చేస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియం స్కూల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. దీనిపై ఎంతో మంది అవాకులు చవాకులు పేలుతున్నారని ఆక్షేపించారు. 'జగన్ ఇంగ్లీషులో మాట్లాడితే జాతీయ చానళ్లు ఆశ్చర్యపోతాయి. నారా వారు కూడా మనం చూశాం.. బ్రీఫ్‌డ్ మీ..' అన్నారు. అనంతరం ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా అవార్డులను సీఎం చేతులు మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు జోగిరమేష్, మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల నిరసన.. కార్యక్రమంలో తొలుత సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు ఖాదిర్ మౌలానా, మౌలానా హుస్సేన్ ప్రార్థనలు చేస్తుండగా.. పలువురు ముస్లింలు పెద్దగా అరుస్తూ నిరసన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం వారిద్దరూ కృషి చేశారని, ఇప్పుడు వారితోనే ప్రార్థనలు చేయిస్తున్నారంటూ తీవ్ర అభ్యంతరం తెలిపారు. అధికారులు ఆ ఇద్దరినీ వేదిక నుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.

వీవోఏలకు రూ. 10వేలు!

- 'మెప్మా' రిసోర్స్ పర్సన్లకు కూడా
- వచ్చే ఒకటో తేదీ నుంచి అమలు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్యలను బలోపేతం చేసేందుకు నియమించిన గ్రామ సమాఖ్య అసిస్టెంట్(వీవోఏ)లకు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లోని ఎస్ఎల్ఎఫ్(స్లమ్ లెవెల్ ఫెడరేషన్స్), టీఎల్ఎఫ్(టౌన్ లెవెల్ ఫెడరేషన్స్) రిసోర్స్ పర్సన్లకు నెలవారీ చెల్లించే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలకు పెంచింది. ఇది ఈ ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తుందని సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో వీవోఏ/సంఘమిత్ర/యానిమేటర్ల పేరుతో వ్యవహరిస్తున్న ఈ సిబ్బందికి ఇప్పటికే గ్రామ సమాఖ్యల ద్వారా రూ.2వేలు అందిస్తున్నారు. ప్రభుత్వం మరో రూ.8 వేలు అందించనుంది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో 27,797 మంది వీవోఏలకు ప్రయోజనం కలుగనుంది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,034 మంది రిసోర్స్ పర్సన్లకు కూడా లబ్ధి చేకూరనుంది.

కీళ్ల నొప్పుల మాత్రలతో దుష్ప్రభావాలు

న్యూఢిల్లీ, నవంబరు 11: వయసు మళ్లిన వాళ్లు, మధ్య వయస్కుల్లో కీళ్ల నొప్పులు సహజం. ఉపశమనం కోసం చాలా మంది క్రమం తప్పకుండా మాత్రలు వేసుకుంటారు. అయితే ఈ మాత్రలు దీర్ఘకాలంలో నొప్పిపై అంతగా ప్రభావం చూపవని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అదే సమయంలో శరీరంపై తీవ్రమైన దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మాత్రలు వేసుకోవద్దని సూచిస్తున్నారు. దాదాపు 12 వేల మందిపై అధ్యయనం చేసి ఈ వివరాలను వెల్లడించారు. మాత్రల కన్నా వ్యాయామం, కాచుకోవడం లాంటి వాటి ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు.

ఒత్తిడితో జీవచక్రంలో మార్పు

వాషింగ్టన్, నవంబరు 11: శరీరంలో ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ హార్మోన్ జీవచక్రాన్ని కూడా నియంత్రిస్తుందని శాస్త్రవేత్తలు తాజా పరిశోధనల్లో కనుగొన్నారు. ఇది శరీర ఉష్ణోగ్రత నుంచి నిద్ర వరకు ప్రతీ దానిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. సాధారణంగా కార్టిసాల్ మెదడులోని ఓ కేంద్రకం నుంచి విడుదలవుతుంది. దీనికి నరాలకు సంబంధం ఉండదు. కానీ ఇది నరాలతో సమన్వయం చేసుకొని జీవచక్రాన్ని నియంత్రిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు :: తిరుపతి
రికార్డ్ సెక్షన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జనరల్)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Roc.No.12023(31)2/2019-RECORD SECTION-TTD
తిరుపతి, టి.టి.డి. రికార్డ్ సెక్షన్‌కు జనరల్ స్టేషనరీ ఐటమ్స్ (ఫోటోకాపీయర్ పేపర్ & వివిధ ఐటమ్‌లు) కొరకు ఇ-టెండర్లు కోరబడుచున్నవి. మరిన్ని వివరాలకు "తిరుమల తిరుపతి దేవస్థానములు" ఎంపిక చేసుకొని మరియు 'More' సెలక్ట్ చేసుకొని మరియు కరెంట్ టెండర్స్ AP అని క్లిక్ చేసి డెట్రైల్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.inపై లాగాన్ కాగలరు. తదుపరి వివరాలకు ఫోన్ నంబర్లు : 0877-2264079, 2264555. ఫ్యాక్స్ : 0877-2264554.

క్ర. సం.	ఐటమ్ పేరు	పరిమాణం	ఐటా	టెండరు ఫారం ప్రారంభ తేది	టెండరు ముగింపు తేది	సాంకేతిక బిడ్ తెరుచు తేది & సమయం
1	కాపీయర్ పేపర్ (ఫోటో కాపీయర్ పేపర్ / జిరాక్స్ పేపర్)	FS 3,750 రీములు, A4 5,000 రీములు	రూ. 39,500/-	15.11.2019	29.11.2019	29.11.2019న మ.3.30 గం.లకు
2	వివిధ స్టేషనరీ ఐటమ్‌లు	--	రూ. 25,400/-	15.11.2019	02.12.2019	02.12.2019న మ.3.30 గం.లకు

ROC No.PR4/13912/Adv.No.300/PRO/2019, Dt.:11.11.2019 సం/- కార్యనిర్వహణాధికారి

చలనచిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా విజయచందర్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర చలన చిత్ర, టీవీ, థియేటర్ అభివృద్ధి కార్పొరేషన్(ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ) చైర్మన్‌గా విజయచందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. కరుణామయుడు సినిమాతో విజయచందర్ సుప్రసిద్ధులు. ఆయన చాలా కాలం నుంచి వైసీపీ పార్టీకి మద్దతిస్తున్నారు.

మాతృ శాఖకు గురుమూర్తి

సెంట్రల్ సెక్రటేరియట్‌కు బదిలీ

అమరావతి: జీఏడీలో పనిచేసిన అదనపు కార్యదర్శి గురుమూర్తిని మాతృ శాఖకు పంపించేశారు. సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసు నుంచి ఆయన డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. ఆయన డిప్యుటేషన్‌ను రద్దుచేసి.. తిరిగి సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసుకు బదిలీ చేశారు. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్ ప్రకాశ్‌పై ఆయన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

జగన్, విజయసాయిలకు 'యాంటీ సోషల్' డిజార్డర్

▸▸ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్వీట్

విజయవాడ: "యాంటీ సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ అనే మానసిక వ్యాధి వల్లే వైఎస్ జగన్, విజయసాయిరెడ్డి ఇలా అయిపోయారు. అబద్ధాలు చెప్పడం, చట్టాన్ని ఉల్లంఘించడం, ప్రజల్ని దోచుకోవడం, విధ్వంసం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు" అని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్వీట్ చేశారు. సోమవారం ఆయన ట్విటర్ వేదికగా స్పందించారు. "డెంగ్యూతో ప్రజలు చస్తుంటే సంబరాలు చేసుకోవడం, ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే జోకులు వెయ్యడం వంటివన్నీ ఈ వ్యాధి లక్షణాలే. వాళ్లు మాత్రం ఏం చేస్తారు పాపం" అని బుద్దా ట్వీట్ చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చాకే మాకు జీతమివ్వండి

మరో ఇద్దరు ఐఏఎస్‌ల లేఖలు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ శాఖ, కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు చెల్లించాకే.. తమ వేతనాల బిల్లు తయారు చేయాలని మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులు కోరారు. పర్యాటకాభివృద్ధి అథారిటీ సీఈవో ప్రవీణ్‌కుమార్, ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్ షణ్మోహన్ జీతాల చెల్లింపు అధికారులకు ఈ మేరకు లేఖలు రాశారు. వీరికి ముందు సీఎంవో, జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఇటీవల ఇలాంటి లేఖ రాసిన సంగతి తెలిసిందే. వీరిలో ఎక్కువ మంది మూడు, నాలుగు తరగతుల ఉద్యోగులని.. వారి అవసరాల దృష్ట్యా వీరికి ముందుగా చెల్లింపులు అవసరమని పేర్కొన్నారు.

కేన్సర్‌పై విజయం ఇప్పుడు సాధ్యమే!

"ఛోమ కేన్సర్ సాధారణంగా కాలేయానికి సోకుతుంది. రోగి ఎక్కువకాలం జీవించడానికి అవకాశం ఉండదు. మీ అద్భుతమైన చికిత్స మరియు ఆ దేవునికి నేను ఎంతగానో రుణపడి ఉంటాను" అని జూన్ 1996లో DS రిసెర్చ్ సెంటర్‌కు ప్రొఫెసర్ కమల్ సింగ్ శర్మ తెలియజేశారు.

ఒకప్పుడు ప్రొఫెసర్ శర్మ మంచి కుటుంబం మరియు ఆరోగ్యంతో పరిపూర్ణ జీవితాన్ని గడుపుతున్నారు. అలా ఉన్న సమయంలో చిన్న అనుమానం కారణంగా శర్మ కుటుంబం, మే 6, 1995న సంవత్సరంలో ఢిల్లీలోని ఒక పేరొందిన ఇన్‌స్టిట్యూట్‌లో పరీక్షలు చేయించగా కాలేయానికి ఛోమ కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తేలింది. స్వల్ప వ్యవధిలో కేన్సర్‌గా మారి ఇతర అవయవాలపై ప్రభావం చూపుతూ దూకుడును పెంచుతుంది. తత్ఫలితంగా మాట్లాడలేకపోవడం, ఆకలి మందగించడం, నిద్రలేమి, వేగంగా బరువు తగ్గడం, నీరసం, రోజురోజుకు నొప్పి పెరగడం జరుగుతుంది. ఇలాంటి సమయంలో పురాతన ఆయుర్వేద DS రిసెర్చ్ సెంటర్ నిపుణులు పోషకాలతో తక్కి నిచ్చే చికిత్స శ్రీ శర్మకు అందించి సరైన సమయంలో అపాయం నుండి కాపాడారు.

కేన్సర్ నా తలుపు తట్టింది, అది నాపై యుద్ధం చేయమని సవాలు చేసింది... తరువాత కొంత అద్భుతం జరిగింది... ...నేను విజయం సాధించాను



ఇప్పుడు "నా బరువు 49 కి.గ్రా. నుండి 50 కి.గ్రా.కు పెరిగి తినాలనే కోరిక కలిగింది. నిద్ర రావడం ప్రారంభమయింది. ఇప్పుడు నా పరిస్థితి మెరుగుపడింది. నేను మొదటి అంతస్తుకు నడవగలుగుతున్నాను. కణాలలో నా విధులకు హాజరవుతున్నాను. నొప్పి పోయింది. గడ్డి, దురద తగ్గిపోయింది. అంటే కామెర్లు తగ్గిపోయాయి. ఇప్పుడు నేను ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్నాను"–శర్మ కళ్ళు కన్నీళ్లతో నిండిపోయాయి.

కమల్ సింగ్ శర్మ ఆరోగ్యం చక్కగా ఉంది. అతను DSRC నిపుణుల సలహాలను ఖచ్చితంగా పాటిస్తున్నారు. తేది. 04-08-98న ఆయన ఇలా తెలియజేశారు "నేను పూర్తిగా కోలుకున్నాను, ఆరోగ్యంగా ఉన్నాను, ఆకలి చాలా పెరిగింది మరియు ఎంతో శక్తిని తిరిగి పొందాను, ప్రస్తుతం నా బరువు 64 కి.గ్రా... ఈ జీవితం నిజానికి మీరు ఇచ్చిన గొప్ప బహుమతి. ఇప్పుడు నేను ఆరోగ్యవంతమైన వ్యక్తిగా సాధారణ జీవితం గడుపుతున్నాను మరియు కేన్సర్ ఎక్కడా లేదు.

కాలేయ, క్లోమ, పిత్తాశయ, ఊపిరితిత్తులు, గర్భాశయ, ఛాతి మరియు బ్లడ్ కేన్సర్ వ్యాధి తీవ్రతతో చివరి క్షణాల్లో జీవితంపై ఆశతో ఎంతోమంది మా వద్దకు వస్తుంటారు. మా బృందం వ్యాధిని తగ్గించడానికి ఎంతో తోడ్పాటునందిస్తారు. వారిలో కొంతమంది 5 నుంచి 8 సం॥లు మరికొంతమంది 10 నుంచి 12 సం॥లు జీవితాన్ని సాగిస్తున్నారు.

కాలేయ కేన్సర్ వ్యాధిగ్రస్తులు 5 నుంచి 6 నెలలు కంటే ఎక్కువ కాలం జీవించడమనేది పూర్తిగా విరుద్ధమైనది లేదా వివిధ అవయవాల సాధారణ స్థితికి రావడమనేది జరగని పని. ఇది నమ్మశక్యం కాని నిజం. దేశంలోని ఇతర కేన్సర్ ఆస్పత్రులు మొదట్లోనే ఎంతోమంది వ్యాధిగ్రస్తులు జీవితాలను కోల్పోయినట్లుగా పరిగణించి తిరస్కరించాయి.

కేన్సర్‌పై విజయానికి మాతో కలసి రండి. కేన్సర్ చికిత్సలపై సహాయం కొరకు ఫోన్: 91009 43142 కాల్ చేయండి. లేదా www.dsresearchcentre.com వద్ద మమ్మల్ని దర్శించండి. ● ADVT

అపూర్వమే

చాలా గొప్పది, చరిత్రాత్మకమైనది అన్న అర్థంలో కూడా 'అపూర్వం' అన్న మాటను వాడుతుంటాము. ఇంతకుముందు ఎన్నడూ జరగనిది, లేనిది అన్న అర్థంలో కూడా ఆ మాటను వాడవచ్చు. గత శనివారం నాడు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం అయోధ్య వివాదం పై ఇచ్చిన తీర్పు అపూర్వమైనది. రెండో అర్థంలో అయితే ఆ మాట నూటికి నూరుపాళ్లు సరిపోతుంది. మొదటి అర్థంలో సరిపోతుందా లేదా రానున్న రోజులు తేల్చాలి. సుమారు 11 వందల పేజీల సుదీర్ఘమైన తీర్పు పత్రాలను అధ్యయనం చేసి, అర్థం చేసుకోవలసింది, అన్వయించుకోవలసింది చాలా ఉంది. తీర్పు సారాంశం ఏమిటో మాత్రం అందరికీ అర్థమైందనే అనుకోవాలి. ఈ తీర్పులోని ఉభయపక్షాలు, నిరాసక్తంగా ఉన్నారా, నిర్లిప్తంగా ఉన్నారా, నిగ్రహంగా ఉన్నారా, స్థితప్రజ్ఞతతో ఉన్నారా తెలియదు కానీ, ప్రశాంతతనే వ్యక్తపరిచారు. బాధపడ్డవారు బాధను ప్రకటించలేదు, సంతోషించగలిగిన వారు కూడా గుంభనంగానే ఉన్నారు. దేశంలో శాంతిభద్రతలను కాపాడ డానికి, సామాజిక సామరస్యాన్ని కొనసాగించడానికి ఇటువంటి పరిస్థితి అవసరమని ప్రభుత్వమూ వివిధ సంస్థల పెద్దలూ చేసిన విజ్ఞప్తిని భారత సమాజం పాటించడం సంతోషించవలసిన అంశం.

సుమారు పదిసంవత్సరాల కిందట అలహాబాదు హైకోర్టు తీర్పు తేదీన కూడా దేశవ్యాప్తంగా అప్రమత్తంగా ఉండవలసి వచ్చింది. పత్రికలను, ఇతర మీడియాను సంయమనం పాటించాలని ప్రభుత్వాలు కోరాయి. భద్రతాయంత్రాంగాన్ని ఎంతో కట్టుదిట్టం చేశారు. ఇప్పుడు ఈ తుది తీర్పు సందర్భంగా ఉద్వేగాలు అదుపు తప్పకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నందుకు బాధ్యులందరినీ అభినందించాలి. 1992లో అయోధ్యలో జరిగిన 'నేరపూరిత' సంఘటనల సందర్భంగా మాత్రం నాటి ప్రభుత్వాలు ప్రమాదాన్ని ఊహించలేకపోయాయి. ఫలితంగా, అనేక దురదృష్టకర పరిణామాలు ఆ వెనువెంటనే, ఆ తరువాత దశాబ్దాలలో పరంపరగాను జరుగుతూ వచ్చాయి. 1986 ఫిబ్రవరి ఒకటో తేదీనాడు ఫైజాబాద్ కోర్టు పూజలను అనుమతించమని తీర్పు ఇచ్చినప్పుడు, మీడియా వెంటనే దాని ప్రాముఖ్యాన్ని గుర్తించనేలేదు. కానీ, అప్పుడు తెరచిన తలుపులు, అనేక ఉద్రిక్తతలను రగిలిస్తూనే వచ్చాయి. ఈ 33 సంవత్సరాల కాలంలో భారత దేశ చరిత్రలో జరిగిన అనేక విషాదాలకు దుర్మార్గాలకు ఈ సంఘటనల పరంపర మూలం. ఇప్పుడిక ఈ క్రమం ఇంతటితో ముగిసిపోతుందని, శాంతి వెల్లివిరుస్తుందంటే ఎవరికి మాత్రం సంతోషం కలుగదు! న్యాయం జరగడం ముఖ్యమే, అదే సమయంలో రాచపుండులా మారిన ఒక కుంపటి ఆరిపోవడమూ అవసరమే. శాంతి కోసం ఎవరు సర్దుబాటు చేసుకోవలసి వచ్చింది, అంతిమంగా ఎవరికి ఎంత నష్టం జరిగింది, వంటి అంశాలు నెమ్మదిగా చర్చల్లోకి రాకుండా పోవు. అటువంటి పోలికలు, అనవసర సమీక్షలు అవసరం లేకుండా, న్యాయస్థానాల అవసరం రాకుండా, ఉభయపక్షాలూ ఒక సహజీవనం కోసం ఒప్పందం చేసుకుని ఉంటే బాగుండేది. శనివారం నాటి తీర్పు వెనుక కూడా అటువంటి ప్రయత్నం జరిగిందని, సాధారణంగా కీలకమైన తీర్పుల వెనుక జరిగే న్యాయవిషయికమైన ప్రక్రియకు తోడు, అదనంగా కక్షిదారులతో చర్చలు, శాంతిభద్రతల అంచనాలు మొదలైనవి నేపథ్యంలో జరిగాయని వార్తలు వస్తున్నాయి. నిజమే కావచ్చు.

సుప్రీంకోర్టు తీర్పులు, ముఖ్యంగా ఇటువంటి కీలకమైన తీర్పులు రానున్న రోజులలో వివిధ సందర్భాలలో ప్రస్తావనకు వస్తాయి. దేశవిదేశాలలో కూడా ఈ తీర్పును ఒక నమూనాగా తీసుకుని పరిశీలిస్తారు. ఈ తీర్పు చట్టబద్ధతను, రాజ్యాంగ నైతికతను పాటించిన తీరును నిపుణులు అంచనాలు వేస్తారు. కాబట్టి, న్యాయమూర్తులు అనేక జాగ్రత్తలు తీసుకుని తీర్పును రచించి ఉంటారు. వివాదాస్పద స్థలాన్ని, మనీదును వేరువేరుగా పరిగణించడం, అయోధ్యవివాదంలో ఇమిడి ఉన్న అంశాలను విశ్వాసం, న్యాయం, చట్టం ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకుని పరిశీలించడం, అంతిమంగా చట్టబద్ధత ఎక్కడా దెబ్బతినకుండా చూడడం అనే సూత్రాన్ని న్యాయమూర్తులు అనుసరించినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఏది ఏమయినా, ఒక ప్రత్యేకమైన సందర్భంలో ఒక ప్రత్యేకమైన పాలనలో, న్యాయస్థానాలు కూడా అనేక ఒత్తిడుల మధ్య నలుగుతున్న సమయంలో వచ్చిన తీర్పు కాబట్టి, దానికి బహుముఖ అన్వయాలు, వ్యాఖ్యానాలు తప్పనిసరి అవుతాయి.

బాధలో ఉన్నవారు దిగమింగడం, వేడుక జరుపుకోవలసినవారు కూడా తమ వ్యక్తీకరణను అదుపు చేసుకోగలగడం నిజంగా అభినందించదగ్గ విషయాలు. దేశప్రజానీకం అభివ్యక్తిమీద ఇంతటి నియంత్రణ కలిగిన నాయకులు, ప్రభుత్వ యంత్రాంగం, అనేక అవాంఛనీయ ధోరణుల విషయంలో కూడా ఈ అదుపును ఉపయోగించగలిగితే బాగుండును. పెద్దలు తప్పు అని చెబితే చాలు, ఆగిపోయే దుర్మార్గాలు ఎన్నో ఉన్నాయి. కానీ, ఎందుకో వారు నోరుతెరిచి చెప్పడం లేదు. సామరస్యం విలువైనదని మాటవరసకైనా నేతలు గుర్తించిన ఈ సమయంలో, ఆ విలువను కొనసాగించడానికి అందరూ ప్రయత్నించాలి.

మూడో కన్ను

మికా అజీజ్

అయోధ్య తీర్పుతో రాజకీయాలు ఆడేందుకు అవకాశం నిజానికి కాంగ్రెస్‌కే లేకుండా పోయింది. హిందువులు, ముస్లింలతో సహా దేశ ప్రజలందరూ వినూత్న భారతాన్ని నిర్మించేందుకు ముందుకు సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత సమైక్యత, సమగ్రతకు అయోధ్య తీర్పు చిహ్నమని, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌కు దేశ ప్రజలంతా కట్టుబడేందుకు సమయం ఆసన్నమైందని హోంమంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. ఎన్నో ఏళ్లుగా దేశ రాజకీయాకాశంలో కమ్ముకున్న దట్టమైన నల్లటి మేఘాలు అయోధ్య తీర్పుతో తొలగిపోయి నిర్మలంగా మారడం కాంగ్రెస్ నేతలకు రుచించని పరిణామమే.

స్వచ్ఛ రాజకీయాల సమీరం

సత్యకాలమ్

వై. సత్యకుమార్

అయోధ్యలో రామజన్మభూమి స్థలంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆహ్వానిస్తున్నామని ఒకవైపు ప్రకటిస్తూనే మరో వైపు కాంగ్రెస్ పార్టీ తన అధికార పత్రిక 'నేషనల్ హెరాల్డ్'లో ఈ తీర్పును విమర్శించిన తీరు ఆ పార్టీ గత ఆరు దశాబ్దాలుగా అనుసరిస్తున్న కుత్సిత వైఖరికి అద్దం పడుతున్నది. అయోధ్యలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా అయిదు గురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్పు పాకిస్థాన్ సుప్రీంకోర్టు తీర్పు మాదిరి ఉన్నదని ఆ పత్రికలో వెలువడిన వ్యాసం వ్యాఖ్యానించడంతో– కాంగ్రెస్ పార్టీ మన న్యాయవ్యవస్థనే అవమానించినట్లయింది విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ కోరుకున్న విధంగానే భారత సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని నేషనల్ హెరాల్డ్ పత్రిక విశ్లేషించడం, అయోధ్యపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఇక భారతీయ జనతా పార్టీకి రాజకీయాలు చేసే అవకాశాలు లేకుండా పోయాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుర్జేవాలా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉన్నది. అయోధ్యలో రామజన్మభూమి వివాదంపై రాజకీయం చేసింది ఎవరు? కాంగ్రెస్ నేతలు చరిత్ర తెలిసే మాట్లాడుతున్నారా– అని ప్రశ్నించుకోవాల్సి ఉంటుంది. వీటికంటే ముందు సుప్రీంకోర్టు ఏ ప్రాతిపదికన ఈ తీర్పు ఇచ్చిందో అర్థం చేసుకోవాల్సి వున్నది.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అయోధ్యలో దాదాపు రెండు శతాబ్దాలుగా నెలకొన్న పరిస్థితి ఆధారంగా ఇచ్చిందన్న విషయం స్పష్టమవుతోంది. 1857లో అక్కడ ఇటుకలతో కూడిన ఇనుప గ్రిల్ కట్టడానికి ముందు నుంచీ హిందువులు పూజలు జరుపుతున్నారన్న దానికి స్పష్టమైన సాక్ష్యాధారాలున్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. 1857కు ముందు, 1528లో బాబ్రీ మసీదును నిర్మించిన నాటి నుండి లోపలి కట్టడంపై తమకు పూర్తిగా హక్కు ఉన్నదని ముస్లిం ప్రతినిధులు ఎలాంటి సాక్ష్యాలు సమర్పించలేకపోయారని తెలిపింది. అంతేకాదు, బాబ్రీ మసీదు ఒక ఖాళీ నేలపై కట్టలేదని, బాబ్రీ మసీదు అడుగున ఇస్లామిక్ వాస్తుకళతో సంబంధం లేని 12వ శతాబ్దపు కట్టడాలు ఉన్నాయని పురావస్తు శాఖ తెలిపిందని కోర్టు స్పష్టం చేసింది. కొన్ని శతాబ్దాలుగా అయోధ్యను సందర్శించిన విదేశీ రచయితలు కూడా అక్కడ రామజన్మభూమి ఉన్నదనే ప్రజల విశ్వాసాన్ని రికార్డు చేశారని సుప్రీంకోర్టు సూచించింది. 1607–1611 మధ్య భారత దేశం సందర్శించిన విలియం ఫ్లించ్, 1766–1711 మధ్య సందర్శించిన ఫాదర్ జోసెఫ్ టైఫెన్ హేలర్ రచించిన పర్యాటక గ్రంథాలనుంచి సుప్రీం కోర్టు ఉటంకించింది. సుప్రీంకోర్టు విశ్వాసాల జోలికి పోలేదు. కనీసం 300 సంవత్సరాల సాక్ష్యాధారాల ప్రాతిపదికన, స్థలంపై ఉన్న హక్కు ఆధారంగానే సమస్యను పరిశీలించింది.

మత రాజకీయాలను అవలంబించి పబ్బం గడుపుకునే కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బిజెపినే మత పార్టీగా ముద్రించే ప్రయత్నాలు చేసింది. 1989లో అయోధ్యలో రామజన్మభూమి వివాదంపై హిమాచల్ ప్రదేశ్‌లోని పాలంపూర్‌లో తొలిసారి చేసిన తీర్మానాన్ని చదివిన వారికి బిజెపి నిజమైన దృక్పథం ఏమిటో అర్థమవుతుంది. మన చరిత్రకు, సంప్రదాయానికి మతరాజ్యం అనేది సరిపోదని బిజెపి అభిప్రాయపడుతోందని పాలంపూర్ తీర్మానం స్పష్టంగా పేర్కొన్నది. 1947లో భారత దేశం మత ప్రాతిపదికగా విభజనకు గురై, పాకిస్థాన్ తనను తాను ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటించుకున్నప్పటికీ, భారత దేశం ప్రస్తుత రాజ్యాంగాన్ని ఎంచుకున్నదని, మత ప్రమేయం లేకుండా పౌరులందరికీ సమానత్వాన్ని ప్రసాదించేందుకు నిర్ణయించిందని బిజెపి వివరించింది. మన రాజ్యాంగ నిర్మాతల ప్రకారం లౌకికవాదం అంటే సర్వ మత సమభావన. అంటే అది మతాతీత రాజ్యం కాదు. అదే సమయంలో మన చరిత్రను, సాంస్కృతిక వారసత్వాన్ని తిరస్కరించడం అంతకంటే కాదని బిజెపి స్పష్టం చేసింది. ఒక మతానికి చెందిన పూజా స్థలంలో మసీదు నిర్మించడం ఇస్లాం మత సూత్రాలకు భిన్నమైనదని తమ మతస్థులకు నచ్చజెప్పాలని, ఆ స్థలాన్ని హిందువులకు అప్పజెప్పాలని, మసీదును మరో చోట నిర్మించాలని కొందరు షియా నేతలు చేసిన ప్రయత్నాలను తాము హర్షిస్తున్నట్లు బిజెపి జాతీయ కార్యవర్గం దాదాపు రెండు దశాబ్దాల క్రితమే తీర్మానించింది. నెహ్రూ ప్రభుత్వం సోమనాథ్ మందిరం విషయంలో అవలంబించిన సానుకూల వైఖరినే అయోధ్య పట్ల కూడా అవలంబించాలని నాటి కాంగ్రెస్ సర్కార్‌కు బిజెపి పిలుపునిచ్చింది. కోర్టుల్లో కంటే పరస్పర సంప్రదింపులకే బిజెపి ఎక్కువ విలువ ఇచ్చిందని, విపి సింగ్ నుంచి పివి నరసింహారావు వరకు నిజాయితీగా రామజన్మభూమి వివాదాన్ని పరిష్కరించేందుకు చర్చలు జరిపిందని, చారిత్రకాధారాలతో పాటు రెవిన్యూ రికార్డులు కూడా సమర్పించిందని ఇటీవలి చరిత్ర చదివిన వారికెవరికైనా అర్థమవుతుంది. నిజానికి 1885 నుంచీ ఇప్పటి వరకూ జరుగుతున్న పరిణామాలు, చారిత్రకాధారాల ప్రాతిపదికన విషయాన్ని పరిశీలించినందువల్లే కోర్టులు న్యాయం ఎవరివైపు ఉన్నదో తేల్చగలిగాయి.

రామమందిర నిర్మాణ లక్ష్యానికి తాము మద్దతునిస్తూనే ముస్లిం సోదరుల మనోభావాలను గాయపరచకుండా చూస్తామని బిజెపి రామజన్మభూమికోసం ఉద్యమం ప్రారంభించిన నాడే స్పష్టం చేసింది. వివాదాస్పద కట్టడాన్ని గౌరవంగా మరో చోటకు బదిలీచేసి అక్కడ మసీదు నిర్మించేందుకు అనుకూలంగా ఉన్నామని ప్రకటించింది. హిందూ, ముస్లిం సహకారంతో మసీదు నిర్మించవచ్చని స్పష్టం చేసింది. భారతీయ జనతా పార్టీ కోరుకుంటున్న న్యాయం దిశగానే న్యాయస్థానాలు ఆలోచించడం యాదృచ్ఛికమే అయినప్పటికీ బిజెపి న్యాయసమ్మతంగా ఆలోచిస్తున్నదన్న విషయాన్ని స్పష్టం చేశాయి. ఇన్నాళ్లకు సుప్రీంకోర్టు ఈ వివాదంపై తెరదించి దేశంలో కోట్లాది ప్రజలు కోరుకుంటున్న న్యాయాన్ని అందించాయి. రాజకీయ ప్రయోజనం కోసమే అయోధ్య సమస్యను బిజెపి తలెత్తుకోలేదన్న విషయం ఈ న్యాయంతో స్పష్టమయింది.

చరిత్రలో అనేక రాజకీయ కారణాల వల్ల సామ్రాజ్యవాదుల దండయాత్రల్లో పాత కట్టడాల స్థానంలో కొత్త కట్టడాలను నిర్మించారు. పోలెండ్‌లోని వార్సా నగరాన్ని రష్యా తొలిసారి ఆక్రమించుకున్నప్పుడు (1614–1915) రష్యన్లు ప్రధాన కూడళ్లలో ఒక ఈస్ట్రన్ ఆర్థడాక్స్ క్రిస్టియన్ కేథడ్రల్‌ను నిర్మించారు. 1918లో పోలెండ్ స్వాతంత్ర్యం పొందిన తరువాత దాని ప్రజలు ఈ కేథడ్రల్‌ను కూలదోశారు. రష్యన్లు దాన్ని మతపరమైన కారణాలతో కాక రాజకీయ కారణాలతో నిర్మించారని పోలెండ్ ప్రజలు భావించారు. భారత దేశంలో అలాంటి పరిణామాలేవీ జరగలేదు. భారత దేశంలో ఇప్పటికీ ఔరంగ జేబు నిర్మించిన మసీదులు ఎన్నో ఉన్నాయి. ఢిల్లీలోనే కాదు, దేశంలో ఎందరో నవాబుల సమాధులున్నాయి. వారు నిర్మించిన కట్టడాలను మనం ఇప్పటికీ సాంస్కృతిక వారసత్వంగానే భావిస్తున్నాం. తాజ్ మహల్ లాంటి ప్రదేశాలను పర్యాటక స్థలాలుగా ప్రకటించుకున్నాం. ఇదే భారత దేశ లౌకికవాద స్వరూపం. కాని ఈ లౌకిక వాదం కుహనా లౌకికవాదంగా మారడాన్ని భారతీయ జనతా పార్టీ వ్యతిరేకించింది. భారత జాతీయ వ్యక్తిత్వానికి స్పష్టమైన ఆధారంగా మన సాంస్కృతిక వారసత్వ సంపదను పటిష్ఠం చేసుకోవాల్సిన కర్తవ్యాన్ని ప్రజలకు తెలియజేసింది. అయోధ్య తీర్పుతో రాజకీయాలు ఆడేందుకు అవకాశం నిజానికి కాంగ్రెస్‌కే లేకుండా పోయింది. హిందువులు, ముస్లింలతో సహా దేశ ప్రజలందరూ వినూత్న భారతాన్ని నిర్మించేందుకు ముందుకు సాగాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. భారత సమైక్యత, సమగ్రతకు అయోధ్య తీర్పు చిహ్నమని, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌కు దేశ ప్రజలంతా కట్టుబడేందుకు సమయం ఆసన్నమైందని హోంమంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. ఎన్నో ఏళ్లుగా దేశ రాజకీయాకాశంలో కమ్ముకున్న దట్టమైన నల్లటి మేఘాలు అయోధ్య తీర్పుతో తొలగిపోయి నిర్మలంగా మారడం కాంగ్రెస్ నేతలకు రుచించని పరిణామమే. మోదీ సారథ్యంలో స్వచ్ఛమైన రాజకీయాల దిశగా దేశం సాగుతున్న నేపథ్యంలో వారు తెరమరుగయ్యే క్రమంలో ఉన్నారు.

(బిజెపి జాతీయ కార్యదర్శి)

ఇక్ ఓంకార్ : గురు నానక్ వాణి

■ ఎం. వెంకయ్య నాయుడు



భారత ఉపరాష్ట్రపతి

దైవ సమానుడు గురు నానక్ దేవ్. సాధువు, సంస్కర్త, కవి, గాయకుడు అయిన నానక్ ప్రపంచ మహోన్నత ఆధ్యాత్మిక వేత్తలలో ఒకరు. ఈ కార్తీక పౌర్ణమి ఆ పుణ్యాత్ముని 550వ జయంత్యుత్సవ శుభ దినం. మానవాళిలో శాంతి సామరస్యాలు, సమత, సర్వతోముఖ శ్రేయస్సును పెంపొందించడంలో ఆ రుషితుల్యుని భావాలు, ఆలోచనలు, ప్రబోధాలు మున్నెన్నడూ లేని విధంగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్న సందర్భమిది.

నేటి మన ప్రపంచం అంతకంతకూ సంకుచిత లక్ష్యాలు, పాక్షిక దృష్టి, మతోన్మాదం, వితండవాదంతో ఎక్కడికెక్కడ తన చుట్టూ గోడలు కట్టుకుంటున్నది. వ్యక్తులు, సమాజాలు, జాతులను అవిరామంగా ఆవరిస్తోన్న చిమ్మచీకట్లు, కలవరపరుస్తోన్న నిరాశామయ చిత్తవృత్తుల నుంచి బయట పడేందుకు గురు నానక్, ఆయన వారసులైన ఇతర ప్రసిద్ధ పారమార్థికులు నిర్దేశించిన జ్ఞాన, జీవనపథాలను మనం అనుసరించవలసివున్నది. తమసోమా జ్యోతిర్గమయ.

గురు నానక్ లాంటి జ్ఞానశీలురు, మార్గదర్శకుల సార్వకాలిక సందేశాలు మన ప్రపంచ దృక్పథాన్ని అనుశృతంగా విశాలపరుస్తున్నాయి. సామాన్య మానవులు చూడలేని వాటిని నానక్ దేవ్ వంటి ద్రష్టలు దర్శిస్తారు. సత్యాన్ని తమ దివ్యచక్షువులతో చూస్తారు; ప్రవక్తల్లా ప్రవచిస్తారు. తమ భావాలు, అంతర్ వివేకంతో వెలుగులు సారించి ప్రజల జీవితాలను సమున్నతం చేస్తారు. నిజానికి 'గురు' అనే మాటకు అర్థం ఇదే. లోకం పోకడను ఉత్తమ మార్గాలలోకి మళ్ళించి, జనుల సందేహాలు, సంశయాలను తొలగించి, వారి జీవితాలలో ప్రకాశాన్ని ప్రదీప్తం చేసే ఉదాత్తుడే గురువు.

వృత్తి, ప్రవృత్తి ఏవైనప్పటికీ మనలో ప్రతి ఒక్కరూ గురు నానక్ దేవ్ లాంటి మహోదాత్తుల బోధనల నుంచి నేర్చుకోవల్సింది ఎంతో వున్నది. ఆ మహానుభావుడు సమ భావ స్రష్ట, సమతా ధర్మ సంస్థాపకుడు. కులం, మతం, భాష ఆధారిత బహుళ అస్తిత్వాలు, అంతరాలను ఆయన అంగీకరించలేదు. నిర్ద్వంద్వంగా నిరాకరించారు. నానక్ ముని ఇలా అన్నారు: 'కులం అర్థరహితం. జన్మ సంబంధిత అభిజాత్యాలు, విలక్షణతలు నిష్ఫలం. పరాత్పరుడు సకల జీవులకు ఆశ్రయమిచ్చాడు'. ఎటువంటి హెచ్చు తగ్గులులేని కుల రహిత, సమతా సమాజాన్ని సృష్టించేందుకు నానక్ సంకల్పించారు. స్త్రీలను పరిపూర్ణంగా గౌరవించడం, ఆడపడుచులకు అన్నిటా సమాన ప్రతిపత్తి కల్పించి స్త్రీ పురుష అంతరాలను అంతమొందించడం గురునానక్ జీవితం నుంచి మనం నేర్చుకోవల్సిన మరొక మానవతా పాఠం. మహిళల గురించి ప్రస్తావిస్తూ గురు నానక్ ఇలా అన్నారు: 'పురుషులకు జన్మనిస్తున్న మహిళలు, మగవారి కంటే ఎలా అల్పులు? భగవంతుని కృపకు పురుషులతో పాటు స్త్రీలూ సమానంగా అర్హులు. పురుషుల వలే స్త్రీలూ తమ చర్యలకు దేవుడికి జవాబుదారీలే'.

నానక్ దృష్టిలో ఈ చరాచర జగత్తంతా భగవంతుని సృష్టి (జీయే కా ఇక్ దాతా). సకల మానవులూ సమానులుగా పుట్టారు. ఒకే ఒక్క దేవుడు మాత్రమే వున్నాడు. ఆయనే విశ్వ స్రష్ట 'ఇక్ ఓంకార్ సత్నామ్'. ఈ విశ్వమంతా ఒకే కుటుంబమని ఉద్ఘాటించిన వేద సుభాషితం 'వసుధైవ కుటుంబకం' స్ఫూర్తితో గురు నానక్ దేవ్ ఇలా అన్నారు: 'ఇది నాది, అది నీది అనే అవధులతో ఆలోచించడం ఆపివేసినప్పుడు, నీ మీద ఆగ్రహించే వాడు ఒక్కడూ వుండడు. ఇది నా సొంతం, నాకే సొంతం అని మురిసిపోతే, అప్పుడు నీవు విషమ సమస్యల్లో చిక్కుకుంటావు. అయితే సృష్టి కర్తను గుర్తించి, గౌరవిస్తే నిన్ను ఎవ్వరూ ఆరడి పెట్టరు, యాతనల నుంచి విముక్తమవుతావు'.

శాంతియుత సహ జీవనం, సామరస్యంతో ప్రవర్తించడం, కలసికట్టుగా పనిచేయడం అనేది గురు నానక్ కీర్తనలన్నింటా కన్పించే ఒక సుసంగత సూత్రం. నానక్ దేవ్ జీ గురించిన ఒక అసాధారణ విషయమేమిటంటే సిక్కు మత మౌలిక ధర్మాలన్నిటినీ ప్రవచించడమే కాకుండా తన ప్రబోధాలు సంపూర్ణంగా ఆచరణలో ఉండేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలనూ తీసుకోవడం. సిక్కు మత విశిష్టత ఇది. సామూహికంగా ఆహారాన్ని భుజించడం అనే సదాచారం రూపేణా సమతా ధర్మాన్ని ఆయన వ్యవస్థీకరించారు. సిక్కు మత ఆరాధనా మందిరాలైన గురుద్వారాలలోని 'లంగర్'లో కుల మతాలు, భాషా ప్రాంతాలకు అతీతంగా 'పంగత్' అనే వరుసలో అందరూ కూర్చొని సామూహికంగా ఆహారాన్ని తీసుకోవడం ఒక సమున్నత సంప్రదాయంగా అమలవుతూ వస్తోన్నది. ఈ భోజనపు పంక్తిలో చక్రవర్తి, నిరుపేద సమానులే. వారి మధ్య ఎటువంటి తేడాలుండవు. పక్కపక్కనే కూర్చుని ఆహారాన్ని భుజిస్తారు.



గురు నానక్ దార్శనికత సార్వకాలికమైనది. ఐదు శతాబ్దాల క్రితం ఆయన ప్రప్రథమంగా వివరించినప్పుడు అది ఎంత సుసంగతమైనదో ఇప్పుడూ అంతే ఉపయుక్తమైనది. గురునానక్ వాణి అజరామరమైనది. ఆ మహాత్ముని సందేశాలను మనం అంతరీకరించుకోవాలి. మన నిత్య జీవితాలతో సమన్వయపరుచుకోవాలి. తద్వారా మనం నవ్యరీతుల్లో ఆలోచించగలుగుతాము. కొత్త పద్ధతుల్లో కార్యాచరణలకు ఉపక్రమించగలుగుతాము. ఇది జరిగినప్పుడు మాత్రమే మనం శాంతి సామరస్యాలతో, నిరంతరాయ అభివృద్ధితో విలసిల్లే కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము.

క్రీస్తు శకం 16వ శతాబ్దంలో అంటే ఐదు శతాబ్దాల క్రితమే గురు నానక్ అంతర్ మత సంభాషణలకు చొరవ చూపడం అత్యంత గమనార్హం. తన కాలం లోని సకల మతాల పెద్దలు, విద్వద్ పరులతో నానక్ విస్తృత స్థాయిలో సంభాషణలు జరిపారు. వివిధ మతాలలోని అన్ని శాఖల వారితో కూడా ఎటువంటి తరతమ బేధాలు లేకుండా ఆయన సమాలోచనలు చేశారు. ఈ విద్వత్ గోష్ఠులతోనే ఆయన 'మతాలు వేరైనా దేవుడు ఒక్కడే' అన్న సత్యావిష్కరణ చేశారు. మన సమకాలీన ప్రపంచంలో శాంతి సామరస్యాలు, సుస్థిరత, సహకారాన్ని వృద్ధిపరిచేందుకు విభిన్న విశ్వాసాలు, భావజాలాలు, ధర్మాచరణలు గల వ్యక్తులు, వ్యవస్థలు, దేశాల మధ్య అర్థవంతమైన చర్చలు జరగవలసిన అవసరం ఎంతైనా వున్నది. ఇందుకు మనం గురునానక్ వంటి ఆధ్యాత్మికవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలి. గురునానక్ దార్శనికత ఆచరణాత్మకమైనది, పరిపూర్ణమైనది. ధర్మరక్షణకు సన్యాస జీవితాన్ని అవలంబించాలనే దృక్పథాన్ని అది అంగీకరించదు. పరిత్యాగాలతో భ్రష్టమైన సంఘజీవితాన్ని ఎవరూ ఉద్ధరించ లేరు. ప్రజల జీవితాలతో క్రియాశీలంగా తాదాత్మ్యం పొందే ప్రభావశీల దార్శనికతే గురునానక్ నిర్దేశించిన జ్ఞాన, జీవిత పథం.

ప్రాపంచిక సుఖాలను నిరాకరించే బైరాగి లేదా తాపసి, విలాసవంతమైన జీవితాన్ని గడిపే భోగ పరాయణుడు ఇరువురితోనూ గురు నానక్ విభేదించారు. అవి సరైన జీవన మార్గాలు కాదని ఆయన భావించారు. మధ్య మార్గమే అంటే గృహస్థాశ్రమమే ఉత్తమ మార్గమని ఆయన విశ్వసించారు. కుటుంబ జీవితాన్ని నిండుగా ఆస్వాదించిన వారే సమాజానికి మేలు చేయగలుగుతారని ఆయన భావించారు. ఒక వ్యక్తి సామాజిక పురోగతికి, సుఖ సౌఖ్యాల సమృద్ధికి, ఆధ్యాత్మిక సమున్నతికి గృహస్థాశ్రమమే ఆదర్శ మార్గమని నానక్ ప్రబోధించారు. స్వీయ అనుష్ఠానంతో లోకానికి ఆదర్శంగా నిలిచారు. పని, ఆరాధన, దాయం (కిర్త్ కరో, నామ్ జపో, వాండ్ ఛాకో) అనేది గురునానక్ తన శిష్యులకు నిర్దేశించిన ధర్మ సూత్రం. నిజాయితీగా శ్రమించి, ఆర్జించినదాన్ని అవసరాలలో ఉన్నవారితో పంచుకోవాలని ఆయన ఉపదేశించారు. సమాజంలో మంచి స్థితిలో ఉన్న వారు తమ సిరిసంపదలలో, పేదలకు వాటా కల్పించాలని ఆయన బోధించారు. ఈ బోధనను ఆచరణయోగ్యంగా చేయడానికే 'దస్వాంద్' (ఆర్జించిన దానిలో పదో వంతును అవసరాలలో ఉన్నవారికి దానం చేయడం) భావనను గురునానక్ ప్రవేశపెట్టారు.

గురు నానక్ దేవ్ ఒక అపూర్వ రుషిసత్తముడు. వివిధ మతాల ఉత్తమ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక చింతనా ధోరణులను ఆయన స్ఫూర్తిదాయకంగా సమన్వయపరిచారు. మన పంజాబ్‌లోని సిక్కు దైవ మందిరం డేరా బాబా నానక్ సాహిబ్‌ను, పాకిస్థాన్‌లోని కర్తార్ పూర్‌లో గల గురుద్వారా దర్బార్ సాహిబ్‌తో అనుసంధానం చేసేందుకు ఒక నడవాను ప్రారంభించడం ఎంతైనా ముదావహం. (గురునానక్ తన జీవితంలోని అంతిమ అష్టా దశ సంవత్సరాలను కర్తార్ పూర్ పుణ్యక్షేత్రంలోనే గడిపారు). కర్తార్ పూర్ నడవా భారత్, పాకిస్థాన్ యాత్రికులు ఆ పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు విశేషంగా దోహదం చేస్తుంది. గురు నానక్ దార్శనికత సార్వకాలికమైనది. ఐదు శతాబ్దాల క్రితం ఆయన ప్రప్రథమంగా వివరించినప్పుడు అది ఎంత సుసంగతమైనదో ఇప్పుడూ అంతే ఉపయుక్తమైనది. గురునానక్ వాణి అజరామరమైనది. ఆ మహాత్ముని సందేశాలను మనం అంతరీకరించుకోవాలి. మన నిత్య జీవితాలతో సమన్వయపరుచుకోవాలి. తద్వారా మనం నవ్యరీతుల్లో ఆలోచించగలుగుతాము. కొత్త పద్ధతుల్లో కార్యాచరణలకు ఉపక్రమించగలుగుతాము. ఇది జరిగినప్పుడు మాత్రమే మనం శాంతి సామరస్యాలతో, నిరంతరాయ అభివృద్ధితో విలసిల్లే కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము.

(నేడు గురు నానక్ 550వ జయంతి)

రైతు శ్రేయస్సే శివాజీ శ్వాస

ఆయన ఒక సాదాసీదా రైతు బిడ్డలాగా కనిపిస్తారు. రైతుల మధ్య తిరుగుతూ రైతు సంక్షేమం కోసం అహర్నిశలు ఆవేదన చెందుతూ, రైతు సమస్యలపై వ్యాసాలు రాస్తూ ఉంటారు. మట్టి మనిషిలా కనిపించే ఆయన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదివిన ఆర్థిక వేత్త అని, ఎంబిబిఎస్ డాక్టర్ అయినా వైద్యాన్ని వదిలి పొలాల్లో ప్రవేశించారని ఎంతమందికి తెలుసు? ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఆర్థిక వేత్త, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆయన స్నేహితుడని, ఢిల్లీలో ప్రతి సంవ

లీగల్ కౌన్సెలింగ్

గిఫ్ట్‌గా ఇచ్చి అమ్మితే...

మా అమ్మమ్మ వయసు 70 ఏళ్లు. ఆమెకు నలుగురు కొడుకులు, ఒక కూతురు. ఆమె కూతురుకు నేను ఒకే ఒక్క సంతానాన్ని. మా అమ్మానాన్న చనిపోయిన తరువాత మా అమ్మమ్మే నన్ను తీసుకువెళ్లి, చదివించి పెద్దదాన్ని చేసింది. ఆమె 1970లో 5 సెంట్ల భూమిని కొనుగోలు చేసింది. అందులోని రెండున్నర సెంట్లల్లో ఇల్లు కట్టుకుని మిగతా రెండు

న్నర సెంట్ల స్థలాన్ని ఖాళీగా ఉంచింది. ఆ ఆస్తిని ఆమె 2006లో నాకు గిఫ్ట్‌గా రిజిస్టర్ చేసింది. ముందుగా ఈ విషయం మా మేనమామలకు తెలియదు. ఆ విషయం తెలిసిన వెంటనే అంటే 2008లో - మా అమ్మమ్మ చేత రివోకేషన్ (రద్దు) రిజిస్ట్రేషన్ చేయించారు. రెండున్నర సెంట్లలో నిర్మాణమైన ఇంట్లో ఆమె నివసిస్తున్నది. పన్ను, కరెంటు నీటి పన్ను అన్నీ ఆమె పేరు మీదే ఉన్నాయి. అయితే ఖాళీగా ఉన్న మిగతా రెండున్నర సెంట్ల భూమిని మా అమ్మమ్మ చేత 2010లో అమ్మించారు. ఆ స్థలం కొన్న వ్యక్తి ఇల్లు కట్టుకుని అందులో నివసిస్తున్నాడు. ఇంటిపన్ను కూడా అతని పేరుతోనే కడుతున్నాడు. చెన్నైలో ఉంటున్న నాకు ఈ విషయాలు 2011లో తెలిశాయి. వెంటనే అక్కడికి వెళితే 'ఆమె అనారోగ్యంగా ఉన్నప్పుడు నువ్వు ఆమెను పట్టించుకోలేదు. ఆమె నీకు గిఫ్ట్‌గా రాసిన భూమిని రివోకేషన్ రిజిస్టర్ చేసింది. అందువల్ల నీకు ఈ ఇంటి మీద ఏ హక్కులూ లేవు' అంటూ దుర్భాషలాడి నన్ను ఇంట్లోకి రాకుండా గెంటివేశారు. నా ఆస్తిని నేను తిరిగి రాబట్టుకునే మార్గమేమిటో తెలియచేయండి?

- జి. హరిత, రాజమండ్రి

ఎవరైనా తన ఆస్తిని రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ ద్వారా వేరొక వ్యక్తికి స్వాధీనపరిచినప్పుడు, ఆ వ్యక్తికి తనకు తానుగా ఆ గిఫ్ట్ డీడ్‌ను రివోకేషన్ చేసే అధికారం లేదు. కాకపోతే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అంటే గిఫ్ట్‌డీడ్‌ను మోసపూరిత చర్యల ద్వారా, ఇతరులను భయభ్రాంతులకు గురిచేస్తూ తప్పుడు విధానాలతో పొందినప్పుడు మాత్రమే రివోక్ చేసే అధికారం ఉంది. అది కూడా న్యాయస్థానం ద్వారా మాత్రమే ఆ గిఫ్ట్‌డీడ్‌ను క్యాన్సిల్ చేసే అధికారం ఉంటుంది. అంతే తప్ప, న్యాయస్థానం ద్వారా కాకుండా తనకు తానుగా రివోక్ చేసే అధికారం ఉండదు. అలాంటి అధికారం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సివిల్ కోర్టుకు మాత్రమే ఉంటుంది. మీ అమ్మమ్మ తాను గిఫ్ట్‌డీడ్ ద్వారా మీకు స్వాధీనపరిచిన ఆస్తిని మీ మేనమామల ప్రోద్బలంతో రివోక్ (రద్దు) చేసినప్పటికీ, ఆ రివోకేషన్‌కు చట్టపరమైన విలువ లేదు. అందువల్ల మీకు గిఫ్ట్‌డీడ్ ద్వారా సంక్రమించిన ఆస్తి వేరే వ్యక్తికి చెందదు. హక్కులేమీ లేకపోయినా మీ అమ్మమ్మ ఆ భూమిని వేరే వ్యక్తికి అమ్మినప్పటికీ, ఆ కొన్న వ్యక్తికి ఆ ఆస్తిపై ఏ విధమైన హక్కులూ సంక్రమించవు. మీ అమ్మమ్మకు మీ గిఫ్ట్ డీడ్‌ను కోర్టు ద్వారా మాత్రమే రివోకేషన్ చేసే అధికారం ఉంటుంది. అలా కాకుండా ఆమె తనకు తానుగా రివోకేషన్ చేసినట్లయితే అది చట్టపరంగా చెల్లదు. మీకు ఈ విషయాలు 2011లోనే తెలిశాయి కాబట్టి మీరు వెంటనే స్థానికంగా ఉన్న నిపుణుడైన న్యాయవాదిని సంప్రతించి మిమ్మల్ని గిఫ్ట్ డీడ్ ద్వారా సంక్రమించిన ఆస్తికి యజమానిగా గుర్తించమని, ఎవరికైతే అమ్మి రివోకేషన్ చేశారో ఆ సేల్‌డీడ్‌నూ, రివోకేషన్ డీడ్‌నూ రద్దుపరచమని కోరండి. అలాగే వేరే వ్యక్తి కబ్జాలో ఉన్న మీ ఆస్తిని మీకు దఖలుపరిచేలా సివిల్ దావా వేయండి. మీకు తప్పనిసరిగా న్యాయం జరుగుతుంది. మీకు తప్ప మీ మేనమామలకు గానీ, ఆ ఆస్తిని కొన్న వ్యక్తికి గానీ, ఆ ఆస్తిపై ఏ విధమైన హక్కులూ సంక్రమించవు.

● **ఒడ్నాల శ్రీహరి**
న్యాయవాది
హైదరాబాద్

స్ఫూర్తి

కుటుంబ కదంబం

వైకల్యాన్ని జయించి ఉన్నత విద్యనూ, విదేశంలో ఉద్యోగాన్నీ సాధించినా... అక్కడితో చాలని ఆమె రాజీపడిపోలేదు! తనకన్నా పెద్ద వైకల్యాలతో బాధపడుతున్న వారి కోసం ప్రాజెక్ట్ 'ఐరిస్'కు శ్రీకారం చుట్టారు. అంధుల కోసం సరికొత్త పరికరం తయారు చేసి 'ఔరా' అనిపించుకున్నారు. అమెరికాలోని ఫ్లోరిడాలో సిస్టమ్ ఎనలిస్ట్‌గా పని చేస్తున్న విశాఖ మహిళ సేరి నిరత్ సంజన ప్రయాణం ఓ నవతరం స్ఫూర్తి గాథ!

అంధులకు... వినిపించే కనుపాప

"నాకు పుట్టుకతోనే వినికిడి లోపం ఉంది. అయితే ఏడాది వయసు వచ్చేవరకూ మా తల్లితండ్రులు లీలాకాంత్, నివేదిత గుర్తించలేకపోయారు. ఎవరైనా పిలిచినా, మాట్లాడినా నేను స్పందించకపోవడంతో నన్ను వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్ళారు. పరీక్షల్లో నాకు వినికిడి సమస్య ఉందని నిర్ధారణ అయింది. అయితే ఆ లోపం కారణంగా నాకు ఏ ఇబ్బంది కలగకుండా పెంచాలనీ, ఆ సమస్య నాకు శాపం కాకూడదనీ మా అమ్మానాన్న తపించారు. అందరి పిల్లల్లానే నేనూ ఆడుతూపాడుతూ చదువుకోవాలని ఆరాటపడ్డారు. 'ఏం చేయాలా..' అని ఆలోచిస్తున్న తరుణంలో వారికి ఓ శుభవార్త తెలిసింది... నాలాంటి సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చెన్నైలోని బాల విద్యాలయంలో శిక్షణ ఇస్తున్నారని! నన్ను వెంటనే తీసుకువెళ్లి అందులో చేర్పించారు. అక్కడ నాలుగేళ్లపాటు శిక్షణ ఇప్పించారు. వినికిడి సమస్యతోపాటు చిన్నతనంలో మాటలు రాకపోవడంతో అమ్మానాన్న ఎంతగానో బాధపడ్డారు. మూడేళ్ల శిక్షణ తరువాత 'అమ్మ', 'అప్పా' వంటి చిన్న చిన్న మాటలు మాట్లాడడంతో ఉబ్బితబ్బిబ్బైపోయారు. వినికిడి సమస్యతో పాటు నాకు మాటలూ కూడా రావని వాళ్ళు ఎంతో బెంగపడేవారు. నా నోటి నుంచి మాట రావడంతో వాళ్ల ఆనందానికి అవధుల్లేవు.

నేరుగా ఒకటో తరగతిలో..

చెన్నైలో నాలుగేళ్ల శిక్షణ తరువాత విశాఖపట్నం తీసుకువచ్చి, నేరుగా ఒకటో తరగతిలో చేర్పించారు. మాటలే రావనుకున్న నాకు మాటలు రావడం, స్కూల్‌కు వెళ్లడం కొత్తగా అనిపించింది. కానీ అప్పటి నుంచీ కొత్త సమస్యలు మొదలయ్యాయి. వినికిడి పరికరం ఉన్నా స్కూల్లో టీచర్లు చెప్పేవి అర్థంకాక ఇబ్బందిపడేదాన్ని. ఇంటికి వచ్చాక ఆ రోజు స్కూల్లో చెప్పిన పాఠాలను మళ్లీ అమ్మతో చెప్పించుకొని ఒక అవగాహనకు వచ్చేదాన్ని. అదే సమయంలో ప్రతిరోజూ అమ్మానాన్న నాతో ఇంకా బాగా మాట్లాడించడానికి ఎంతో ప్రయత్నించేవారు. నీతి కథలు, భిన్నమైన స్టోరీలు చెబుతుండేవారు. ఎక్కువ భాషలతో ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో మొదట ఇంగ్లీష్, ఆ తరువాత తెలుగు భాషను కొద్దిగా నేర్పించారు.

సామర్థ్యంపై భరోసా...

పదో తరగతి తరువాత ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ పూర్తి చేశాను. ఇంజనీరింగ్‌లో మంచి కాలేజీలో చేరాలన్న ఉద్దేశంతో ఇంటర్‌లో ఎంతో కష్టపడి చదివాను. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ పరీక్షలో 158వ ర్యాంకు రావడంతో నా సామర్థ్యంపై విశ్వాసం పెరిగింది. చెన్నై ఐఐటీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ పూర్తిచేశాను. ఫైనలియర్ చదువుతున్న సమయంలో ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీలో ప్రాజెక్టు ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. అయితే ఉన్నత చదువులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఉద్యోగాన్ని వదులుకున్నా.

అంధుల బాధలు కళ్లారా చూశా...

అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీలో 2015లో ఎంఎస్‌లో చేరాను. మాస్టర్స్ చేస్తున్న సమయంలో సెకండ్ సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చింది. అప్పుడే అంధుల కోసం ఏదైనా భిన్నమైన పరికరాన్ని రూపొందించాలన్న ఆలోచన కలిగింది. వినికిడి సమస్యతోనే నేను ఎన్నో బాధలు అనుభవిస్తే... ఇక ఈ లోకాన్నే చూడలేనివారు ఇంకెన్ని రకాల ఇబ్బందులు పడుతుంటారోనన్న ఆలోచన నాకు చిన్నప్పటి నుంచీ ఉంది. వాళ్ళు ఎదుర్కొనే ఎన్నో సమస్యలను కళ్లారా చూశాను. వారి ఇబ్బందులను కొంతైనా తీర్చడానికి ఏదైనా చేయాలనుకున్నాను. నేను ఇంటర్న్‌షిప్ ద్వారా చేయాలనుకున్న ప్రాజెక్టు వారికి ఉపయోగపడేలా ఉండాలనుకున్నాను. అందుకు అనుగుణంగా 'ఐరిస్' పేరుతో చేపట్టిన ఆ ప్రాజెక్టు ద్వారా సరికొత్త పరికరాన్ని రూపొందించాను.

పాల్ నేతృత్వంలోని మా బృందం రెండేళ్లపాటు ఈ ప్రాజెక్టు కోసం ఎంతో కష్టపడింది.. మా ప్రాజెక్టు గురించి తెలుసుకున్న అమెరికాకు చెందిన 'నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్' సంస్థ ఆర్థికంగా సాయం చేసి ఎంతగానో ప్రోత్సహించింది. నేను ఎదుర్కొన్న ఇబ్బందుల కంటే అంధులు ఎదుర్కొనే సమస్యలు ఎన్నో రెట్లు పెద్దవి. వారికి ఎంతో కొంత సహాయం చేయాలన్న ఉద్దేశంతోనే ఈ పరికరానికి రూపకల్పన చేశాను. ఈ పరికరం వారి సమస్యలను కొంతైనా తొలగిస్తుందనుకుంటున్నా. అమెరికాలో ప్రస్తుతం దీన్ని సుమారు వంద మంది వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి తీసుకువస్తాం."

● **బి. శ్రీనివాస్**
ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

హెచ్చరిస్తుంది... దారి చెబుతుంది!

"అధునాతన సెన్సర్లు, నావిగేషన్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేను 'ఐరిస్' పరికరాన్ని రూపొందించాను. త్రీడీ కెమెరా, వైబ్రేషన్ సెన్సార్, బ్లూ టూత్ ద్వారా పనిచేసే హెడ్ ఫోన్స్, బ్యాక్ బ్యాగ్‌లో బుల్లి పవర్‌ఫుల్ కంప్యూటర్లను మేము పొందుపరిచాం. మొబైల్ అప్లికేషన్‌ను వినియోగించాం. వీటన్నింటి సహాయంతో 'ఐరిస్' పరికరం పని చేస్తుంది. ఈ భాగాలన్నీ కంప్యూటర్‌తో అనుసంధానమై ఉంటాయి. ఈ 'ఐరిస్' పరికరాన్ని కలిగిన వ్యక్తి ముందుభాగంలో కంప్యూటర్ ఉంటుంది. ఈ కెమెరా త్రీ డైమెన్షన్‌లో ఫొటోలను తీస్తుంది. అణువణువూ క్షుణ్ణంగా పరిశీలించి బుల్లి కంప్యూటర్‌కు సమాచారాన్ని చేరవేస్తుంది. పరికరాన్ని ధరించిన వ్యక్తి ప్రయాణించే మార్గంలో ఏదైనా వాహనం, ఇతర వస్తువులు గానీ అడ్డు వస్తే వెంటనే అప్రమత్తం చేస్తుంది. కంప్యూటర్ కనెక్ట్ చేసి ఉన్న వైబ్రేషన్ సెన్సార్ ఆన్ అవుతుంది. ఆ వ్యక్తి ముందుకు వెళ్లకుండా ఆగిపోయేలా చేస్తుంది. ఎదురుగా వస్తువో, వ్యక్తో అడ్డంగా ఉంటే, అయిదు అడుగుల ముందుగానే ఫోటోని తీసి, దాని వివరాలను హెడ్‌ఫోన్ ద్వారా తెలియజేస్తుంది. దాన్ని బట్టి తరువాత ఎటువైపు వెళ్ళాలో ఆ వ్యక్తికి తెలుస్తుంది. దీని ద్వారా చాలావరకు ప్రమాదాలు నివారించేందుకు అవకాశం ఉంది. అదే సమయంలో మొబైల్ అప్లికేషన్‌లో తమకు కావాల్సిన ప్రదేశాల గురించి తెలియజేస్తే... ఆ ప్రదేశం చేరేంత వరకూ మార్గదర్శకత్వాన్ని 'ఐరిస్' అందిస్తుంది."

స్టయిల్

హ్యాండ్‌బ్యాగ్ కొంటున్నారా..?

ప్రస్తుతం కాలేజీ అమ్మాయిల నుంచి ఉద్యోగానికి వెళ్లే మహిళల దాకా ఎవరి చేతిలో చూసిన హ్యాండ్‌బ్యాగ్ ఉంటోంది. సౌకర్యంగా, ఫ్యాషన్‌గానూ ఉండే ఇవి అనేక డిజైన్లు, రంగుల్లో లభిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ట్రెండ్‌కు తగ్గట్టుగా, స్టయిల్‌గా ఉండే వాటిని ఎంచుకోవడం చాలా ముఖ్యం. హ్యాండ్‌బ్యాగ్ కొనే ముందు గుర్తుంచుకోవాల్సిన విషయాలేమంటే...

సైజ్: ఎంత సైజు బ్యాగు అయితే మీకు నప్పుతుందో చూసుకోవాలి. మరీ చిన్నదిగా, మరీ పెద్దదిగా ఉండేవి కొంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. మీ ఎత్తును బట్టి మోకాళ్లు, నడుము వరకు ఉండే హ్యాండ్‌బ్యాగ్స్‌ను ఎంచుకోవచ్చు.

మన్నిక: హ్యాండ్‌బ్యాగ్ స్టయిల్‌గా ఉందని చెప్పి ఎక్కువ ఖరీదు పెట్టి కొనొద్దు. ఎక్కువ రోజులు మన్నికగా ఉండే లెదర్ బ్యాగులనే కొనాలి. ఉద్యోగానికి వెళ్లేవారయితే మీరు రోజూ వెంట తీసుకెళ్లే మొబైల్, వాలెట్, లంచ్‌బాక్స్ పట్టేంత స్థలం ఉండే హ్యాండ్‌బ్యాగ్ తీసుకోవాలి.

మ్యాచింగ్: మార్కెట్లో రకరకాల రంగులు, డిజైన్లలో బోలెడు హ్యాండ్‌బ్యాగులు దొరకుతాయి. ఆకుపచ్చ, ఊదా రంగులో ఉండే హ్యాండ్‌బ్యాగ్స్ చాలా కలర్‌ఫుల్‌గా ఉంటాయి. అయితే మీ వార్డ్‌రోబ్‌లోని దుస్తులకు మ్యాచ్ అయ్యేవి కొంటే పార్టీ, ఫంక్షన్ల వేళ ప్రత్యేకంగా కనిపిస్తారు.

వైరల్

ఒకే ఒక్క విజిటింగ్ కార్డ్... ఒక పనిమనిషి జీవితాన్నే మార్చేసింది. నెట్టింట రాత్రికి రాత్రి పాపులర్ చేసేసింది. పని పోయి దిగాలుగా ఉన్న ఆమెకు లెక్కకు మించిన ఆఫర్లు తెచ్చిపెట్టింది. ఇంతకీ ఎవరామె? అంతగా ఏముందా విజిటింగ్ కార్డులో? మీరే చదవండి.

ఒక్క విజిటింగ్ కార్డు... జీవితాన్నే మార్చేసింది!

గీతా కామ్లే... పుణేలోని బవధాన్ ప్రాంతంలో పనిమనిషి. అక్కడి ఇళ్లల్లో పని చేసుకొంటూ తన కుటుంబాన్ని పోషిస్తోంది. తిండికి ఇబ్బంది లేకుండా గడిచిపోతున్న ఆమెకు ఉన్నట్టుండి కుదుపు. ఓ ఇంటి యజమాని గీతను పనిలో నుంచి తొలగించింది. అక్కడ పని పోవడంతో ఆమెకు నెల నెలా ఆ ఇంటి నుంచి వచ్చే రూ.4 వేల జీతం ఆగిపోయింది. గీతది రెక్కాడితే కానీ డొక్కాడని జీవితం. ఒక్కసారిగా అంత డబ్బు రాకపోతే ఇక కుటుంబ భారాన్ని మోసేదెట్టా? ఆ పరిస్థితి తలుచుకుని ఆమె దిగాలు పడిపోయింది. అక్కడి నుంచి అదే ప్రాంతంలోని ధనశ్రీ షిండే ఇంటికి వెళ్లింది. రోజూ పని చేసే ఇల్లే! కానీ... ఆ రోజు ఆ ఇంటి ఇల్లాలు తన పాలిట దేవత అవుతుందని అప్పుడు ఆమెకు అర్థం కాలేదు.

బాధను అర్థం చేసుకుని...

ఇంటికి వచ్చిన గీత దిగులుగా ఉండటం గమనించింది ధనశ్రీ. ఎందుకలా ఉన్నావని అడిగింది. 'ఓ ఇంట్లో పనిలో నుంచి నన్ను తీసేశారు. వచ్చే జీతం పోయింది' అంటూ ఎంతో బాధగా చెప్పింది గీత. నిజానికి గీత పనిలో నిర్లక్ష్యం ఉండదు. ఇసుమంతైనా విసుగు కనిపించదు. రంచనుగా వస్తుంది. ఎవరికీ ఏ ఇబ్బందీ లేకుండా చకచకా ఇంటి పనంతా చేసి వెళ్లిపోతుంది. అందుకే గీత బాధను అర్థం చేసుకుంది ధనశ్రీ. తనకు నెల నెలా పక్కాగా జీతం వచ్చేలా ఏదైనా సాయం చేయాలనుకుంది. కానీ ఎలా?

మెరుపులాంటి ఆలోచన...

మార్కెటింగ్ రంగంలో పనిచేస్తున్న ధనశ్రీకి మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. అదే గీత పేరుతో విజిటింగ్ కార్డ్ తయారు చేయాలని! వెంటనే దానికి రూపం ఇచ్చింది ధనశ్రీ. తానే డిజైన్ చేయించి, ఓ వంద కార్డులు ప్రింట్ చేయించింది. వాటిని తన చుట్టుపక్కల వారికి పంచిపెట్టింది. సామాజిక మాధ్యమాల్లోనూ పోస్ట్ చేయమని కోరింది. అలా ఆ ప్రాంతంలోని అస్మితా జవ్‌దేకర్ తన ఫేస్‌బుక్ పేజీలో ఆ విజిటింగ్ కార్డ్‌ను తన వాల్‌పై ఉంచింది. అది మొదలు 24 గంటల్లో ఆ విజిటింగ్ కార్డ్ షేర్స్, లైక్స్‌తో నెట్టింట తెగ చక్కర్లు కొట్టింది. గీత పేరు, ఆమె బాధ... అందరికీ అర్థమైంది. ఇప్పుడామె ఫోన్ మోగడం ఆగితే ఒట్టు! 'మా ఇంట్లో పనిమనిషి అవసరమంటే... మాకు అవసరమంటూ' ఆఫర్ల మీద ఆఫర్లు వచ్చిపడుతున్నాయి. ఇవి చూసి గీత ఉబ్బితబ్బిబ్బవుతోంది.

గీత, ధనశ్రీ

అందులో ఏముందంటే..!

ఆ విజిటింగ్ కార్డ్‌లో గీత పేరు, ఫోన్ నంబర్ ఎలాగూ ఉంటాయి. వాటితో పాటు 'గిన్నెలు శుభ్రం చేయడానికి రూ.800, ఇల్లు ఊడవడానికి రూ.800, బట్టలు ఉతకడానికి 800, రోటీలు చేయాలంటే రూ.1,000' అని గీత చేయగల పనులు... వాటికి ఎదురుగుండా తీసుకొనే జీతం వివరంగా పేర్కొంది ధనశ్రీ. కింద 'ఆధార్ కార్డ్ వెరిఫైడ్' అని కూడా రాసింది. కార్డ్ అడుగున ఆమె నైపుణ్యం గురించి మరింతగా తెలిసేలా... 'అవసరమైతే కూరగాయల కటింగ్, దుమ్ము దులపడం వంటివి కూడా చేస్తుంది' అంటూ పేర్కొంది. అంటే ఒక్క విజిటింగ్ కార్డు చూస్తే చాలు... మరే వివరాలూ అడగకుండానే గీతను పనిలో పెట్టుకొనేలా రూపొందించిన ధనశ్రీ సృజనకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. 'ఒక్క ఆలోచన ఒకరి జీవితాన్ని ఇంతలా ప్రభావితం చేయగలదా' అంటూ ఆమెను అభినందిస్తున్నారు. చేతినిండా 'పని'తో గీత జీవితం ఆనందమయం కావాలని కోరుకొంటున్నారు.

బ్యూటీ

చర్మం తాజాగా...

ఉద్యోగం చేసే మహిళలకు చర్మ సంరక్షణ మీద దృష్టి పెట్టేంత తీరిక ఉండదు. అయితే కొద్ది సమయంలోనే చర్మాన్ని మెరిపించేందుకు కొన్ని టిప్స్ పాటిస్తే సరి. అవేమిటంటే...

షవర్ బాత్: ఆఫీస్ పని ముగించుకొని ఇంటికి వచ్చాక షవర్ బాత్ చేస్తే రిలీఫ్‌గా ఉంటుంది. వేడినీళ్లతో షవర్ స్నానం చేస్తే చర్మ రంధ్రాలు తెరచుకుంటాయి. తరువాత నిమ్మ రసంతో మోచేతులు, మోకాళ్లు , పాదాల వద్ద మసాజ్ చేసినట్టు రాసుకోవాలి. తరువాత గోరువెచ్చని నీళ్లతో కడుక్కోవాలి. దీంతో మృతకణాలు తొలగి, చర్మం మృదువుగా మారుతుంది.

సహజ మాస్క్: రోజ్‌వాటర్‌లో యోగర్ట్ కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా వేసుకోవాలి. పావుగంటయ్యాక గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. తరువాత మాయిశ్చరైజర్ అప్లై చేయాలి.

కళ్ల మీద ఒత్తిడి తగ్గేలా: ల్యాప్‌టాప్, కంప్యూటర్ స్క్రీన్ వంక ఎక్కువ సమయం చూడడం వల్ల కళ్ల మీద ఒత్తిడి పడుతుంది. కీరదోస ముక్కల్ని 15 నిమిషాలు కళ్ల మీద ఉంచాలి. కీరలోని యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు కళ్లను రిలాక్స్ చేస్తాయి. కళ్ల కింద వలయాలు తొలగిపోతాయి.

అధ్యయనం

రుతుక్రమంలో తేడాలుంటే...

మరీ అంత నిర్దిష్టంగా ఏదీ ఉండదు కదా! రుతుక్రమం తేదీలు అటుఇటుగా మారిపోతే మాత్రం ఏమవుతుంది.? అనుకునే మహిళలే ఎక్కువ. అయితే ఆ తేడాలను అతి సాధారణ విషయాలుగా అనుకోవడం చాలా ప్రమాదకరం అంటున్నారు పరిశోధకులు 'అమెరికన్ సొసైటీ ఫర్ రిప్రొడక్టివ్ మెడిసిన్'లో ప్రచురితమైన ఒక వ్యాసంలో ఈ విషయాలే చర్చకు వచ్చాయి. అధ్యయన కారుల అభిప్రాయం ప్రకారం, దీర్ఘకాలంగా రుతుక్రమం తేడాలు ఉన్న వారి జీవితకాలం వివిధ కారణాల వల్ల బాగా తగ్గిపోతోంది. వీరిలో కొందరు గుండె జబ్బులతో మరణిస్తే, మరికొందరు కొన్ని ప్రాణాంతక వ్యాధులతో మరణిస్తున్నారు. బహిష్టు క్రమం తప్పడం కేవలం మహిళల లైంగిక రుగ్మతలకు మాత్రమే సంబంధించింది అనుకుంటే పొరపాటే. అది చాలా సార్లు ప్రధాన జీవక్రియలను కుంటుపరిచే మెటబాలిక్ సిండ్రోమ్ సమస్యకు మూలం కూడా కావచ్చు. రుతుక్రమ సంబంధమైన ఏ సమస్యలూ లేని వారితో పోలిస్తే, ఈ తేడాలు ఉన్నవారు తరచూ పలు వ్యాధులతో బాధపడుతున్నారని అంతిమంగా ఇవి వారి జీవిత కాలాన్ని తగ్గించి వేస్తున్నాయి. అందువల్ల రుతుక్రమ తేడాలను మహిళలంతా ఎదుర్కొనే అతి సామాన్య విషయం అనుకుంటే అది పొరపాటే, రుతుక్రమంలో వచ్చే ఏ తేడా అయినా, అది మొత్తం శరీర వ్యవస్థకు సబంధించిన లోపాన్ని ఎత్తి చూపుతుంది. ఆ లోపం కొన్ని సార్లు వారి జీవితకాలాన్నే దెబ్బ తీసే విధంగా ఉంటుందని అధ్యయనకారులు గుర్తు చేస్తున్నారు. ఏమైనా, రుతుక్రమం తేడాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆ తేడాలను ఎప్పుటికప్పుడు వైద్య చికిత్సల ద్వారా చక్కదిద్దుకోవాల్సిందే!. ఈ విషయంలో చూపే ఏ నిర్లక్ష్యమైనా వారికి క్షేమకరం కాదని తెలుసుకోవాలి.

ఆయుర్వేదం

కమ్మని నిద్ర కోసం...

రాత్రి కంటి నిండా నిద్ర పోయినప్పుడే మరుసటి రోజుకు అవసరమైన శక్తి సమకూరుతుంది. కానీ కొన్నిసార్లు ఎంత అలసటగా ఉన్నా నిద్ర కంటి మీదకు రాదు. ఇలాంటప్పుడు నిద్ర పట్టేలా చేసే ఈ 'స్లీప్ టానిక్' ఉపయోగించాలి.

బాదం పాలు ఇలా... ఈ పానీయం ప్రధానంగా బాదం పాలతో తయారవుతుంది. బాదం పాల తయారీకి నీళ్లలో కప్పు బాదం పప్పులు రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే తోలు తీసి, బ్లెండర్‌లో ముద్దలా చేసుకోవాలి. తర్వాత నాలుగు కప్పుల నీళ్లు, చిటికెడు హిమాలయన్ ఉప్పు చేర్చి తిప్పాలి. వడగట్టి పక్కన పెట్టుకోవాలి.

టానిక్ కోసం... రెండు కప్పుల బాదం పాలు, నాలుగు ఖర్జూరాలు, ఒక టేబుల్ స్పూన్ నెయ్యి, ఒక టేబుల్ స్పూను తేనె, అర టీస్పూను యాలకుల పొడి, పావు టీస్పూను కుంకుమ పువ్వు అవసరం అవుతాయి. పాన్‌లో బాదం పాలను వేడిచేసి ఈ పదార్థాలన్నీ కలిపి బ్లెండర్‌లో వేసి తిప్పాలి. తర్వాత గ్లాసులో నింపుకుని తాగాలి. ఇలా ప్రతి రోజూ క్రమం తప్పకుండా చేస్తే కంటి నిండా కమ్మని నిద్ర పడుతుంది.

హార్మోనల్ హెల్త్

మా వారి సమస్యకు విరుగుడు లేదా?

డాక్టర్! మా పెళ్లై ఇప్పటికి నాలుగేళ్లు. ఇప్పటివరకూ పిల్లలు కలగలేదు. ఇందుకు కారణం మా వారికి స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడమేనని వైద్యులు చెప్పారు. దాంతో మందులు వాడడం మొదలుపెట్టాం. మందులు వాడినప్పుడు తాత్కాలికంగా పెరుగుతూ, ఆపగానే తిరిగి స్పెర్మ్ కౌంట్ తగ్గిపోతోంది. దాంతో వైద్యులు పిల్లల కోసం ఐ.వి.ఎఫ్‌ను ఆశ్రయించమని అంటున్నారు. మా వారికి స్పెర్మ్ కౌంట్ నిలకడగా ఉండి, సహజసిద్ధంగా మేము పిల్లలను కనే అవకాశమే లేదా?

- ఓ సోదరి, మచిలీపట్నం.

మందులు వాడినప్పుడు స్పెర్మ్ కౌంట్ పెరుగుతుంది కాబట్టి మీ వారికి పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించి తీవ్రమైన సమస్యలు లేనట్టే! అయితే మందులకు స్పందిస్తూ, ఆపగానే కౌంట్ తగ్గిపోవడానికి మూల కారణాన్ని కనిపెట్టాలి. వృషణాలలో ఇన్‌ఫెక్షన్, హార్మోన్లలో హెచ్చుతగ్గులు, వేరికోసిల్ సమస్యలు ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి తలెత్తవచ్చు. కాబట్టి మీ వారికి సంబంధిత పరీక్షలు చేయించండి. ఫలితాన్ని బట్టి చికిత్స చేస్తే స్పెర్మ్ కౌంట్ ఎప్పటికీ నిలకడగా ఉంటుంది. ఐ.వి.ఎఫ్‌తో పని లేకుండా, పిల్లలను కూడా సహజసిద్ధంగా కనవచ్చు. వీర్యకణాలకు సంబంధించిన సమస్యలకు సమర్థమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఆందోళన చెందకుండా మీ వారిని ఆండ్రాలజిస్ట్‌కు చూపించి, తగిన వైద్యం చేయించండి.

- డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్
8332850090
(కన్సల్టేషన్ కోసం)

ఆహారం-ఆరోగ్యం

మార్కెట్లో బోలెడన్ని వంట నూనెలు. వాటిలో ఏ నూనెను ఎంచుకోవాలి? అనే విషయంలో అంతటా అయోమయమే! సరైన నూనెను ఎంచుకుంటే హృద్రోగాలు, కొలెస్ట్రాల్ అడ్డంకులు, ఊబకాయం లాంటి ఇబ్బందుల నుంచి తప్పించుకోవచ్చు. ఇందుకోసం ఏ నూనెను, ఎంత మోతాదులో, ఎలా వాడాలో తెలుసుకోవాలి!

ఏ నూనె మేలు?

మనకు రోజుకు 20 నుంచి 30 గ్రాముల కొవ్వు పదార్థమే అవసరం. అయితే సగటున వంట నూనెల ద్వారా 50 నుంచి 60 గ్రాములకు పైగా తినేస్తున్నాం.

- నెయ్యి, వెన్న, డాల్డాల్లోని శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో చెడు కొలెస్టరాల్‌ను పెంచుతాయి అందువల్ల వీటిని మానేయడమే మేలు.
- మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఉండే నూనెల్లో శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్లు తక్కువ మోతాదులో ఉంటాయి.
- శరీరానికి అవసరమైన కొవ్వు పదార్థాలను ఎక్కువ మోతాదులో అందించేది మూడవరకమైన పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు. వీటిల్లో శరీరానికి ఎంతో అవసరమయ్యే లినోలిక్ యాసిడ్, ఆల్ఫా లినోలిక్ యాసిడ్ అనే రెండు రకాల కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఈ రెండూ రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి తోడ్పడతాయి. ప్రత్యేకించి ఆల్ఫా లెనోలిక్ యాసిడ్ రక్తనాళాల్లో కొవ్వు సంబంధ పదార్థాలు పేరుకోవడం (అథిరోస్క్లెరోసిస్), రక్తం గడ్డకట్టడం (థ్రాంబోసిస్), పొరల వాపు లాంటి వాటిని తగ్గించడంలో బాగా సహకరిస్తుంది. ఈ ఆల్ఫాలెనోలిక్ యాసిడ్ మనలో పెరగడానికి గోధుమలు, సజ్జలు, పెసలు, రాజ్‌మా, సోయా చిక్కుడు, ఆకుకూరలు తీసుకోవడం అవసరం!

మన వంటగదిలో ఉపయోగించే నూనెలు ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటాయి. కేరళలో 'కొబ్బరినూనె', తెలుగు రాష్ట్రాలు, రాజస్థాన్‌లలో 'నువ్వులనూనె', ఈశాన్య, ఉత్తర భారతదేశంలో 'ఆవ నూనె', సెంట్రల్ ఇండియా, గుజరాత్‌లలో 'వేరుసెనగనూనె... ఇలా ప్రాంతాలను బట్టి వాడే నూనెలు భిన్నంగా ఉంటున్నాయి. వేర్వేరు సంస్కృతుల ఆహారశైలి వేర్వేరుగా ఉంటుంది కాబట్టి ఆ నూనెలు వారి ఆహారంలో చక్కగా ఇమిడిపోయాయి. అయితే ఇదంతా 1980ల వరకే! కొలెస్ట్రాల్, దాంతో వచ్చే గుండె జబ్బుల భయాలు మొదలవడంతో రాత్రికి రాత్రే నెయ్యి వాడకం ప్రాణాంతకం అన్నంతగా భయాలు ఏర్పడ్డాయి. ట్రాన్స్ ఫ్యాట్స్ మానేస్తే మేలు అనే ఆలోచనతో పూర్తిగా పొద్దుతిరుగుడు నూనె వైపు ఆకర్షితులయ్యాం. 1990లలో పరిస్థితి ఇది. కానీ ఇప్పుడు ఇందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. ప్రపంచీకరణ ప్రభావంతో ఎన్నో రకాల నూనెలు మార్కెట్లోకి వచ్చిపడ్డాయి. పోషకాలపరంగా కొత్త అవగాహన కల్పించే లేబుళ్లతో వంటకు ఏ నూనెను ఎంచుకోవాలో తేల్చుకోలేనంతగా అయోమయానికి గురి చేస్తున్నాయి. అయితే అన్నిటికంటే ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం ఏంటంటే.... వేడి చేసినప్పుడు నూనెల ప్రవర్తన, చిక్కదనం, రంగు, రుచి, పోషక విలువలు మారతాయి.

నూనెలతో చేటు ఎప్పుడంటే....

కొన్నిరకాల నూనెల్లో కొలెస్ట్రాల్ లేకపోయినా, అవే నూనెల్ని అవసరానికి మించి వాడితే, మన శరీరమే ఆ కొవ్వు నుంచి కొలెస్ట్రాల్‌ను తయారు చేస్తుంది. అందులో చెడు కొలెస్టరాల్ (ఎల్.డి.ఎల్) ఎక్కువగా ఉంటే, అది రక్తనాళాల్లో పేరుకుపోతుంది. ఒకవేళ మంచి కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే, చెడు కొలెస్టరాల్‌ను తొలగించి అది రక్తనాళాలను శుభ్రం చేస్తుంది. ప్రాణాల్ని కాపాడుతుంది.

వంటకు ఏ నూనె ఆరోగ్యకరం?

నూనెలు వృక్షసంబంధమైనవి, జంతు సంబంధమైనవి అనే రెండు రూపాల్లో దొరుకుతున్నాయి. వీటిలో వృక్షసంబంధమైనవైన వేరుసెనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, ఆవ నూనె, ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెలు మేలు. జంతు సంబంధమైన వనస్పతి, నెయ్యి తక్కువ వాడడం ఉత్తమం.

- గానుగ నుంచి తీసిన అన్ రిఫైన్డ్, సూపర్ మార్కెట్‌లో దొరికే రిఫైన్డ్ నూనెల్లో ఏది మేలు అనే సంశయం కూడా కలుగుతూ ఉంటుంది. కానీ ఈ రెండూ వేటికవి ప్రత్యేకం. గానుగ నూనెలు నేరుగా సేకరించినవి. కాబట్టి వీటిలో మలినాలు, కలుషితాలు ఉండే అవకాశం ఉండదు. అయితే రిఫైన్డ్ నూనెలను తయారుచేసే సమయంలో వాటికి అదనపు విటమిన్లు జోడించడం జరుగుతుంది. రిఫైన్ చేసే క్రమంలో కొన్ని పోషకాల నష్టమూ జరుగుతుంది. కాబట్టి వీటిలో దేన్నైనా వాడుకోవచ్చు.
- పరిమితంగా వాడినంత కాలం ఏ నూనె అయినా ఆరోగ్యకరమే! నూనెలో ముంచి తయారుచేసిన వేపుళ్లు కాకుండా తక్కువ నూనెతో వండిన వంటకాలు ఆరోగ్యకరం.
- వేర్వేరు నూనెల్లో వేర్వేరు పోషకాలు ఉంటాయి కాబట్టి అన్నిటినీ పొందాలంటే నూనెలను తరచుగా మారుస్తూ ఉండాలి.

నూనె మరిగిస్తే...

ప్రతి నూనెకూ 'స్మోకింగ్ పాయింట్' ఉంటుంది. ఎంత ఉష్ణోగ్రత వరకూ వేడి చేయడం సురక్షితమో నిర్ణయించేదే... 'స్మోకింగ్ పాయింట్'. ఆ పరిధి దాటితే నూనె విడిపోయి, దాన్లోని హానికారక రసాయనాలు బయల్పడతాయి. నూనెల్లోని పాలీఅన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీయాసిడ్లు కాస్తా, ట్రాన్స్‌ఫ్యాట్స్‌గా మారతాయి. ఇవి పదార్థాల రుచిని మార్చడంతో పాటు, ఆరోగ్యానికీ చేటు చేస్తాయి. మరిగే నూనెల్లో వేయించిన బజ్జీలు, పకోడీలు లాంటి వేపుళ్లు ఇష్టంగా తింటూ ఉంటాం. కానీ అలాంటి వేపుళ్ల సమయంలో నూనె 170 డిగ్రీల సెంటీగ్రేడు మించిపోతుంది. ఆ దశలో విడుదలయ్యే ఫ్రీ ర్యాడికల్స్, ట్రాన్స్‌ఫ్యాట్స్ ఆరోగ్యానికి చేటు చేస్తాయి. అలాగే వాడిన నూనెనే పదే పదే వాడే అలవాటు కూడా మనకు ఉంటుంది. ఇది కూడా ప్రమాదకరమే!

వేర్వేరు నూనెల్లోని వేర్వేరు పోషకాలన్నీ అందుకోవాలంటే ప్రతి రెండు నెలలకోసారి నూనెను మారుస్తూ ఉండాలి.

నూనెకు బదులుగా...

- వేరుసెనగ పప్పులను గానీ, నువ్వులను గానీ దోరగా వేయించి, వాటిని పొడి చేసి, పొడిని కూరల్లో వాడుకోవాలి.
- పచ్చి కొబ్బరి తురుము గానీ, పచ్చి కొబ్బరి పాలుగానీ వంటల్లో వాడవచ్చు.

మరీ వేడి చేయకండి!

- మరీ అతిగా శుద్ధి చేసిన నూనెల్ని వాడకూడదు. అలా వాడడం వల్ల శరీరంలో కణుతులు ఏర్పడే ప్రమాదం ఉంది.
- కేక్‌లు తయారు చేయడానికి ఎక్కువగా వాడే డాల్డాలో హైడ్రోజనరేటెడ్ కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి రక్తంలో కొలెస్ట్రాల్‌ను పెంచడం ద్వారా రక్తనాళాలు మూసుకుపోయేలా చేస్తాయి. ఇతర కొవ్వు పదార్థాలు శారీరక శ్రమ వల్లనో, వ్యాయామం వల్లనో తగ్గే అవకాశం ఉంది. కానీ ఈ హైడ్రోజనరేటెడ్ ఫ్యాట్స్ మాత్రం ఎంత శ్రమించినా తగ్గవు.
- ఒకసారి వాడిన నూనెనే రెండవ సారి వాడకం మరింత ప్రమాదం. ఇలా వాడటం వల్ల అల్సర్లు, పైల్స్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలకు అవకాశం ఉంది. మహిళల్లో పీ.సీ.ఓ.డీ సమస్యలు కూడా తలెత్తవచ్చు.
- ప్రతి నూనెలోనూ ఒక విశేష అంశం ఉన్నప్పటికీ, అన్ని రకాల నూనెల్ని వాడటం ఆచరణ సాధ్యం కాదు. అందువల్ల ఉదయం ఒక రకం నూనె, రాత్రి ఒక రకం నూనె వాడినా చాలు!
- ఏ నూనెను అయినా తక్కువ ఉష్ణోగ్రతలోనే వేడి చేయడం శ్రేయస్కరం!

- డాక్టర్ బి. జానకి
న్యూట్రిషనిస్టు

అతిగా వాడకండి!

"నిజానికి నూనెలో స్వతహాగా కొలెస్ట్రాల్ అనే పదార్థం ఉండదు. శరీర అవసరానికి మించి నూనె వాడినప్పుడు, అందులోని కొవ్వు పదార్థం (నూనె) కొలెస్ట్రాల్‌గా మారుతుంది. ఎక్కువైన కొవ్వు పదార్థం నుంచి కాలేయం ఎక్కువ కొలెస్ట్రాల్‌ను ఉత్పత్తి చేస్తుంది.

నూనెలో కొవ్వు పదార్థం మాత్రమే ఉంటుంది. గింజగా ఉన్నప్పుడు కొవ్వు పదార్థంతో పాటు ఇతర పోషక పదార్థాలు, పీచు పదార్థాలు, సహజమైన ఎంజైములు, విటమిన్లు ఉంటాయి. వీటితో పాటు కొవ్వుకు విరుగుడుగా పనిచేసే పీచుపదార్థాలు, లెసిథిన్, ఆర్జినైన్ గింజల్లో ఉంటాయి. మనం గింజలను తిన్నప్పుడు అవి తమలోని కొవ్వు పదార్థం ఏకంగా కొలెస్ట్రాల్‌గా మారకుండా నిరోధిస్తాయి.

- నూనె వాడకం వల్ల అందులోని కొవ్వు నిదానంగా లివరు కణజాలంలో పేరుకోవడం మొదలెడుతుంది. దాని వల్ల లివరులో కొవ్వు పేరుకుని ఫ్యాటీ లివర్ సమస్య తలెత్తే ప్రమాదం కూడా ఉంది.
- రక్తంలో ఎక్కువైన కొలెస్ట్రాల్ రక్తనాళాల గోడలకు పేరుకుపోయి, రక్తనాళాలు మూసుకుపోయేట్లు చేస్తుంది. రక్త ప్రసరణలో వచ్చే ఈ అంతరాయం వల్ల అధిక రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం వంటివి వచ్చే అవకాశం ఉంది.
- ఎక్కువగా కొవ్వు పదార్థాలు తినే వారికి ఎక్కువ ఇన్సులిన్ అవసరం అవుతుంది. అతిగా నూనె పదార్థాలు తినేవారిలో ఇన్సులిన్ శక్తి తగ్గిపోతుంది. అంతిమంగా ఇది మధుమేహానికి దారి తీస్తుంది.
- నూనె జీర్ణం కావాలంటే కాలేయం ఎక్కువ కష్టపడాలి. నూనె రూపాన్ని పూర్తిగా మార్చి, చిన్న చిన్న అణువులుగా విడగొట్టి జీర్ణం చేయాలంటే లివర్ శక్తి ఎక్కువగా వృథా అవుతుంది. లివర్ శక్తిని వృథా చేసే ఆహారాలు రోగ నిరోధక వ్యవస్థను దెబ్బ తీస్తాయి.

- డాక్టర్ టి. కృష్ణమూర్తి
సూపరింటెండెంట్,
రెడ్‌క్రాస్ సొసైటీ యోగా అండ్ నేచర్ క్యూర్ హాస్పిటల్, హైదరాబాద్

- డాక్టర్ శ్రీకాంత్ అప్పసాని
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్.

నూనెల్లో ఆరోగ్యం...

శాచ్యురేటెడ్ (హానికారకం)	మోనో అన్‌శాచ్యూరేటెడ్ (ఫరవాలేదు)	పాలీ అన్‌శాచ్యురేటెడ్ (మంచివి)
కొబ్బరి నూనె	ఎర్రపామ్ నూనె	కుసుమ నూనె
నెయ్యి	పామోలిన్ నూనె	పొద్దు తిరుగుడు నూనె
డాల్డా	తవుడు నూనె	పత్తి గింజల నూనె
పామ్ కెర్నల్ నూనె	నువ్వుల నూనె	సోయా నూనె
	వేరుసెనగ నూనె	

జలుబు నుంచి ఉపశమనానికి...

హోమియో

వర్షంలో తడవడం వల్ల గానీ, చలి గాలి వల్ల గానీ, కొందరికి జలుబు, జ్వరం వస్తుంటాయి. ఈ స్థితిలో ముక్కు నుంచి, కళ్ల నుంచి నీళ్లు కారడం, మంటలు, ముక్కు దిబ్బెడ, తుమ్ములు, ముక్కుదూలం మంట, శ్వాసపరమైన ఇబ్బంది. జ్వరం లాంటి లక్షణాలు ఉంటాయి. ఈ సమస్యలకు అనుసరించవలసిన హోమియో వైద్యం ఇదే!

- శీతాకాలపు చలిగాలిలో తిరిగినందువల్ల హఠాత్తుగా ముక్కు నుంచి నీళ్లు కారడం, చలి జ్వరం, ముక్కు దిబ్బడ ఉంటే ఎకోనైట్- 30 మందు బాగా పనిచేస్తుంది.
- కొద్దిపాటి జ్వరం, జలుబు, ముక్కు దిబ్బెడ, తుమ్ములు, మొదలైన తొలిదశలో ఫెర్రంఫాస్ - 30 మందును వాడవచ్చు.
- దగ్గు, జ్వరం, ముఖం కమిలి, ఉబ్బడం వంటి లక్షణాలు కనిపిస్తే బెల్లడోనా- 30తో మంచి ఉపశమనం లభిస్తుంది.
- ముక్కులోంచి జిగటగా పసుపు రంగు స్రావాలు ఊరుతున్నప్పుడు, పల్సటిల్లా -30 మందు వేసుకుంటే ప్రయోజనం ఉంటుంది.
- తుమ్ములతో పాటు ముక్కు నుంచి నీరు కారడం, తల బరువు, పోట్లు, దాహం వంటి లక్షణాలు ఉంటే బ్రయోనియా - 30 మందు ఉపయుక్తం.
- ఒంటి నొప్పులు, జలుబు, తుమ్ములు, నీరు కారడం ఉంటే జెల్సీమియం - 60 మందు మేలు.
- నిరంతరంగా తుమ్ములు రావడంతో పాటు జలుబు, కళ్ల మంటలు ఉంటే సెబాడిల్లా- 30 మందు వేసుకుంటే త్వరితంగా ఉపశమనం లభిస్తుంది.
- చిక్కని స్రావాలు రావడంతో పాటు, ముక్కు, గొంతులో నొప్పి, మంటలు, తమ్ములు ఉంటే మెర్క్‌సాల్ -200 మందు శ్రేష్టం.

డైలీ సుడోకు-191

			9				4	
1		9			2			3
	6			7			2	
5		4			3	8		
8								1
		3	5			4		2
	8			2			1	
6			8			2		4
	3				9			

సుడోకు - 190 సమాధానం

5	6	7	9	3	8	1	2	4
2	3	9	5	1	4	8	7	6
1	8	4	7	6	2	9	3	5
8	7	6	4	2	9	3	5	1
4	2	1	6	5	3	7	8	9
9	5	3	8	7	1	4	6	2
3	1	8	2	4	5	6	9	7
7	4	5	3	9	6	2	1	8
6	9	2	1	8	7	5	4	3

ఎలా పూరించాలి? ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

అనుష్క

కథానాయిక ప్రాధాన్య చిత్రాలకు చిరునామాగా మారారు అనుష్క. 'రుద్రమదేవి', 'భాగమతి' చిత్రాల భారాన్ని భుజాన మోశారు. ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని, తన చిత్రాలకు ప్రత్యేక మార్కెట్‌ని అనుష్క సొంతం చేసుకున్నారు. అందుకని, ఆమెకు భారీ పారితోషికం ఇవ్వడానికి నిర్మాతలు ముందుకొస్తున్నారు. అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'నిశ్శబ్దం'. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మిస్తున్నారు. జనవరిలో విడుదలయ్యే ఈ చిత్రానికి అనుష్కకు అక్షరాలా మూడున్నర కోట్లు పారితోషికం ఇచ్చారట! అలాగే, హీరో మాధవన్‌కు నాలుగున్నర కోట్లు ఇచ్చారట! సినిమాలో హీరో హీరోయిన్ల పారితోషికాలే 8

వాళ్లిద్దరికీ రూ.8 కోట్లు అట!

కోట్ల రూపాయలు అని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అంజలి, షాలినీ పాండే, హాలీవుడ్ నటుడు మైఖేల్ మ్యాడసన్, సుబ్బరాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు. అందువల్ల, ఖర్చుకు తగ్గ వసూళ్లు ఉంటాయని నిర్మాతలు భావిస్తున్నారట.

లతా మంగేష్కర్‌కు తీవ్ర అస్వస్థత

భారత రత్న, దిగ్గజ గాయని లతా మంగేష్కర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సోమవారం తెల్లవారుజామున శ్వాస సంబంధ సమస్యలు ఎదురవడంతో ఆమెను ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేర్పించారు. 'లతా మంగేష్కర్‌ను తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో తీసుకొచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు' అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరోవైపు వైరల్ ఇన్ఫెక్షన్‌కు గురవడంతో సరైన చికిత్స కోసమే ఆసుపత్రిలో చేర్చామని లతా సోదరి ఉషా మంగేష్కర్ తెలిపారు. 'అక్క వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. మంగళవారం డిశ్చార్జి అవుతారు' అని ఉషా చెప్పారు. అయితే, లతా ఇప్పటికే ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నారని సమాచారం. ఈ ఏడాది సెప్టెంబరు 28తో 90వ పడిలోకి ప్రవేశించిన లతా.. ఒక్క బాలీవుడ్‌లోనే సోలోగా వెయ్యికి పైగా సినిమాల్లో పాటలు పాడారు. 2001లో దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'కు ఎంపికయ్యారు.

చిన్నప్పుడు సితార... పెద్దయ్యాక నిత్య

మహేశ్‌బాబును అభిమానులు ముద్దుగా 'రాజకుమారుడు', 'ప్రిన్స్' అంటుంటారు. వాళ్లకు మహేశ్ ముద్దుల కుమార్తె సితార రాకుమారే. త్వరలో వెండితెరపైకి సితార రాకుమారిగా సందడి చేయనుంది. అయితే, ఇక్కడో చిన్న ట్విస్ట్ ఉంది. తెరపై సితార కనిపించదు. వినిపిస్తుందంతే! డిస్నీ యానిమేషన్ ఫిల్మ్ 'ఫ్రోజెన్ 2'లో రాకుమారి ఎల్సా చిన్నప్పటి సన్నివేశాలకు సితార డబ్బింగ్ చెప్పనుంది. సినిమాలో ఆమె గొంతు వినిపిస్తుంది అన్నమాట! ఈ విషయాన్ని డిస్నీ సంస్థ ప్రకటించింది. ఎల్సా పెద్దయ్యాక వచ్చే సన్నివేశాలకు నిత్యా మీనన్ డబ్బింగ్ చెప్పారు. ఈ నెల 22న తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో సినిమా విడుదల కానుంది.

నటుడిగా నేనొక తెల్లకాగితం!

- దేవీ ప్రసాద్

"దర్శకత్వంలో తృప్తి ఎక్కువ. అలాగే, టెన్షన్స్ కూడా! నటనలో హీరోలకు టెన్షన్స్ ఉంటాయి కానీ, క్యారెక్టర్ ఆర్టిస్టులకు ఉండవు. నటుడిగా నేనొక తెల్లకాగితంలా సెట్‌కు వెళతా. విద్యార్థిలా నేర్చుకుంటాను. దర్శకులకు సలహాలు ఇవ్వను" అని దేవీ ప్రసాద్ అన్నారు. 'నీదీ నాదీ ఒకే కథ'లో తండ్రి పాత్రతో ఆయనకు పేరు, గుర్తింపు వచ్చాయి. త్వరలో విడుదల కానున్న 'తోలుబొమ్మలాట'లో ప్రధాన పాత్రలో నటించారు. విశ్వనాథ్ మాగంటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, దుర్గాప్రసాద్ మాగంటి నిర్మించిన చిత్రమిది. దేవీ ప్రసాద్ మాట్లాడుతూ "రాజేంద్ర ప్రసాద్‌గారి కుమారుడిగా నటించా. నాకు ఓ కుమారుడు ఉంటారు. కుటుంబ బంధాల విలువ చెప్పాలనే సదుద్దేశంతో, మనుషుల్లో మంచి-చెడును చూపిస్తూ విశ్వంత్ సినిమా తెరకెక్కించాడు. ప్రతి ప్రేక్షకుడు ఈ సినిమాలో ఏదో ఒక పాత్రతో, సందర్భంతో కనెక్ట్ అవుతాడు" అన్నారు. నటన, దర్శకత్వం గురించి ఆయన మాట్లాడుతూ "'నీదీ నాదీ ఒకే కథ' అవకాశం వచ్చినప్పుడు, అదొక్కటే చేసి మళ్లీ దర్శకుడిగా చిత్రాలు చేద్దామనుకున్నా. కానీ ఆ చిత్రంతో చాలా అవకాశాలు వచ్చాయి. 'బ్లేడ్ బాబ్జీ' వంటి చిత్రాలు టీవీల్లో వచ్చినప్పుడు నా దర్శకత్వ శైలిని మెచ్చుకుంటూ చాలామంది ఫోన్లు, మెసేజ్‌లు చేస్తారు. దర్శకుడిగా హిట్ సినిమా తీయాలనే కోరిక బలంగా ఉంది. అలాగే, నటుడిగా అన్ని తరహా పాత్రలూ చేయాలనుంది. ప్రస్తుతం శర్వానంద్ 'శ్రీకారం', కృష్ణవంశీ 'రంగమార్తండ'... ఇలా సుమారు పదికి పైగా చిత్రాల్లో నటిస్తున్నా" అన్నారు.

రెగ్యులర్‌గా నవ్వితే లాఫింగ్ క్లబ్స్ ఎందుకు?

- జి. నాగేశ్వరరెడ్డి

"పని ఒత్తిడి, సంపాదన, ఉద్యోగ సమస్యలతో మనుషులు నవ్వడం మానేశారని నా అభిప్రాయం. నవ్వుకు దూరం అవుతున్నామేమో అనిపిస్తుంది. లేకపోతే లాఫింగ్ క్లబ్స్ ఎందుకు చెప్పండి? రెగ్యులర్‌గా నవ్వితే వాటి అవసరం లేదు. ఈ పరిస్థితిని కొద్దో గొప్పో తగ్గించే శక్తి సినిమాకు ఉంది. నా గత చిత్రాలు ప్రేక్షకులను నవ్వించాయి. ప్రేక్షకులను పూర్తిగా నవ్వించాలని ఈ చిత్రం తీశా" అని జి. నాగేశ్వరరెడ్డి అన్నారు. సందీప్ కిషన్, హన్సిక జంటగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'తెనాలి రామకృష్ణ బీఏబీఎల్'. అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, రూపా జగదీశ్, ఇందుమూరి శ్రీనివాసులు నిర్మాతలు. ఈ నెల 15న సినిమా విడుదల కానున్న సందర్భంగా జి. నాగేశ్వరరెడ్డి చెప్పిన సంగతులు...

● సందీప్ కిషన్ న్యాయవాదిగా కనిపిస్తాడు. టైటిలే సినిమాలో హీరో పేరు. టైటిల్ ఏదైతే బావుంటుందని ఆలోచించినప్పుడు తెనాలి రామకృష్ణ గుర్తొచ్చారు. ఆయన తిమ్మిని బమ్మి చేస్తాడంటారు కదా! న్యాయవాదులు కూడా చాలా తెలివైనవాళ్లు. అందుకని, ఈ టైటిల్ ఖరారు చేశాం. ఎంత పెద్ద గొడవ అయినా కాంప్రమైజ్ అయితే కోర్టుల వరకూ వెళ్లడం ఎందుకు? అనేది హీరో క్యారెక్టరైజేషన్. అటువంటి వ్యక్తి ఓ కేసులో కాంప్రమైజ్ కాకూడదనుకుంటాడు. అదేంటి? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ఫ్యామిలీ నేపథ్యంలో రూపొందిన ఎంటర్‌టైనర్. అవినీతి అంశాలనూ స్పృశించాం.

● తెనాలి రామకృష్ణ చమత్కారి, తెలివైనవాడు. అలాగే, మా హీరో కూడా! శ్రీకృష్ణదేవరాయలిపై హత్యాయత్నాన్ని తెనాలి రామకృష్ణ సమర్థవంతంగా తిప్పికొడతాడు. ఆయన్ని కాపాడతాడు. మా సినిమాలోనూ అటువంటి అంశం ఒకటి ఉంటుంది. తను ప్రేమించి, గౌరవించే మనిషి ప్రమాదంలో ఉన్నప్పుడు తెనాలి రామకృష్ణ ఏం చేశాడు? నిజం ఏంటి? అనేది థియేటర్లలో చూడాలి. తెనాలి రామకృష్ణలో చమత్కారం, సమయస్ఫూర్తి, హాస్యం, సందర్భోచితంగా ప్రవర్తించే లక్షణాలు మా హీరోలోనూ ఉంటాయి. తానొక మహామేధావి అనుకొనే ఇన్నోసెంట్ లాయర్‌గా హన్సిక నటించారు. సప్తగిరి, 'వెన్నెల' కిశోర్, సత్యకృష్ణ, అన్నపూర్ణమ్మ హీరో కంటే రెట్టింపు నవ్విస్తారు. వరలక్ష్మి శరత్‌కుమార్ మంచి పాత్రలో కనిపిస్తారు.

● హిందీ చిత్రం 'జానీ ఎల్ఎల్‌బీ'కి, మా చిత్రానికీ సంబంధం లేదు. అది సీరియస్ సినిమా. ఇటీవల కాలంలో ప్రేక్షకుల్ని నవ్వించే చిత్రాలు కొంచెం తగ్గాయి. ఆ లోటు ఈ సినిమా తీరుస్తుంది. కుటుంబమంతా హాయిగా నవ్వుకునే చిత్రమిది. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడలేదు.

నైనా గంగూలీ

సో బ్యూటిఫుల్!

'ట్రిబ్యూట్ టు రంగీలా' అంటూ రామ్‌గోపాల్ వర్మ అందిస్తున్న తాజా రొమాంటిక్ ఫిల్మ్ 'బ్యూటిఫుల్'. టైగర్ కంపెనీ ప్రొడక్షన్స్ పతాకంపై రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రం డిసెంబర్ 6న విడుదల కానుంది. సూరి హీరోగా నటించిన ఈ సినిమాలో నైనా అందాల నాయికగా యువతరం ప్రేక్షకుల్ని అలరించనుంది. అగస్త్యమంజు దర్శకుడు. 'ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు, మొదటి సింగిల్‌కు విశేషమైన స్పందన లభించింది. రొమాంటిక్, లవ్ అంశాలతో వైవిధ్యభరితంగా సినిమా రూపుదిద్దుకొంది. సూరి అభినయం, నైనా గ్లామర్ ఆడియన్స్‌ను ఆకట్టుకొంటాయి. అలాగే సిరాశ్రీ రాసిన పాటలు అలరిస్తాయి. డిసెంబర్ 6న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చిత్రబృందం తెలిపింది. టి. అంజయ్య సమర్పణలో రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రానికి సహ నిర్మాతలు: నట్టి క్రాంతి, నట్టి కరుణ, నిర్మాతలు: టి.నరేశ్‌కుమార్, టి.శ్రీధర్.

మ్యూజికల్ హారర్...

మున్నా కాశీ

సంగీత దర్శకుడు మున్నా కాశీ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హేజా'. కె.వి.ఎస్.ఎన్. మూర్తి నిర్మాత. తనికెళ్ళ భరణి కీలక పాత్రధారి. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాల్లో ఉన్న ఈ చిత్రాన్ని డిసెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మున్నా కాశీ మాట్లాడుతూ "చక్కని కథాంశంతో మ్యూజికల్ హారర్‌గా రూపొందించాం. ఇప్పటి వరకూ వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. పాటలతోపాటు నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలుస్తుంది. ముమైత్‌ఖాన్ క్యారెక్టర్ సమ్‌థింగ్ స్పెషల్ అనేలా ఉంటుంది" అని అన్నారు.

శరీరం విశ్రాంతి కోరుతోంది

- అమితాబ్

బిగ్ బి అమితాబ్ బచ్చన్ (77)కు కొంత విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో ఆయన కార్యక్రమాలను రద్దు చేసుకుని ఇంటికే పరిమితమయ్యారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ అభిమానులు, మద్దతుదారులతో తన ఆరోగ్య పరిస్థితిని పంచుకుంటున్నారు. అనారోగ్యం కారణంగా.. కోల్‌కతా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (కేఐఐఎఫ్) ప్రారంభానికి అమితాబ్ వెళ్లలేకపోయారు. ఇంతలో ఆదివారం కేవలం సాక్సులు ధరించిన పాదాలను చూపుతూ, టీవీలో ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతున్న ఫొటోను ట్వీట్ చేశారు. రోజంతా సాక్సులతో, ఫుట్‌బాల్ చూస్తూ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనినిబట్టి కొంత అస్వస్థతకు గురైనట్లు స్పష్టమవుతోంది. మరోవైపు కౌన్ బనేగా కరోడ్‌పతి సెట్‌ను తలచుకుంటూ తన బ్లాగ్‌లో ఆరోగ్యంపై అమితాబ్ కవితాత్మకంగా రాసుకొచ్చారు. 'ఆ కుర్చీ.. కంప్యూటర్‌జీ.. ప్రేక్షకులు.. జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. వేగంగా వెళ్తున్న కాలాన్ని మంచంపై నుంచి గమనిస్తున్నా. కొన్నిసార్లు శరీరం కంటే మనసు మాటే వినాలి. ఏదైనా ఇబ్బంది వస్తే.. 'కొంచెం వేగం తగ్గించమని ముందే చెప్పా కదా' అనే మాటను మనసు గుర్తుచేస్తుంది' అని బ్లాగ్‌లో పేర్కొన్నారు. కేఐఐఎఫ్‌కు వెళ్లలేకపోవడాన్ని బాధాకరంగా ఆయన వివరించారు.

మహిళా నిర్మాత మూడు చిత్రాలు

ఆశీష్ గాంధీ

విజయ చౌదరి

ఇటీవల విడుదలైన 'కథనం' చిత్రం నిర్మాతల్లో ఒకరైన మొవ్వ విజయ చౌదరి నూతనంగా ఎం. స్క్రీన్స్ సంస్థను నెలకొల్పారు. ఈ బేనరుపై వరుసగా మూడు చిత్రాలు నిర్మించడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఆ వివరాలను విజయ చౌదరి వెల్లడిస్తూ 'యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ, ప్రేక్షకుల్ని ఆకట్టుకొనే వైవిధ్యభరిత చిత్రాలు నిర్మించాలనే ఆశయంతో ఎం.స్క్రీన్స్ సంస్థను నెలకొల్పాం. ఇందులో భాగంగా మొదట మూడు సినిమాలు నిర్మించనున్నాం. డిసెంబర్ రెండో వారంలో మా తొలి సినిమా ప్రారంభం కానుంది. 'నాటకం' చిత్రంలో నటించిన ఆశీష్ గాంధీ ఇందులో హీరోగా నటిస్తారు. రాజశేఖర్ రావి దర్శకుడు. అలాగే దర్శకురాలు నందినీరెడ్డి దగ్గర దర్శకత్వశాఖలో పనిచేసిన స్మరణ్ రెడ్డి దర్శకత్వంలో మరో సినిమా నిర్మిస్తాం. దర్శకుడు పరశురామ్ దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన ఆర్. సురేశ్ దర్శకత్వంలో మూడో చిత్రాన్ని నిర్మిస్తాం. ఈ మూడు చిత్రాలకు నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అని చెప్పారు. ఈ చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: రవిశంకర్, కొండబత్తుల నాగశేఖర్.

పొలిటికల్ సెటైర్‌తో..

శ్రీరెడ్డి

రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్న చిత్రం 'క్లైమాక్స్'. భవానీ శంకర్ దర్శకత్వంలో పి.రాజేశ్వరరెడ్డి, కె.కరుణాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీరెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మర్డర్ మిస్టరీ, పొలిటికల్ సెటైర్ నేపథ్యంలో అల్లుకున్న కథ ఇది" అని తెలిపారు. "నటనకు స్కోపున్న పాత్ర చేస్తున్నా. చాలా మలుపులతో నా పాత్ర ఉంటుంది" అని శ్రీరెడ్డి చెప్పారు. "షూటింగ్ చివరి దశలో ఉంది. త్వరలో ఓ పాటను రామోజీ ఫిల్మ్ సిటీలో తెరకెక్కిస్తాం" అని నిర్మాతల్లో పి.రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శివశంకర్ మాస్టర్, సాషా సింగ్, రమేశ్, చందు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రాజేశ్, కెమెరా: రవికుమార్ నీర్ల.

సాహసికులకు రక్షణ

ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి రొటీన్ కెరీర్‌లకు భిన్నంగా... దేశం గర్వించే రీతిలో ఉద్యోగ బాధ్యతలు, ధైర్య సాహసాలతో కోట్లాది ప్రజల మన్ననలను అందుకునే ఉద్యోగాలకు వేదిక రక్షణ రంగం. అటువంటి మహోన్నతమైన త్రివిధ దళాల్లో కెరీర్ ప్రారంభించడానికి చక్కని మార్గంగా నిలుస్తోంది కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ). యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఏటా రెండుసార్లు సీడీఎస్ఈని నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - (1), 2020 నోటిఫికేషన్ వెలువడింది. దీనికి సంబంధించిన వివరాలు..

ప్రస్తుత సీడీఎస్ఈ నోటిఫికేషన్ ద్వారా త్రివిధ దళాల్లో మొత్తం 418 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటికి నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి. విభాగాల వారీగా ఖాళీలు..

ఇండియన్ మిలటరీ అకాడమీ

- అవివాహిత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- పోస్టులు: 100
- అర్హత: డిగ్రీ / తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: జనవరి 2, 1997 - జనవరి 1, 2002 మధ్య జన్మించి ఉండాలి.

ఇండియన్ నేవల్ అకాడమీ

- అవివాహిత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- పోస్టులు: 45
- అర్హత: ఇంజనీరింగ్‌లో డిగ్రీ
- వయసు: జనవరి 2, 1997 - జనవరి 1, 2002 మధ్య జన్మించి ఉండాలి.

ఎయిర్‌ఫోర్స్ అకాడమీ

- పోస్టులు: 32
- అర్హత: ఇంజనీరింగ్ డిగ్రీ లేదా డిగ్రీ / తత్సమాన (10+2 స్థాయిలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి) కోర్సులో ఉత్తీర్ణత.
- వయసు: జనవరి 2, 1997 - జనవరి 1, 2002 మధ్య జన్మించి ఉండాలి. డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్నవారికి వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుంది.

ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్సీ - పురుషులు)

- పోస్టులు: 225
- అర్హత: డిగ్రీ / తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత.
- వయసు: జనవరి 2, 1996 - జనవరి 1, 2002 మధ్య జన్మించి ఉండాలి.

ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్సీ ఉమెన్ నాన్ టెక్నికల్)

- అవివాహితులు / విడాకులు లేదా వైధవ్యం పొంది తిరిగి పెళ్లి చేసుకోని మహిళలు దరఖాస్తు చేసుకోవాలి.
- పోస్టులు: 16
- అర్హత: డిగ్రీ / తత్సమానం
- వయసు: జనవరి 2, 1996 - జనవరి 1, 2002 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక విధానం

ఎంపిక విధానంలో రెండు దశలు ఉంటాయి. అవి.. రాత పరీక్ష, ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ టెస్ట్. రాత పరీక్షలో నిర్దేశిత అర్హత సాధించినవారు మాత్రమే ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్‌కు హాజరు కావాలి. ఈ రెండు దశల్లో సాధించిన మెరిట్ ఆధారంగా నియమాకాన్ని ఖరారు చేస్తారు.

మూడు భాగాలు.. మార్కులు 300

ఎంచుకున్న విభాగాన్ని బట్టి రాత పరీక్షను వేర్వేరుగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం హిందీ / ఇంగ్లీష్ భాషల్లో మాత్రమే ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఏ), ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ), ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఐఎఫ్ఏ)లకు జరిగే రాత పరీక్షకు కేటాయించిన మార్కులు 300. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అవి.. ఇంగ్లీష్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు), జనరల్ నాలెడ్జ్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు), ఎలిమెంటరీ మేథమెటిక్స్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు). ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటీఏ) కోసం నిర్వహించే రాత పరీక్షకు కేటాయించిన మార్కులు 200. ఇందులో రెండు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అవి.. ఇంగ్లీష్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు), జనరల్ నాలెడ్జ్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు). నెగిటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పునకు 0.33 మార్కు కోత విధిస్తారు.

సిలబస్ - విశ్లేషణ

- **ఇంగ్లీష్:** ఇందులో నిత్య జీవితంలో ఇంగ్లీష్ భాష వినియోగం, సంబంధిత అంశాల ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు. గ్రామర్, వొకాబ్యులరీ, కాంప్రహెన్షన్, యూజ్ ఆఫ్ వర్డ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **జనరల్ నాలెడ్జ్:** కరెంట్ ఈవెంట్స్‌పై అభ్యర్థుల అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా శాస్త్రసాంకేతిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, నిత్య జీవితంలో సైన్స్ అనువర్తనాల ఉపయోగం వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అంతేకాకుండా హిస్టరీ, జాగ్రఫీ విభాగాల నుంచి కూడా ప్రశ్నలు వస్తాయి.
- **ఎలిమెంటరీ మేథమెటిక్స్:** ఇందులో అడిగే ప్రశ్నలు మెట్రిక్యులేషన్ (పదో తరగతి) స్థాయిలో ఉంటాయి. ఈ క్రమంలో అర్థమెటిక్, అల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, జామెట్రీ, మెన్సురేషన్, స్టాటిస్టిక్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ఎలా సిద్ధమవ్వాలి?

మ్యాథమెటిక్స్ కోసం 6 - 10వ తరగతి మ్యాథ్స్ పుస్తకాల్లోని అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకోవాలి. అందులోని సూత్రాలను, ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైనంత ఎక్కువగా మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇదే క్రమంలో షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. తద్వారా సమాధానాన్ని వేగంగా, కచ్చితత్వంతో గుర్తించవచ్చు. జనరల్ నాలెడ్జ్ కోసం ప్రతి రోజూ ఆంగ్ల దినపత్రికలను చదవాలి. అందులో ముఖ్యమైన వాటిని పాయింట్ల రూపంలో నోట్ చేసుకోవాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ కోసం ఆయా సబ్జెక్ట్‌ల వారీగా ఎన్‌సీఈఆర్‌టీ 11, 12వ తరగతి పుస్తకాలను చదవాలి. ఇంగ్లీష్‌లో గ్రామర్‌పై ఎక్కువగా దృష్టి సారించాలి. ముఖ్యంగా గ్రామర్‌ను వాక్య నిర్మాణంలో ఏవిధంగా అన్వయిస్తున్నారో అవగాహన పెంచుకోవాలి. ఇందుకు రోజూ ఆంగ్ల దినపత్రికలను చదవడం ఉపయోగకరం. మోడల్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

గ్రూప్ టాస్క్

ఇందులో గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్, హాఫ్ గ్రూప్ టాస్క్, ఇండివిడ్యువల్ అబ్‌స్టకల్, కమాండ్ టాస్క్, స్నేక్ రేస్ / గ్రూప్ అబ్‌స్టకల్ రేస్, ఇండివిడ్యువల్ లెక్చర్, ఫైనల్ గ్రూప్ టాస్క్ వంటి పరీక్షలను నిర్వహిస్తారు.

- గ్రూప్ డిస్కషన్: ఈ ప్రక్రియలో అభ్యర్థులను ఎనిమిది లేదా పన్నెండు గ్రూపులుగా విభజిస్తారు. ఇందులో వివిధ రకాల టాపిక్‌లు ఉంటాయి. వీటి నుంచి ఏదో ఒక దాన్ని ఎంచుకోవాలి. ఆయా అంశాలపై ఆలోచించడానికి మూడు నుంచి నాలుగు నిమిషాల సమయం ఇస్తారు. తరవాత గ్రూప్ డిస్కషన్ ప్రారంభించాలి. ఇది పూర్తయిన రెండు నిమిషాల తరవాత మరో అంశం ఇస్తారు. ఇక్కడ టాపిక్‌ను ఎంచుకోవడానికి అవకాశం ఉండదు. ఇచ్చిన టాపిక్‌పైన తప్పనిసరిగా మాట్లాడాలి.
- గ్రూప్ / మిలటరీ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్: ఇందులో వివిధ రకాల సమస్యలను ఇస్తారు. ఒక గ్రూప్‌గా ఏర్పడి వీటికి పరిష్కార మార్గాలను కనుక్కోవాలి. వాటిని పేపర్‌పై రాయాలి. తరవాత అభ్యర్థులకు పది నిమిషాల సమయం ఇస్తారు. ఈ సమయంలోనే చర్చించుకొని అందరూ ఒక పరిష్కార మార్గాన్ని సూచించాలి. ఇందులో తుఫాన్లు, భూకంపాలు సంభవించినప్పుడు ప్రజలను ఏవిధంగా రక్షించాలి? వంటి ప్రశ్నలను అడుగుతారు.
- ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్: ఇందులో ఒక ప్రదేశంలో తెలుపు, నలుపు, ఎరుపు రంగులోని అడ్డంకులను ఉంచుతారు. వాటిని జట్టు సభ్యులు నిర్దేశించిన నియమాల ఆధారంగా ఒక భారాన్ని మోస్తూ అధిగమించాలి. ఒక్క రంగు టాస్క్ పూర్తికాగానే మరో టాస్క్ ప్రారంభమవుతుంది.
- హాఫ్ గ్రూప్ టాస్క్: ఇందులో జట్టు సభ్యులను రెండుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్‌లో ఐదు నుంచి ఆరు మంది ఉంటారు. ఒక ప్రదేశంలో తెలుపు, నలుపు, ఎరుపు రంగులోని అడ్డంకులను ఉంచుతారు. వాటిని జట్టు సభ్యులు నిర్దేశించిన నియమాల ఆధారంగా ఒక భారాన్ని మోస్తూ అధిగమించాలి. ఒక్క రంగు టాస్క్ పూర్తికాగానే మరో టాస్క్ ప్రారంభమవుతుంది.
- ఇండివిడ్యువల్ అబ్‌స్టకల్: ఇందులో వివిధ అడ్డంకులు ఉంటాయి. వాటిపై ఉన్న సంఖ్య ఆ టాస్క్‌కు కేటాయించిన మార్కులను సూచిస్తుంది. ఈ దశలో ఉండే టాస్క్‌లు: కమాండో వాక్, డబుల్ డిజ్ జంప్, టార్జాన్ స్వింగ్, బ్యాలెన్స్‌డ్ వాక్, జంపింగ్ ఓవర్ డ్రమ్ బై థోర్నీ వైర్స్, స్టెప్ బై స్టెప్ జంప్, జంపింగ్ ఓవర్ ది స్క్రీన్, బుర్మా బ్రిడ్జి, హ్యాంగింగ్ ద రోప్ ఆఫ్టర్ జంపింగ్ ఫ్రమ్ ద ల్యాడర్, రోల్ క్లయింబింగ్.
- స్నేక్ రేస్ / గ్రూప్ అబ్‌స్టకల్ రేస్: ఇందులో తెలుపు, ఎరుపు రంగులతో కూడిన పెద్ద ఇనుప పైప్‌లు ఉంటాయి. ఎరుపును తాకకుండా శరీరాన్ని వంచుతూ ఇంగ్లీష్ అక్షరం ఎస్ ఆకారం వచ్చేలా ఆ పైప్‌లను దాటాలి. అదేవిధంగా పది ఫీట్ల గోడ ఉంటుంది. దాన్ని కూడా దాటాలి.
- ఇండివిడ్యువల్ లెక్చర్: ఇందులో ముందుగా అభ్యర్థులను వృత్తాకారంలో కూర్చోబెడతారు. వారి ముందు వివిధ రకాల కార్డులు ఉంటాయి. వాటిల్లో కష్టమైన, సాధారణ, సులువైన మూడు అంశాలు ఇస్తారు. ఆయా టాపిక్‌లను ప్రిపేర్ కావడానికి మూడు నిమిషాల సమయం ఇస్తారు. తరవాత లెక్చర్ ప్రారంభించాలి.
- ఫైనల్ గ్రూప్ టాస్క్: ఈ దశ ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్ మాదిరిగానే ఉంటుంది. అయితే నాలుగు అడ్డంకులు కాకుండా ఒక్కటే ఇస్తారు. ఇందులో బురద, కొన్ని అవుట్ బోండ్ ఏరియాస్ ఉంటాయి. వాటిని ఎట్టి పరిస్థితుల్లో తాకకూడదు.

కటాఫ్ మార్కులు (సీడీఎస్ఈ-2, 2018)	
ఐఎంఏ	242
ఐఎన్ఏ	228
ఎఎఫ్ఏ	253
ఒటీఏ (పురుషులు)	162
ఒటీఏ (మహిళలు)	163

స్టయిపెండ్‌తో శిక్షణ

- అభ్యర్థులు ఎంచుకున్న విభాగాల మేరకు ఆయా అకాడమీల్లో శిక్షణనిస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ.21,000 స్టెయిపెండ్ చెల్లిస్తారు.
- ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఏ): ఈ విభాగాన్ని ఎంచుకున్న వారికి ఐఎంఏ - డెహ్రాడూన్‌లో 18 నెలలపాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో వీరిని జెంటిల్‌మెన్ క్యాడెట్లుగా వ్యవహరిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారి కెరీర్ లెఫ్టినెంట్ హోదాతో ప్రారంభమవుతుంది. దీని తరవాత కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్, కల్నల్, బ్రిగేడియర్, మేజర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్, జనరల్ వరకు ప్రమోషన్లను అందుకోవచ్చు.
- ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ): ఈ విభాగానికి ఎంపికైన వారికి ఐఎన్ఏ - ఎజిమాలా (కేరళ)లో నేవల్ ఓరియెంటేషన్‌లో 44 వారాల శిక్షణనిస్తారు. తరవాత ఆఫీసర్స్ సీ ట్రైనింగ్ (6 నెలలు), సబ్ లెఫ్టినెంట్ అఫ్లోట్ ట్రైనింగ్ (6 నెలలు), సబ్ లెఫ్టినెంట్ టెక్నికల్ కోర్స్ (32 వారాలు), ఫుల్ నేవల్ వాచ్ కీపింగ్ సర్టిఫికెట్ (6 నెలలు) ప్రోగ్రామ్‌లు ఉంటాయి.
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఎఎఫ్ఏ): ఎస్ఎస్బీ ఇంటర్వ్యూ తరవాత ఎయిర్‌ఫోర్స్ సెలెక్షన్ బోర్డ్ నిర్వహించే పరీక్షలో అర్హత సాధించిన వారికి ఎయిర్‌ఫోర్స్ అకాడమీ - దుండిగల్ (హైదరాబాద్)లో 74 వారాలపాటు ఫ్లయింగ్ బ్రాంచ్ (పైలట్స్)లో శిక్షణనిస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఫ్లయింగ్ ఆఫీసర్ ర్యాంక్ ఇస్తారు. తరవాత ఫ్లయిట్ లెఫ్టినెంట్, స్క్వాడ్రన్ లీడర్, వింగ్ కమాండర్, గ్రూప్ కెప్టెన్ హోదాలు ఉంటాయి. ప్రతిభ ఉంటే ఎయిర్ కమాండర్, ఎయిర్ వైస్ మార్షల్, ఎయిర్ మార్షల్ వంటి అత్యున్నత ర్యాంక్‌లను కూడా చేరుకోవచ్చు.
- ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ: చెన్నైలోని ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి ఎంపికైన వారికి 49 వారాల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో వీరిని జెంటిల్‌మెన్ / లేడీ క్యాడెట్లుగా వ్యవహరిస్తారు. శిక్షణను పూర్తి చేసుకున్న వారికి లెఫ్టినెంట్ (షార్ట్ సర్వీస్ కమిషన్) ర్యాంక్ ఇస్తారు. అంతేకాకుండా ప్రీ కమిషనింగ్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి మద్రాస్ యూనివర్సిటీ 'పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్ మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' డిగ్రీని ప్రదానం చేస్తారు. లెఫ్టినెంట్ తరవాత కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్ వరకు ప్రమోషన్లను అందుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 19, 2019
- సీడీఎస్ఈ పరీక్ష తేదీ: ఫిబ్రవరి 2, 2020
- వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్

సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్బీ) ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్‌ను నిర్వహిస్తుంది. ఇందులో స్టేజ్ - 1, స్టేజ్ - 2 అనే రెండు దశలు ఉంటాయి. స్టేజ్ - 1లో అర్హత సాధిస్తేనే స్టేజ్ - 2కు అనుమతిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఐదు రోజులపాటు సాగుతుంది.

స్టేజ్-1: ఈ దశలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఆఫీసర్స్ ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు.

- ఆఫీసర్స్ ఇంటెలిజెన్స్ టెస్ట్: ఇందులో వెర్బల్, నాన్ వెర్బల్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. వీటికి స్వల్పకాలంలో సమాధానాలు ఇవ్వాలి. వెర్బల్ విభాగంలో అనాలజీ - క్లాసిఫికేషన్, కోడింగ్ - డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, నెంబర్ సిరీస్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. నాన్ వెర్బల్ విభాగంలో అనాలజీ, క్లాసిఫికేషన్ ఆఫ్ ఫిగర్స్, కంప్లీట్ - ఇన్ కంప్లీట్ ప్యాటర్న్, వెన్ డయాగ్రమ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్టివ్ టెస్ట్: ముందుగా అందరినీ ఒక పెద్ద ఆడిటోరియంలో కూర్చోబెడతారు. పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్టివ్ టెస్ట్ గురించి కొద్ది సేపు వివరిస్తారు. తరవాత లైట్లు ఆఫ్ చేసి 30 సెకన్లపాటు అస్పష్టంగా ఉన్న ఒక చిత్రాన్ని చూపిస్తారు. ఈ సమయంలోనే అభ్యర్థి ఆ చిత్రానికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని నోట్ చేసుకోవాలి. వీటి ఆధారంగా మూడు నిమిషాల్లో ఒక కథను రాయాలి. రాసే సమాధాన పత్రంలో చతురస్ర ఆకారంలో ఒక బాక్స్ ప్రింట్ చేసి ఉంటుంది. ఇందులో చిత్రంలోని సెంట్రల్ క్యారెక్టర్‌కు సంబంధించిన వయసు, లింగం, క్యారెక్టర్, మనోభావం, గత, వర్తమాన, భవిష్యత్ పరిణామాలను మార్క్ చేయాలి. కథను రాసిన తరవాత అందరూ వృత్తాకారంలో కూర్చొని వారి వారి కథల గురించి చర్చించుకోవాలి. ఆ ప్రక్రియ ఆధారంగానే రెండో దశ స్టేజ్-2కు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

స్టేజ్-2: ఈ దశలో సైకలాజికల్ టెస్ట్‌లు, గ్రూప్ ఆఫీసర్ టాస్క్‌లు, ఇంటర్వ్యూ, కాన్ఫరెన్స్ వంటివి ఉంటాయి.

- సైకలాజికల్ టెస్ట్: ప్రత్యేకమైన పద్ధతి ద్వారా అభ్యర్థి మానసిక సామర్థ్యం, వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారు. ఇందులో థీమాటిక్ అప్రిసియేషన్ టెస్ట్, వర్డ్ అసోసియేషన్ టెస్ట్, సిచ్యూవేషన్ రియాక్షన్ టెస్ట్, సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లు నిర్వహిస్తారు.
- థీమాటిక్ అప్రిసియేషన్ టెస్ట్: ముందుగా అందరినీ ఒక పెద్ద ఆడిటోరియంలో కూర్చోబెడతారు. తరవాత లైట్లు ఆఫ్ చేసి 30 సెకన్లపాటు 12 చిత్రాలను చూపిస్తారు. ఇందులో 11 చిత్రాలు అస్పష్టంగా, 12వ చిత్రం ఖాళీగా ఉంటుంది. అస్పష్టమైన 11 చిత్రాల్లో ఉన్న కథను ఊహిస్తూ, 12వ చిత్రంలో ఏముంటుందో రాయాలి. ఇందుకు మూడు నాలుగు నిమిషాల సమయం ఇస్తారు.
- వర్డ్ అసోసియేషన్ టెస్ట్: ఇందులో 60 పదాలను ప్రొజెక్టర్ ద్వారా చూపిస్తారు. వీటిని చూసి పాజిటివ్ ప్రతిస్పందనను పేపర్‌పై రాయడానికి ప్రతి పదానికి 15 సెకన్ల సమయం కేటాయిస్తారు. తద్వారా మానసిక నిపుణులు అభ్యర్థి వ్యక్తిత్వంపై ఒక అంచనాకు వస్తారు.
- సిచ్యూవేషన్ రియాక్షన్ టెస్ట్: దీనికి 30 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఇందులో ప్రత్యేక ప్రశ్నపత్రం, సమాధాన పత్రం ఉంటుంది. సమాధాన పత్రంలో నిర్దేశించిన విధంగానే రెండు మూడు వ్యాక్యాల్లో జవాబులను రాయాలి. ఇందులో 60 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో కనీసం 40 ప్రశ్నలకైనా సమాధానం రాయాలి.
- సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్: ఇందులో అభ్యర్థులు ఎవరి గురించి వారు వివరించాలి. అంటే మీ గురించి, తల్లిదండ్రులు, స్నేహితులు, టీచర్లు వంటి వారి గురించి ఏవిధంగా ఆలోచిస్తున్నారు అనే విషయాలను రాయాలి.

జాబ్ కార్నర్

చార్టర్డ్ అకౌంటెంట్

ఖాళీలు 2

ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో లిమిటెడ్, ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వివరాలు..

- భర్తీ చేసే పోస్టులు: స్టాటిస్టికల్ ఆఫీసర్, చార్టర్డ్ అకౌంటెంట్
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 20, 2019
- వెబ్‌సైట్: www.aptransco.co.in

టీచింగ్

ఖాళీలు 63

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) - రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), పలు టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టుల వారీగా ఖాళీలు: ప్రొఫెసర్ - 10, అసోసియేట్ ప్రొఫెసర్ - 16, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 37.
- విభాగాలు: అప్లయిడ్ జియాలజీ, ఆర్కిటెక్చర్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, తదితరాలు.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్ / ఎంఈ / ఎంటెక్, పీహెచ్‌డీ, టీచింగ్ అనుభవం.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 15, 2019.
- దరఖాస్తు హార్డ్‌కాపీలను పంపడానికి చివరి తేదీ: నవంబరు 25, 2019.
- వెబ్‌సైట్: http://nitrr.ac.in/

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ఖాళీలు 24

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) - న్యూఢిల్లీ, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- పోస్టులు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, తదితరాలు.
- అర్హత: సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, పీజీ ఉత్తీర్ణతతోపాటు అనుభవం.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 20, 2019.
- వెబ్‌సైట్: https://nitdelhi.ac.in/

గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీ

HINDUSTAN COPPER LIMITED
(A Government of India Enterprise)

ఖాళీలు 45

హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- ట్రేడ్ల వారీగా ఖాళీలు: మైనింగ్ - 16, ఎలక్ట్రికల్ - 11, మెకానికల్ - 10, సివిల్-4, మెటలర్జీ - 2, కెమికల్ - 2
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 1, 2019
- వెబ్‌సైట్: www.hindustancopper.com/

టైపిస్ట్

ఖాళీలు 9

భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసెబిలిటీస్ (దివ్యాంగజన్) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- పోస్టులు: ప్రిన్సిపల్, ఎల్‌డీసీ / టైపిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, వర్క్‌షాప్ సూపర్‌వైజర్, అకౌంటెంట్.
- విభాగాలు: క్లినికల్ సైకాలజీ, మెడికల్ పీఎంఆర్, స్పెషల్ ఎడ్యుకేషన్.
- అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్, ఎంఫిల్, అనుభవం.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ / రాతపరీక్ష ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 15, 2019.
- వెబ్‌సైట్: http://niepid.nic.in/

▲ 21.47 సెన్సెక్స్ 40,345.08	▲ 5.30 నిఫ్టీ 11,913.45	▼ రూపాయి (ఒక డాలర్‌కు) 71.28 (31 పైసలు)
▲ 55 బంగారం 38,127 (10 గ్రాములు (99.9 స్వచ్ఛత))	ముంబై ▼ 20 వెండి (కిలో) 44,280 (కిలో (రూపాయల్లో))	▼ ముడి చమురు 61.43

పారిశ్రామికోత్పత్తి పతనం

సెప్టెంబరులో 8 ఏళ్ల కనిష్ఠం.. -4.3 శాతానికి క్షీణత

న్యూఢిల్లీ: దేశంలో పరిశ్రమలు పడకేశాయ్. వరుసగా రెండు నెలలు ఉత్పత్తి భారీ క్షీణతను నమోదు చేసుకుంది. ఈ ఏడాది ఆగస్టులో -1.1 శాతానికి క్షీణించిన పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) సెప్టెంబరులో -4.3 శాతానికి పతనమైంది. దాదాపు 8 ఏళ్లలో ఇదే కనిష్ఠ స్థాయి. మాన్యుఫాక్చరింగ్ రంగ పనితీరు అత్యంత పేలవంగా ఉండటం ఇందుకు ప్రధాన కారణమైంది. 2018 సెప్టెంబరులో ఐఐపీ 4.6 శాతంగా నమోదైంది. సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఐఐపీ డేటా ముఖ్యాంశాలు..

- సెప్టెంబరులో మాన్యుఫాక్చరింగ్ రంగ ఉత్పత్తి వృద్ధి వార్షిక ప్రాతిపదికన -3.9 శాతానికి పడిపోయింది. ఆగస్టులో -1.2 శాతంగా ఉంది. గత ఏడాది సెప్టెంబరులో మాత్రం 4.8 శాతం వృద్ధిని నమోదు చేసుకోగలిగింది.
- మైనింగ్ రంగం ఉత్పత్తి వృద్ధి -8.5 శాతానికి క్షీణించింది. ఈ ఆగస్టులో, గత ఏడాది సెప్టెంబరులో 0.1 శాతం వృద్ధి నమోదైంది.
- విద్యుత్ ఉత్పత్తి పెరుగుదల సైతం సెప్టెంబరులో -2.6 శాతానికి జారుకుంది. ఆగస్టులో -0.9 శాతం పతనాన్ని చవిచూసింది. 2018 సెప్టెంబరులో మాత్రం 8.2 శాతం వృద్ధి చెందింది.
- ఈ సెప్టెంబరు, ఆగస్టులో మౌలిక రంగ వృద్ధి వరుసగా -6.4 శాతం, -4.5 శాతంగా ఉంది. కన్స్యూమర్స్ డ్యూరబుల్స్ రంగంలో -9.9 శాతం, -9.1 శాతంగా నమోదైంది. కన్స్యూమర్ నాన్-డ్యూరబుల్స్ రంగంలో -0.4 శాతం, 4.1 శాతంగా ఉంది.
- మాన్యుఫాక్చరింగ్ రంగానికి చెందిన 23 పరిశ్రమల గ్రూపుల్లో 17 ప్రతికూల వృద్ధినే కనబర్చాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్థానికి ఐఐపీ 1.3 శాతంగా నమోదైంది.
- సెప్టెంబరులో 8 కీలక రంగాల (సిమెంట్, స్టీల్, విద్యుత్, ఎరువులు, సహజ వాయువు, ఇంధన శుద్ధి, బొగ్గు, ముడి చమురు) వృద్ధి సైతం -5.2 శాతానికి క్షీణించింది. ఆగస్టులోనూ -0.5 శాతం పతనాన్ని నమోదు చేసుకుంది.

జీడీపీ మరింత తగ్గేనా..?

2019-20 మొదటి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 5 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత కాలంలో మరింత తగ్గిన పారిశ్రామికోత్పత్తి, కీలక రంగాల వృద్ధి గణాంకాలను బట్టి చూస్తే జూలై-సెప్టెంబరు కాలానికి జీడీపీ మరింత జారుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

వ్యాపారుల్లో విశ్వాసం ప్చ్..

క్యూ2లో 103.1కు తగ్గిన సూచీ

న్యూఢిల్లీ: దేశీయ వ్యాపారంపై విశ్వాసం మరింత సడలింది. వ్యాపారవర్గాల్లో సెంటిమెంట్ మరింత ప్రతికూలంగా మారడమే ఇందుకు కారణం. ప్రముఖ ఆర్థిక సంస్థ ఎన్‌సీఏఈఆర్ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్) తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో ఎన్‌సీఏఈఆర్ వ్యాపార విశ్వాస సూచీ (బీసీఐ) 103.1కు జారుకుంది. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోలిస్తే సూచీ 15.3 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో సూచీ 22.5 శాతం క్షీణించింది. ప్రధానంగా నాలుగు అంశాలపై ఎన్‌సీఏఈఆర్ సర్వే దృష్టిపెట్టింది.

సంస్కరణలతో వృద్ధికి ఊతం

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న సంస్కరణ చర్యలు దేశ ఆర్థిక వృద్ధికి ఊతంగా నిలుస్తాయని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ చర్యలతో దేశంలోకి పెట్టుబడులు పెరిగి.. ఆర్థిక ప్రగతికి చోదకంగా నిలుస్తాయన్నారు. 21వ అసోచామ్ జేఆర్‌డీ టాటా మెమోరియల్ లెక్చర్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశం పలురంగాల్లో అద్భుత ప్రగతిని సాధిస్తుండటం భారతీయులకు గర్వకారణమన్నారు. రానున్న పదేళ్లలో భారత్ ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఆవిర్భవిస్తుందని వెంకయ్య ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక మాంద్యం తాత్కాలికమేనని.. అగ్రదేశాలతో పోలిస్తే భారత్ వేగంగా పుంజుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

150 కోట్లు అందుకున్న ఆంధ్రా ముఖ్యుడెవరు!?

- కలకలం రేపుతున్న ఐటీ ప్రకటన
- ఈ నెల మొదటివారంలో భారీగా సోదాలు
- బోగస్ బిల్లులతో రూ.3,300 కోట్ల నగదు బదిలీ
- హవాలాతో బడా కార్పొరేట్ల బంధం
- దక్షిణాది రాష్ట్రాల ప్రాజెక్టుల్లో 'నకిలీ దందా'

అమరావతి (ఆంధ్రజ్యోతి): "మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వెచ్చించిన నిధులను తప్పుడు మార్గాల్లో దారి మళ్లించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ముఖ్య వ్యక్తికి రూ.150 కోట్లకు పైగా నగదు అందినట్లు సాక్ష్యాధారాలు లభించాయి" అని ఆదాయ పన్ను శాఖ పెద్ద బాంబు పేల్చింది. 'ఎవరా ముఖ్య వ్యక్తి' అనే విషయాన్ని మాత్రం బయటపెట్టకుండా ఉత్కంఠను రేకెత్తించింది. ఈ నెల మొదటి వారంలో హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, ఈరోడ్, పుణె, ఆగ్రా, గోవాలలోని 42 ప్రాంతాల్లో ఐటీ అధికారులు భారీగా సోదాలు నిర్వహించారు. దీనిపై ఆ శాఖ కమిషనర్ (మీడియా, టెక్నికల్ పాలసీ) సురభి అహ్లూవాలియా సోమవారం క్లుప్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. "బోగస్ బిల్లులు, హవాలా లావాదేవీలు నిర్వహించే కొందరిపై ఈనెల మొదటి వారంలో దాడులు నిర్వహించాం. మౌలిక సదుపాయాల రంగంలో బోగస్ కాంట్రాక్టులు/బిల్లుల ద్వారా నగదును పోగేసుకునే పెద్ద రాకెట్‌ను ఛేదించాం. ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిధులను ఎంట్రీ ఆపరేటర్లు, లాబీయిస్టులు, హవాలా డీలర్ల ద్వారా దారి మళ్లించారు. ఇలాంటి కంపెనీలు ఎక్కువగా ఢిల్లీ, ముంబైలకు చెందినవే. ఇందులో ఒక కంపెనీపై ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఐటీ సోదాలు జరిగాయి. దక్షిణాది రాష్ట్రాల్లో చేపట్టిన ప్రధాన మౌలిక సదుపాయాలు, ఈడబ్ల్యూఎస్ ప్రాజెక్టుల్లో బోగస్ బిల్లింగ్ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ముఖ్య వ్యక్తికి రూ.150 కోట్లకుపైగా నగదు చెల్లింపులు జరిగినట్లు మా సోదాల్లో ఆధారాలు లభించాయి" అని ఐటీ శాఖ తన ప్రకటనలో తెలిపింది. అంతేకాదు... బడా కార్పొరేట్లు, హవాలా ఆపరేటర్ల మధ్య కొనసాగుతున్న అక్రమ లావాదేవీల సంబంధంపై బలమైన ఆధారాలు లభించాయని తెలిపింది. బోగస్ కాంట్రాక్టుల ద్వారా ఏకంగా రూ.3300 కోట్ల మేరకు నగదును పోగేయడం నుంచి పంపిణీ చేయడం వరకు 'సరఫరా విధానం' (చెయిన్ ఆఫ్ డెలివరీ) మొత్తం ఆధారాలతో బయటికి లాగగలిగామని ఐటీ శాఖ తెలిపింది. తమ సోదాల్లో రూ.4.19 కోట్ల నగదు, 3.2 కోట్లకు పైగా విలువైన నగలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది.

చెన్నై విద్యాసంస్థలో ఐటీ దాడులు

- లెక్కల్లో చూపని రూ.350 కోట్ల గుర్తింపు

చెన్నై(ఆంధ్రజ్యోతి): చెన్నై శివారులో ఇంజనీరింగ్, దంత, నర్సింగ్ కళాశాలలు, ఆసుపత్రిని నిర్వహిస్తున్న ప్రముఖ విద్యా సంస్థలో ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రూ.350 కోట్లు లెక్కల్లో చూపకుండా పన్ను ఎగవేతకు పాల్పడినట్లు గుర్తించారు. మూడు దశాబ్దాలకు పైగా చెన్నై పరిసర ప్రాంతాల్లో విద్యా సంస్థలు నడుపుతున్న ఆ ప్రైవేటు విద్యా సంస్థల గ్రూపులో ఈ నెల 7న దాడులు జరిపినట్లు సీబీడీటీ ప్రకటించింది. ఆ విద్యా సంస్థ వివరాలను అధికారికంగా వెల్లడించనప్పటికీ చెన్నై షోలింగనల్లూరు ప్రాంతంలో ఉన్న జేప్పియార్ గ్రూపులోనే ఆ దాడులు జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ దాడులల్లో రూ.5 కోట్ల నగదు, రూ.3 కోట్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా ఆ సంస్థ తన నిధులను ఇతర రంగాలకు కూడా మళ్లించినట్లు అధికారులు గుర్తించారు.

కొంచెం కోత వాత

పన్ను శ్లాబుల్లో పలు మార్పులు?

వచ్చే బడ్జెట్‌లో ప్రతిపాదించే అవకాశం

అసలే ఆర్థిక మందగమనం. పైగా కార్పొరేట్లకు రూ.1.45 లక్షల కోట్ల పన్ను రాయితీ కల్పించింది ప్రభుత్వం. దీంతో ఖజానాకు భారీ గండిపడే పరిస్థితి ఏర్పడింది. పోయిన చోటే వెతుక్కోవాలన్న చందాన రాయితీలతో ఆదాయం తగ్గిన పన్నుల విభాగం నుంచే రాబడి పెంచుకోవడంపై సర్కారు దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. అందుకోసం ఐటీ టాస్క్‌ఫోర్స్ సిఫారసుల్లో కొన్నింటినైనా అమలు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020-21) ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పన్నులకు సంబంధించి పలు మార్పులను ప్రతిపాదించే అవకాశం ఉంది. ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) సభ్యుడు అఖిలేష్ రంజన్, ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కే సుబ్రమణియన్‌లతో కూడిన ఐటీ టాస్క్‌ఫోర్స్ ఆగస్టు 19న కేంద్రానికి రిపోర్టు సమర్పించింది. అందులోని కీలక సిఫారసులు..

వ్యక్తిగత ఆదాయ పన్ను

ప్రస్తుత వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబులను సమూలంగా మార్చాలని టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదించింది. అలాగే, పలు మినహాయింపులకు కొంత కత్తెర వేయాలని, కొన్నింటిని రద్దు చేయాలని, పన్నుకు అదనంగా వసూలు చేస్తున్న సర్‌చార్జ్‌ను ఎత్తివేయాలని సూచించింది. అయితే, ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి మార్పుపై మాత్రం ఎలాంటి సిఫారసు చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతం రూ.2.5 లక్షల వరకు వార్షికాదాయంపై పన్ను మినహాయింపు లభిస్తోంది.

ప్రతిపాదిత పన్ను శ్లాబులు

ఆదాయం (రూ.)	పన్ను%
10 లక్షల వరకు	10
10 లక్షలు-20 లక్షల వరకు	20
20 లక్షలు-2 కోట్ల వరకు	30
2 కోట్లకు పైగా	35

ప్రస్తుత పన్ను శ్లాబులు

2.5 లక్షల వరకు	లేదు
2.5 లక్షలు-5లక్షల వరకు	5
5 లక్షలు-10 లక్షల వరకు	20
10 లక్షలకు పైగా	30

గమనిక: పన్నుతోపాటు 4 శాతం సుంకం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

రద్దు చేసేందుకు అవకాశమున్న మినహాయింపులు

- ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆర్జించే వడ్డీ
- ఈక్విటీ అనుసంధానిత పొదుపు పథకాలపై రిటర్నులు
- బీమా పథకంపై లభించే రిటర్నులు

కత్తెర పడేందుకు అవకాశమున్న పన్ను మినహాయింపులు

- ప్రావిడెంట్ ఫండ్
- విరాళాలు
- వైద్య, విద్య ఖర్చులు
- గృహ రుణం

పరిగణనలోకి తీసుకునే కాలపరిమితి

విభాగం	స్వల్పకాలికం	దీర్ఘకాలికం
ఈక్విటీలు	12 నెలలలోపు	ఏడాదికి పైగా
నాన్-ఈక్విటీ ఫైనాన్షియల్ అసెట్స్	24 నెలలలోపు	రెండేళ్లకు పైగా
ప్రాపర్టీ తదితర ఆస్తులు	36 నెలలలోపు	మూడేళ్లకు పైగా

పెట్టుబడులపై ఆర్జిత పన్ను

క్యాపిటల్ గెయిన్ టాక్స్ (పెట్టుబడులపై ఆర్జిత పన్ను) కోసం ఆస్తులను మూడు విభాగాలుగా విభజించాలి. అవి..

1. ఈక్విటీ
2. నాన్ ఈక్విటీ ఫైనాన్షియల్ అసెట్స్
3. స్థిరాస్తి తదితరాలు

స్వల్పకాలిక పెట్టుబడుల ఆర్జిత పన్ను- 15%

దీర్ఘకాలిక పెట్టుబడుల ఆర్జిత పన్ను

ఈక్విటీలు : 10%

ఇతర విభాగాలు : 20%

కంపెనీలకు..

- డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ ఎత్తివేత
- విదేశీ కంపెనీలపై పన్ను 40% నుంచి 25 శాతానికి తగ్గింపు
- ప్రిజంప్టివ్ టాక్స్ నిబంధనలు మరింత పటిష్ఠం

ప్రస్తుత క్యాపిటల్ గెయిన్ టాక్స్

ఏడాదికిపైగా కలిగి ఉన్న ఈక్విటీలు, ప్రిఫరెన్షియల్ షేర్లు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లు, జీరో కూపన్ బాండ్లు, యూటీఐ యూనిట్లను దీర్ఘకాలిక పెట్టుబడులుగా పరిగణిస్తున్నారు. రియల్ ఎస్టేట్ అయితే 24 నెలలు, డెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్లు, ఆభరణాలైతే 36 నెలలకు మించితే దీర్ఘకాలిక పెట్టుబడులుగా పరిగణిస్తున్నారు.

ఎన్ఎండీసీ లాభం రూ.703 కోట్లు

హైదరాబాద్: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎన్ఎండీసీ ప్రోత్సాహక ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికిగాను కంపెనీ నికర లాభం 10.5 శాతం వృద్ధి చెంది రూ.703.27 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదేకాలంలో నికర లాభం రూ.636.37 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం రూ.2438 కోట్ల నుంచి రూ.2,242 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ.1,288.85 కోట్లుగా ఉన్నట్లు ఎన్ఎండీసీ తెలిపింది. ఇటీవలికాలంలో పలు సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన పనితీరును కనబరిచినట్లు ఎన్ఎండీసీ సీఎండీ బజేంద్ర కుమార్ అన్నారు.

హెచ్‌పీసీఎల్ విస్తరణ పైప్‌లైన్ జాతికి అంకితం

మల్కాపురం (విశాఖపట్నం): విశాఖపట్నం నుంచి విజయవాడ మీదుగా సికింద్రాబాద్ వరకు నిర్మించిన హెచ్‌పీసీఎల్ విస్తరణ పైప్‌లైన్ ప్రాజెక్టును కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జాతికి అంకితం చేశారు. ఈ మూడు ప్రధాన నగరాల మధ్య పెట్రో ఉత్పత్తుల సరఫరా కోసం ఈ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే విశాఖపట్నం-విజయవాడ మధ్య ఉన్న ఈ పైప్‌లైన్‌ను కొత్తగా సికింద్రాబాద్ వరకు విస్తరించారు. విశాఖలోని మాస్టర్ కంట్రోల్ స్టేషన్ నుంచి ఈ మూడు నగరాల మధ్య ఉన్న పైప్‌లైన్‌ను పర్యవేక్షించే రిమోట్ కేంద్రాన్ని కూడా కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ప్రారంభించారు. సరికొత్త టెక్నాలజీతో ఏర్పాటైన ఈ పైప్‌లైన్‌పై 24 గంటల పాటు నిఘా ఉంటుంది.

నేడు మార్కెట్లకు సెలవు

గురునానక్ జయంతి సందర్భంగా మంగళవారం స్టాక్ మార్కెట్లకు సెలవు. స్టాక్ మార్కెట్లతో పాటు ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు కూడా పనిచేయవు. బుధవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

11న ఫారం గేటు అమ్మకం ధరలు

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.50 — నెక్ (100 గుడ్లు)

		12వ తేదీకి..	
హైదరాబాద్	392	విశాఖపట్నం	405
బెంగళూరు	419	వరంగల్	395
విజయవాడ	401	చెన్నై	430
గోదావరి	401	చిత్తూరు	423
నమక్కల్	388	ముంబై	447

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	93	విజయవాడ	93
వరంగల్	93	గుంటూరు	93
మహబూబ్‌నగర్	93	ఒంగోలు	95
కరీంనగర్	93	చిత్తూరు	92
కర్నూలు	93	నెల్లూరు	92
విశాఖపట్నం	78	అనంతపురం	87
గోదావరి	89		

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	38,100	38,850	39,290	---	37,990
క్రితం ముగింపు	38,220	38,800	39,100	38,900	37,930
22 క్యారెట్లు	36,320	36,000	36,140	---	36,360
క్రితం ముగింపు	36,420	36,000	35,970	36,050	36,300
వెండి (కిలో)	44,100	45,600	45,600	---	47,700
క్రితం ముగింపు	43,900	45,600	45,300	45,600	47,200

'జెట్'లో గోయెల్ చేతివాటం

ముంబై: తవ్వేకొద్దీ జెట్ ఎయిర్‌వేస్‌లో ప్రధాన ప్రమోటర్ నరేశ్ గోయెల్ అక్రమాలు బయటపడుతున్నాయి. విజయ్ మాల్యా వంటి కేటుగాళ్లు, డొల్ల కంపెనీల ద్వారా కోట్లు కొట్టేస్తే.. గోయెల్ సేల్స్ ఏజెంట్ల (జీఎస్ఏ) ద్వారా జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన వేల కోట్ల రూపాయలు తన రహస్య ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. గోయెల్ అక్రమాలపై దర్యాప్తు జరుపుతున్న ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన తీవ్ర ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ (ఎస్ఎఫ్ఐఓ) ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆధారాలు సంపాదించింది. జెట్ ఎయిర్‌వేస్ కోసం ప్రపంచవ్యాప్తంగా గోయెల్ నియమించిన జీఎస్ఏల్లో ఎక్కువ మంది ఏదో విధంగా గోయెల్‌కు సంబంధించిన వారేనని దర్యాప్తులో తేలింది.

జీఎస్ఏలు అంటే?

ఖర్చులు తగ్గించుకునేందుకు లేదా ఏదైనా ఒక కొత్త మార్కెట్‌లో ప్రవేశించేందుకు లేదా ఉన్న మార్కెట్‌లోనే తన సేవలను మరింత విస్తరించేందుకు విమానయాన సంస్థలు జీఎస్ఏలను తమ ప్రతినిధులుగా నియమిస్తాయి. ఆయా మార్కెట్లలో వీరే ఆయా ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన సేవలు, ఉత్పత్తులు అందిస్తారు. దీని వల్ల విమానయాన సంస్థలు ఆయా మార్కెట్లలో సొంతంగా ఆఫీసులు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉండదు. ఆ విధంగా కంపెనీలకు ఖర్చులు కలిసొస్తాయి.

నరేశ్ గోయెల్ ఇందుకోసం ఏకంగా జెట్ ఎయిర్ ట్రావెల్స్ పేరుతో సొంత జీఎస్ఏను ఏర్పాటు చేసి, చాలా దేశాల్లో ఆ సంస్థనే జెట్ ఎయిర్‌వేస్ జీఎస్ఏగా నియమించారు. 'వెలుపలి చెల్లింపు'ల పేరుతో ఈ సంస్థలకు భారీ ఎత్తున చెల్లింపులు చేస్తూ జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన వందల కోట్ల రూపాయలు దారి మళ్లించారని దర్యాప్తులో తేలింది.

మొబైల్ కొనుగోళ్లు వాయిదా వేస్తున్నారు

- ఈ ఏడాది అమ్మకాలు 2.4 శాతం తగ్గొచ్చు

ముంబై: మొబైల్ ఫోన్ల కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఫోన్ల కొనుగోళ్లను కొంత మంది వాయిదా వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాదిలో మొబైల్స్‌పై వెచ్చించే మొత్తం 2.4 శాతం క్షీణించి 3,337.9 కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని పరిశోధనా సంస్థ గార్ట్‌నర్ నివేదిక చెబుతోంది. ఆర్థిక వ్యవస్థలోమందగమనం నెలకొన్న నేపథ్యంలో ఈ ప్రతికూల అంచనా వెలువడటం గమనార్హం. కాగా వచ్చే ఏడాదిలో మొబైల్ ఫోన్ల వినియోగదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపే అవకాశం ఉన్నందు వల్ల ఐటీ పై ఖర్చులు పుంజుకోవచ్చని పేర్కొంది. 2020 సంవత్సరంలో ఐటీ వ్యయాల్లో 6.6 శాతం వృద్ధి చెంది 8,850 కోట్ల డాలర్ల నుంచి 9,400 కోట్ల డాలర్లకు పెరగవచ్చని తెలిపింది.

నాగార్జునా ఆయిల్ కథ కంచికి

తుది దశకు చేరిన లిక్విడేషన్

ముంబై: హైదరాబాద్‌కు చెందిన నాగార్జునా గ్రూపు తమిళనాడులో తలపెట్టిన నాగార్జునా ఆయిల్ కార్పొరేషన్ (ఎన్ఓసీఎల్) పెట్రో రిఫైనరీ ప్రాజెక్టు కథ కంచికి చేరింది. ఈ ప్రాజెక్టు దివాలా ప్రక్రియ తుది దశకు చేరందని తమిళనాడు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (టీఎన్ఐడీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనీశ్ శేఖర్ ప్రకటించారు. దీంతో ఏదైనా కంపెనీ ముందుకొచ్చి ఈ ప్రాజెక్టును చేపట్టే అవకాశం ఉందన్నారు. రసాయనాలు, పెట్రో రసాయనాల పరిశ్రమపై ఫిక్కీ నిర్వహిస్తున్న సదస్సులో ఆయన ఈ విషయం తెలిపారు. దీంతో కడలూరు-నాగపట్నం మధ్య రూ.4,300 కోట్ల పెట్టుబడులతో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పెట్రోలియం, రసాయనాలు, పెట్రో రసాయనాల పెట్టుబడి ప్రాంతానికి(పీసీపీఐఆర్) రంగం సిద్ధమవుతుందన్నారు. ఈ పీసీపీఐఆర్ ప్రాజెక్టు ద్వారా రూ.8,100 కోట్ల పెట్టుబడులు, 7.37 లక్షల ఉద్యోగాలు ఏర్పడతాయని అంచనా.

ఇదీ ఎన్ఓసీఎల్ ప్రాజెక్టు: నాగార్జునా గ్రూప్ రూ.3,500 కోట్ల అంచనాతో ఈ ప్రాజెక్టును తలపెట్టింది. జర్మనీలోని ఒక పాత రిఫైనరీ ప్రాజెక్టు యంత్రాలను కొనుగోలు చేసి, 2012 కల్లా ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభించాలని ముందు అనుకున్నారు. అయితే వివిధ కారణాలతో ప్రాజెక్టు ఆలస్యమైంది. దీంతో రిఫైనరీ ప్రాజెక్టు వ్యయం మూడు రెట్లు పెరిగిపోయింది. 2011 డిసెంబరులో తమిళనాడును కుదిపేసిన తుపానుతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిగా ఆగిపోయింది. బ్యాంకు రుణాలతో మళ్లీ ప్రాజెక్టును గట్టెక్కించాలని నాగార్జునా గ్రూపు ప్రయత్నించినా, ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పుడు దివాలా ప్రక్రియ తుది దశకు చేరడంతో ఏదైనా కంపెనీ ఈ ప్రాజెక్టును కొత్తగా చేపడుతుందని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది.

మా వాళ్లున్నారు..వెళ్లిపోండి

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినులపై జులుం
- అధికారులపై అధికారనేతల ఒత్తిడి
- తొలగిస్తున్నట్టు ఆదేశాలు రావడంతో తట్టుకోలేక ఫినాయిల్ తాగిన ఇద్దరు
- ప్రకాశంజిల్లా పెద్దదోర్నాలలో ఘటన

చికిత్స పొందుతున్న మల్లీశ్వరి, రాజేశ్వరి

పెద్దదోర్నాల, నవంబరు 11: వైసీపీ నాయకులు రకరకాలుగా వేధిస్తూ, తమకు ఉద్వాసన పలికేలా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారంటూ ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగినులు ఆత్మహత్యాయత్నం చేశారు. తాము విధులు నిర్వహిస్తున్న పాఠశాల వద్దే ఫినాయిల్ తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం ఎగువచర్లోపల్లిలో సోమవారం ఈ ఘటన జరిగింది. బాధితుల కథనం ప్రకారం, ఎగువచర్లోపల్లి మోడల్ స్కూల్ వసతి గృహంలో వాచ్ ఉమన్‌గా గోదా విశ్రాంతమ్మ, హెడ్‌కుక్‌గా బోధనపు శ్రీలక్ష్మి, సహాయకులుగా ఇట్ల మల్లీశ్వరి, పులిగుజ్జు రాజేశ్వరి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో మూడేళ్లుగా పనిచేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ, వారిని విధుల నుంచి తప్పుకోవాలంటూ వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారు. 'మా వాళ్లున్నారు. మా పార్టీ అధికారంలో ఉంది. మీరు వెళ్లిపోండి' అని నెల నుంచి మరింతగా స్వరం పెంచారు. అంతే కాదు, వారిని తప్పించాలంటూ ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌పైనా ఒత్తిడి తెచ్చారు. జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేశ్ ద్వారా సిఫారసు చేయించి డీఈవో నుంచి లిఖితపూర్వకంగా తమ మద్దతుదారులను నియమించుకునేలా అనుమతులు తెచ్చుకున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ నలుగురిని ప్రిన్సిపాల్ తప్పించారు. దీంతో మనోవేదనకు గురైన మల్లీశ్వరి, రాజేశ్వరి ఫినాయిల్ తాగారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాణాపాయం తప్పింది. తమను కలిసిన మీడియా వద్ద వారు కన్నీటిపర్యంతమయ్యారు. "మూడేళ్లుగా ఈ ఉద్యోగాన్నే నమ్ముకున్నాం. కొద్దిపాటి జీతమైనా పని చేస్తున్నాం. ఉన్నట్టుండి వెళ్లిపొమ్మంటే ఎలా? పనులు సక్రమంగా నిర్వహించకపోతే తొలగించడం న్యాయమే. కానీ మేము బాగా పని చేస్తున్నా విధుల నుంచి తప్పించడం ఎక్కడి న్యాయం?' అని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

జయరామిరెడ్డిని ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న భార్య

ఇంటిపై వైసీపీ దౌర్జన్యం

నిర్మాణ పనులు అడ్డుకోవడంతో 'స్పందన'లో ఆత్మహత్యాయత్నం

'అనంత'లో తహసీల్దార్ కార్యాలయం దగ్గరే పురుగుమందు తాగిన కార్యకర్త

గుమ్మఘట్ట, నవంబరు 11 : వైసీపీ నేతలు గ్రామంలో తమ కుటుంబాన్ని వేధిస్తున్నారని ఫిర్యాదుచేసినా అధికారులు 'స్పందించ'డం లేదంటూ అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం బీటీపీ గ్రామానికి చెందిన జయరామిరెడ్డి ఆత్మహత్యాయత్నం చేశారు. సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతున్న కార్యాలయం వద్దే పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పక్కనే ఉన్న భార్య, పోలీసులు హుటాహుటిన జయరామిరెడ్డిని ఆస్పత్రికి తరలించారు. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం బీటీపీ గ్రామంలో ఈ ఘటన జరిగింది. బాధితుల కథనం ప్రకారం, 2018 జూలై బీటీపీ గ్రామంలోని సర్వే నంబర్ 542లో టీడీపీ కార్యకర్త జయరామిరెడ్డి భార్య పల్లవి పేరుతో రెవెన్యూ అధికారులు 2.5 సెంట్ల భూమికి ఇంటిపట్టాను మంజూరు చేశారు. అయితే, ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టకుండా స్థానికంగా ఉన్న వైసీపీ నాయకులు సంజీవరెడ్డి, తిప్పేస్వామి, కృష్ణారెడ్డి, వీరారెడ్డి కుటుంబ సభ్యులు తరచూ అడ్డు తగులుతూ వచ్చారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జయరామిరెడ్డి కుటుంబం రాయదుర్గం సివిల్ కోర్టులో ఇంజెక్షన్ ఉత్తర్వులు పొందింది. అయినా, వైసీపీ నేతల వేధింపులు ఆగలేదు. దీంతో జయరామిరెడ్డి తన భార్య పల్లవితో కలిసి సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకొన్నారు. ఈమేరకు వారు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొన్నారు. తహసీల్దార్ వెంకటచలపతిని కలుసుకొని, తమకు జరిగిన అన్యాయం చెప్పుకొని వాపోయారు. కోర్టు నుంచి ఇంజెక్షన్ ఉత్తర్వులు తెచ్చుకొన్నా, వేధింపులు ఆగడం లేదని వాపోయారు. తమకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని వేడుకొన్నారు. అయితే, తహసీల్దార్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో జయరామిరెడ్డి ఆ కార్యాలయం ఆవరణలో మిరపపంటకు కొట్టే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు చికిత్స నిమిత్తం ఆయనను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జయరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, తాను ఇంటి స్థలాన్ని పరిశీలించానని, సర్వేయర్‌తో సర్వే చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చానని, అయినా క్షణికావేశంతో కార్యాలయం ఆవరణలో జయరామిరెడ్డి పురుగుల మందు తాగడం బాధాకరమని తహసీల్దార్ వివరించారు.

జస్టిస్ రాకేశ్‌కు న్యాయవాదుల సన్మానం

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్నా హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చిన జస్టిస్ రాకేశ్ కుమార్‌ను న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు వైవీ రవిప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జేకే మహేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం, సహాయ సొలిసిటర్ జనరల్ కృష్ణమోహన్,న్యాయవాదులు హాజరయ్యారు.

రైతు బాగుంటేనే రాజ్యం సుభిక్షం: గవర్నర్

విజయవాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భూమిని నమ్ముకుని జీవితాన్ని సాగిస్తున్న రైతులు సుఖసంతోషాలతో ఉన్నప్పుడే ఆ సమాజం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ రాసిన 'క్రాప్ హాలిడే' పుస్తకాన్ని సోమవారం విజయవాడ వెన్యూ ఫంక్షన్ హాల్లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ కర్షకులకు కనీస మద్దతు ధర కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. పుస్తక రచయిత యలమంచిలి శివాజీ మాట్లాడుతూ పొగాకు రైతుకు కనీస మద్దతు ధర కల్పించడం కోసం క్రాప్ హాలిడే ప్రకటించడానికి ముందు కిలో పొగాకుకు రూ.25-30 మాత్రమే వచ్చేదన్నారు. తాము ఉద్యమం చేసిన తర్వాత రూ. 130-150 వస్తోందన్నారు. పొగాకు సాగులో అధిక దిగుబడులు సాధించిన రైతులను ఈ సందర్భంగా గవర్నర్ సత్కరించారు.

గవర్నర్‌ను కలిసిన ఏపీపీఎస్సీ చైర్మన్

ఏపీపీఎస్సీ చైర్మన్ పిన్నమనేని ఉదయభాస్కర్ సోమవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిశారు. యూపీఎస్సీ, రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లతో డిసెంబరులో విజయవాడలో నిర్వహించదలచిన వర్క్‌షాపునకు ఆయనను ఆహ్వానించారు.

పాడి పశువుకూ హెల్త్‌కార్డు!

- నియోజకవర్గానికో వెటర్నరీ ల్యాబ్

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి పశువులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని పశుసంవర్ధకశాఖ యోచిస్తోంది. పుట్టినప్పటి నుంచి ప్రతి నెలా ఆరోగ్య స్థితిని హెల్త్‌కార్డులో నమోదు చేయడం వల్ల వ్యాధి నిర్ధారణ, చికిత్స సులభంగా ఉంటుందని భావిస్తోంది. గ్రామ సచివాలయంలో నియమితులైన వీవీఏ(విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్)లు ప్రతినెలా పశుపోషకుల ఇంటికి వెళ్లి పాడి పశువులకు వ్యాధి పరిశీలన చేసి, రికార్డు నమోదు చేయడం, తర్వాత మండల పశువైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లి, రోగ నిర్ధారణ చేయించి, తగిన వైద్యం చేయించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే రాజన్న పశువైద్యం పేరిట రైతు ఇంటికే వెళ్లి పశువుకు వైద్యసేవలు అందించనున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. గ్రామసచివాలయాల వద్ద ట్రైవీస్‌లను ఏర్పాటుచేసి, పశువుల వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్రతిపాదనలు సిద్ధంచేశారు. పశువుల వ్యాధి నిర్ధారణకు నియోజకవర్గానికో ల్యాబ్‌ను ప్రతిపాదించినట్టు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ సోమశేఖరం తెలిపారు.

నేడు, రేపు ప్రత్యేక దర్శనాల్లో అదనపు కోటా

తిరుమల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు, చంటిబిడ్డల తల్లిదండ్రులకు శ్రీవారి దర్శనానికి మంగళ, బుధవారాల్లో అదనపు కోటా కేటాయించారు. ఎస్వీ మ్యూజియం ఎదురుగా ఉన్న కౌంటరులో వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం 4వేల టోకెన్లు జారీచేస్తారు. వీటిని ఉదయం 6గంటల నుంచి పొందవచ్చు. అలాగే ఐదేళ్ల లోపు చంటిబిడ్డల తల్లిదండ్రులను బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సుపథం ద్వారా అనుమతిస్తారు. ఇదే నెలలో 26న వృద్ధులు, దివ్యాంగులకు, 27న ఐదేళ్ల లోపు చంటిబిడ్డల తల్లిదండ్రులకు మరో అవకాశం కల్పించారు.

ఏపీఆర్‌సెట్‌కు 80.39 శాతం హాజరు

ఏయూ క్యాంపస్ (విశాఖపట్నం), నవంబరు 11: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన ఏపీఆర్‌సెట్-2019కు 80.39 శాతం మంది హాజరైనట్టు కన్వీనర్ ఆచార్య కె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌సెట్‌కు 16,885 మంది దరఖాస్తు చేసుకోగా 13,574 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని ఆయన వివరించారు. పరీక్షల ప్రాథమిక కీని రేపు విడుదల చేస్తామని, 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యర్థులు తమ అభ్యంతరాలు, సూచనలను తగిన ఆధారాలు జతపరుస్తూ తమకు పంపాలని ఆయన విజ్ఞప్తిచేశారు. అభ్యంతరాలు, సూచనలను ఈమెయిల్ aprcetobjections2019@gmail.com ద్వారా మాత్రమే పంపాలన్నారు.

కౌలురైతు ఆత్మహత్య

ఆదోని, నవంబరు 11: కర్నూలు జిల్లాలో అప్పులబాధతో ఓ కౌలు రైతు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదోని మండలం జాలిమంచికి చెందిన బి.వీరేష్ (31) తనకున్న 50 సెంట్ల పొలంతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని ఆముదం, పత్తి సాగుచేశాడు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు పండలేదు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు అధికమయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వీరేష్ ఆదివారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు.

ఇదో ఆబోతు ప్రభుత్వం

ఆత్మహత్యలను ఎగతాళి చేస్తారా?: కర్నూలు జిల్లాలో లోకేశ్ ఆగ్రహం

గొర్ల నాగన్న ఇంటిలో చిన్నారిని ఎత్తుకున్న లోకేష్

- ఇసుక తినేస్తున్నామని గతంలో మాపై ఆరోపణలు
- ఇప్పుడు పందికొక్కుల్లా పడి తింటున్నది ఎవరు?
- పత్తికొండలో చనిపోయిన ఇద్దరి కుటుంబాలకు పరామర్శ
- రూ.లక్ష చొప్పున చెక్కుల పంపిణీ

కర్నూలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక కొరతను పట్టించుకోని, భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలను ఎగతాళి చేసేలా జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. ఇదో ఆబోతు ప్రభుత్వమని విరుచుకుపడ్డారు. కర్నూలుజిల్లా పత్తికొండలో సోమవారం ఆయన పర్యటించారు. ఇసుక కొరత కారణంగా ప్రాణాలు కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులు నాగరాజు, సుంకన్న కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. వారి పిల్లల భవిష్యత్‌కు టీడీపీ అండగా ఉంటుందని హామీఇచ్చారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్రల్లోనూ భారీ వరదలు వచ్చాయని, కానీ అక్కడ ఇసుక కొరత లేదని చెప్పారు. ఇక్కడ 5 నెలలుగా పనులు దొరక్క, అప్పులతో కడుపు నింపుకొంటున్న భవన నిర్మాణ కార్మికులు చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంట్లో పిల్లాడి సైకిల్‌ను అమ్ముకుని నిత్యావసరాలు కొనుక్కునే దుస్థితికి వారు చేరుకున్నారని వాపోయారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉండగా ఇసుక తినేస్తున్నారంటూ తమపై ఆరోపణలు చేసిందని.. ఇప్పుడు పందికొక్కుల్లా పడి తింటున్నదెవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి సాక్షిగా వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ ఇసుక దందాల్లో వాటాల కోసం తన్నుకున్నారని, కృష్ణాజిల్లాలోనూ ఇలాంటి ఘటన జరిగిందని చెప్పారు. ఇసుక సమస్య పరిష్కారానికి టీడీపీ పోరాడుతుంటే డైటింగ్ కోసం దీక్షలు చేస్తున్నారని ఎగతాళి చేస్తున్నారని.. వెంటనే కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అమరావతిని మార్చడానికి వాళ్లెవరు?

2014లో శాసనసభ వేదికగా అమరావతి నిర్మాణంపై తీర్మానం జరిగిందని, అందరి ఆమోదంతోనే నిర్మాణం ప్రారంభమైందని లోకేశ్ చెప్పారు. అన్ని జిల్లాలనూ అభివృద్ధి చేయాలనే కాంక్షలో భాగంగా కర్నూలు జిల్లాకు హైకోర్టు బెంచ్, ఎయిర్‌పోర్టు, పరిశ్రమల స్థాపన తదితరాలకు టీడీపీ శ్రీకారం చుట్టిందన్నారు. 'అమరావతి విషయంలో వైసీపీ మంత్రులు రోజుకో మాట మాట్లాడుతూ రాజధానిపై గందరగోళం సృష్టిస్తున్నారు. దీనివల్ల తెలంగాణలో భూమి ధరలు పెరిగాయి. ఇవన్నీ ప్రశ్నిస్తున్న మీడియాపై కేసులు పెడతామని ఉత్తర్వులు జారీ చేయడం అనాగరికం. మేం అధికారంలో ఉండగా తెలుగు సబ్జెక్టును ఆప్షనల్‌గా ఉంచుతూ ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టాం. ఇప్పుడు తెలుగు మీడియంను పూర్తిగా తొలగిస్తూ.. అడిగిన వాళ్లపై ఎదురు దాడికి దిగుతున్నారు' అని ధ్వజమెత్తారు. మద్య నిషేధం అని చెప్పిన జగన్ ప్రభుత్వం బాటిల్‌కు రూ.20 అధికంగా వసూళ్లు చేస్తూ రాష్ట్రంలో 'జె' ట్యాక్స్‌కు తెరదీసిందన్నారు. దోమలపై దండయాత్రను ఎగతాళిచేసిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన నియోజకవర్గంలో ఎంతమంది చిన్నారులు విషజ్వరాలతో చనిపోయారో తెలుసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియాతో రాష్ట్రంలో ఇప్పటికే 2,500 మంది చనిపోయారని చెప్పారు.

కొడాలి నాని ఇంటికి ప్రదర్శనగా వెళ్తున్న సీఐటీయూ కార్మికులు

బతుకులను అపహాస్యం చేశారు

- మంత్రి కొడాలి ఇల్లు ముట్టడి
- సీఐటీయూ నేతృత్వంలో ఇసుక కార్మికుల నిరసన

గుడివాడ, నవంబరు 11: "పేదల బతుకులు బాగుపడతాయని జగన్‌కు ఓట్లువేస్తే మా బతుకులనే అపహాస్యం చేశారు. పనుల్లేక 36 మంది కార్మికులు చనిపోతే వేరే కారణాలతో మృతి చెందారని ప్రజాప్రతినిధులు వెటకారంగా మాట్లాడడం బాధాకరం. రాష్ట్రంలోని 272 ఇసుక రీచ్‌లను తక్షణం తెరిచి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి" అని సీఐటీయూ నేత టి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. తూర్పు కృష్ణా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుడివాడ రాజేంద్రనగర్‌లోని మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఇంటిని సోమవారం ముట్టడించారు. మంత్రి ఊళ్లో లేరన్న సమాచారంతో కార్మికులు రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్షణరావు మాట్లాడారు. లక్షలాది మంది పేద కార్మికుల బతుకులతో ప్రభుత్వమాడుతున్న ఆటలు ఇక సరిపెట్టాలని హెచ్చరించారు. ఇసుక ఉచితంగా అందించి పని కల్పించాలని, పనుల్లేక మృతి చెందిన 36 మంది భవన నిర్మాణ కార్మికులకు రూ.25 లక్షల నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఐదు నెలలుగా పనులు లేక అల్లాడుతున్న కార్మికులకు నెలకు రూ.20 వేల చొప్పున భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు మంత్రి ఇంటికి చేరుకున్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రగిరి శివనాగ మల్లేశ్వరరావు, అధ్యక్షుడు ఏసుపోగు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు బాగా తగ్గాలి

- టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి
- రోడ్ సేఫ్టీ సమావేశంలో డీజీపీ సవాంగ్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రోడ్లపై ప్రమాదాల తగ్గింపునకు టెక్నాలజీని మరింత సద్వినియోగం చేసుకోవాల్సి ఉందని డీజీపీ గౌతమ్ సవాంగ్ అభిప్రాయపడ్డారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాల సంఖ్య బాగా తగ్గాల్సి ఉందన్నారు. జాతీయ రహదారులు, టోల్ గేట్స్, ఇతర ప్రైవేటు సీసీ కెమెరాలతోపాటు పోలీసుశాఖ ఏర్పాటుచేసిన వాటిని జిల్లాల కమాండ్ కంట్రోల్‌తోపాటు రాష్ట్ర హెడ్ క్వార్టర్స్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానించాలని టెక్నికల్ డీఐజీ పాలరాజును ఆదేశించారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రోడ్ సేఫ్టీ అడ్వైజర్ హరి కృష్ణ తమ పరిధిలో ఉన్న అన్ని కెమెరాలను డీజీ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

యువ ఐపీఎస్‌లకు సూచనలు..

ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, ఇక్కడి నేరాల తీరుతెన్నులు తెలుసుకొని శాంతి భద్రతల పరిరక్షణకు గట్టిగా కృషి చేయాలని యువ ఐపీఎస్ అధికారులకు డీజీపీ సూచించారు. రాష్ట్రానికి కేటాయించిన 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు జగదీష్, తుషార్ డుడి, కృష్ణకాంత్ పాటిల్, మణికంఠ చందోలు, కృష్ణకాంత్ 9నెలల శిక్షణ పూర్తి చేసుకుని తాజాగా ఏపీ పోలీసుశాఖలోకి అడుగుపెట్టారు. 28 వారాల క్షేత్ర స్థాయి శిక్షణలో భాగంగా ట్రైనింగ్ ఐజీ సంజయ్ వద్ద నాలుగు వారాలు, మిగిలిన 24వారాలు జిల్లాల ఎస్పీల వద్ద వారు శిక్షణ తీసుకోనున్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి, ఏపీ పోలీస్ మాన్యువల్‌ను డీజీపీ అందజేశారు.

నిజాయితీకి నిలువుటద్దం శేషన్: సీఎం జగన్

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నిజాయితీ, నిర్భీతి, అంకిత భావానికి కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన అధికారి టీఎన్ శేషన్ నిలువుటద్దమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో శేషన్ మృతికి సీఎం ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారత ఎన్నికల కమిషన్ శక్తిని ప్రజాస్వామ్య సౌధ నిర్మాణానికి ఎలా ఉపయోగించవచ్చో నిరూపించిన శేషన్ పేరు, దేశ ప్రజాస్వామ్య చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని సీఎం తెలిపారు.

శేషన్ దేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ: చంద్రబాబు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం విశ్రాంత ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్ మరణం పట్ల టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సంతాపం వ్యక్తంచేశారు. శేషన్ భారత ప్రజాస్వామ్యానికి నూతన జవసత్వాలు కల్పించారని, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని సోమవారం ట్వీట్ చేశారు. దేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ శేషన్ అని, సమకాలీన యంత్రాంగానికి ఆయన మార్గదర్శకుడని కొనియా డారు. శేషన్ ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆరోగ్యశాఖ కార్యదర్శిని ఉరి తీయాలి

- సుగాలి ప్రీతి తల్లిదండ్రుల డిమాండ్

తిరుపతి, నవంబరు 11: రెండేళ్ల క్రితం కర్నూలు జిల్లాలో తమ బిడ్డ సుగాలి ప్రీతిపై అత్యాచారం చేసి, హతమార్చిన కేసును ప్రభుత్వం నీరుగారుస్తోందని బాధితురాలి తల్లిదండ్రులు రాజు నాయక్, పార్వతిదేవి ఆరోపించారు. ఈ కేసులో నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్న ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఉరి తీయాలని, తప్పుడు నివేదిక ఇచ్చిన ఇద్దరు డాక్టర్లపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కర్నూలుకు చెందిన వీరు తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల ముందు సోమవారం ధర్నా చేశారు. కర్నూలు కట్టమంచి రామలింగారెడ్డి స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తమ బిడ్డ ప్రీతిపై 2017లో ఆ పాఠశాల నిర్వాహకులు హర్షవర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి అత్యాచారం చేసి హత్య చేశారని వారు చెప్పారు. ఈ విషయాన్ని కర్నూలు ప్రభుత్వాస్పత్రి ఫొరెన్సిక్ ప్రొఫెసర్ నిర్ధారించారన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారన్నారు. ఆ తర్వాత కర్నూలు మెడికల్ కాలేజీ హెచ్‌వోడీ ఒకరు కేసును తప్పుదోవ పట్టిస్తూ నివేదిక ఇచ్చారన్నారు. దీని ఆధారంగా పోలీసులు బలమైన సెక్షన్లు ఎత్తేశారని చెప్పారు. ఆ తర్వాత తాము ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్యను కలిసి న్యాయం చేయాలని కోరగా, ఓ కమిటీ వేశారని గుర్తుచేశారు. నిందితులకు శిక్ష పడే క్రమంలో ప్రస్తుత ప్రిన్సిపల్ సెక్రటరీ జవహర్‌రెడ్డి ఐఏఎస్ కమిటీ వేయగా.. ఆ తర్వాత తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు ప్రీతి ఆత్మహత్య చేసుకుందని నివేదిక ఇచ్చారని తెలిపారు.

హైకోర్టులో ఉద్యోగం పేరిట మోసం

గుంటూరు, నవంబరు 11: హైకోర్టులో ఉద్యోగం అన్నారు.. రూ.7.50 లక్షలు కట్టాలన్నారు. నిజమేనని నమ్మిన నిరుద్యోగి మూడు విడతల్లో ఆ డబ్బు చెల్లించాడు. కానీ.. అతని చేతిలో నకిలీ అపాయింట్‌మెంట్ పెట్టిన అక్కాతమ్ముళ్లు నిలువునా మోసం చేశారు. వివరాల్లోకెళితే... గుంటూరు జిల్లా తాడికొండ మండలం నిడుముక్కలకు చెందిన కరారి సుబ్రహ్మణ్యం ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా జూన్‌లో లాల్‌పురానికి చెందిన అంగజాల వైష్ణవి, ఆమె తమ్ముడు నాగవెంకటేశ్ పరిచయమయ్యారు. ప్రస్తుతం వారు గోరంట్లలోని ప్లాటినం కౌంటిలో నివాసముంటూ బ్రాడీపేటలో పీఎంకేవీవై అనే సంస్థను నిర్వహిస్తున్నారు. హైకోర్టులో ఖాళీగా ఉన్న జుడీషియల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని సుబ్రహ్మణ్యాన్ని నమ్మించారు. పర్మినెంట్ ఉద్యోగం కాబట్టి రూ.7.50 లక్షలు చెల్లాంచాలని చెప్పారు. రూ.50వేలు అడ్వాన్స్ చెల్లించి మిగిలిన మొత్తాన్ని వాయిదాల్లో కట్టాలన్నారు. వారు అడిగినట్లుగానే సుబ్రహ్మణ్యం జూలై 6న అడ్వాన్స్‌గా రూ. 50వేలు చెల్లించాడు. వైష్ణవి, వెంకటేశ్ ఆగస్టు 10న సుబ్రహ్మణ్యానికి ఫోన్ చేసి జాయినింగ్ లెటర్ వచ్చిందని, 13న కన్సల్టెన్సీ ఆఫీస్‌కు వెళ్లగా వారు రాష్ట్ర ప్రభుత్వ ముద్ర, గవర్నర్ సంతకంతో కూడిన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను చూపించారు. అది నిజమైన ఆర్డర్‌గా నమ్మిన బాధితుడు రూ.3 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత ఇంటి కాగితాలు తనఖా పెట్టి అదే నెల 18న రూ.4 లక్షలు కట్టేశాడు. 19న హైకోర్టులో ఉద్యోగంలో చేర్పించడానికి తామే తీసుకెళతామని చెప్పిన వైష్ణవి, వెంకటేశ్ ఆ రోజు నుంచి ఫోన్ స్విచాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

ఇంటిని అమ్మేసి.. జవాన్ల కోసం 50లక్షలు

- సూర్యాపేట వృద్ధుడి విరాళం.. గవర్నర్‌ను కలిసి అందజేత

హైదరాబాద్, హుజూర్‌నగర్, బేగంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'సొంత లాభం కొంత మానుకు పొ

ఆంగ్లానికి పెద్దపీట వేస్తూనే తెలుగును కాపాడుకోవాలి: యార్లగడ్డ

"తల్లి ఒడిలో ఆడుకున్న బాల్యాన్ని, ఊరి బడిలో దిద్దుకున్న ఓనమాలను మరిచిపోలేము. ఆంగ్లానికి పెద్ద పీట వేస్తూనే తెలుగును కాపాడుకోవాలి. అమ్మలాంటి తెలుగుభాషను ఆదరించడం అందరి బాధ్యత" అని అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. సోమవారం సచివాలయంలో తెలుగు భాషాభిమాని ఆకుల ఏడుకొండలు రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

పది వరకు తల్లి భాషే!

- ఆ తర్వాతే మాధ్యమాల యోచన
- మాతృభాషలో ఉపాధి పెరగాలి
- అప్పుడే భాషలకు పునర్వైభవం
- కాన్వెంట్ విద్యతోనే పైకి రాం
- రాష్ట్రపతి,నేను,ప్రధాని చదివింది మా మాతృభాషల్లోనే: వెంకయ్య

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): "మాతృభాషలో చదివే విద్యార్థులకు ఉద్యోగాల్లో, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అప్పుడే దేశంలో వివిధ భారతీయ భాషలకు పునర్వైభవం వస్తుంది" అని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. పదో తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధన చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని ఆయన సూచించారు. సోమవారం ఢిల్లీలో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) మూడో స్నాతకోత్సవానికి వెంకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "వీలైనన్ని భాషలు నేర్చుకోవాలి. కానీ పునాది మాతృభాషలోనే ఉండాలి. 10వ తరగతి వరకు మాతృభాషలో చదివి, ఆ తర్వాత వేరే మాధ్యమాల్లో చేరితే భాష, విషయం సులభంగా అలవడతాయి. కాన్వెంట్ స్కూళ్లలో చదవితేనే పైకి వెళ్లగలమని అనుకోవడం పొరపాటు. రాష్ట్రపతి, నేను, ప్రధానమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలోనే సాగింది." అని పేర్కొన్నారు. భారత విద్యావిధానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని వెంకయ్య అభిప్రాయపడ్డారు. నైతికత, విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు కళలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలపై మరింత దృష్టి సారించాలన్నారు. దేశ అత్యున్నత విద్యా సంస్థల్లో జేఎన్‌యూ రెండో స్థానంలో ఉండడం గర్వించదగ్గ విషయమని, కానీ అంతర్జాతీయంగా ఉత్తమ విద్యా సంస్థల సూచీలో మొదటి వందలో దేశం నుంచి ఒక్క వర్సిటీగానీ, కాలేజీగాని లేకపోవడం బాధాకరమన్నారు. దీన్ని బలహీనతగా భావించవద్దని, మరింత కష్టపడి, చిత్తశుద్ధితో పనిచేస్తే సమీప భవిష్యత్తులో ఆ స్థానాన్ని దక్కించుకుంటామని తెలిపారు. సానుకూల దృక్పథాన్ని అవలంభించాలని, విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచాలని, పరిశోధనలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం పీహెచ్‌డీ పట్టాలను వెంకయ్య ప్రదానం చేశారు. ఈ పట్టాలు అందుకున్న వారిలో ఎక్కువ మంది మహిళలు ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు రాజకీయాల్లోనూ సరిపడా రిజర్వేషన్లు కల్పించాలన్న ఆయన, మహిళల పాత్ర లేకుండా దేశాభివృద్ధిని ఊహించలేమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్, జేఎన్‌యూ చాన్సలర్, నీతీ ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఆ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండూ కావాలి: సోము వీర్రాజు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం మంచిదేనని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన జగన్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలుగు ఎంత ముఖ్యమో ఇంగ్లిష్ కూడా అంతేనని, పోటీ పరీక్షలకు ఆంగ్లం ఉపయోగపడుతుందన్నారు. సీఎంతో భేటీ వెనుక రహస్యం ఏదీ లేదని, సీఎంఆర్‌ఎఫ్ నుంచి బాధితుల కోసం రూ.20లక్షలు అడిగేందుకు వచ్చినట్లు తెలిపారు.

జగన్ క్షమాపణ చెప్పు!

- వెంకయ్యపై ఏకవచన సంబోధనా?
- ఆయన పదవికైనా గౌరవమివ్వరా?
- ప్రాచీన కేంద్రం నెల్లూరుకు తెచ్చిన విషయం మరిచిపోయి విమర్శలా?
- ఓ మతం రుద్దడానికే 'ఆంగ్లం': కన్నా

అమరావతి, గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలపై ఒక మతాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నాల్లో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యలో ఆంగ్ల బోధన తప్పనిసరి చేస్తున్నదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఆంగ్ల మాధ్యమం విషయంలో సీఎం జగన్.. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. దీనిపై గుంటూరులోని తన నివాసంలో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. "ఉప రాష్ట్రపతి పదవి దేశంలోనే రెండో అత్యున్నత పదవి. అటువంటి పదవిలో ఉన్న వెంకయ్యనాయుడు లాంటి వ్యక్తిని ఏకవచనంతో సంబోధించటమే కాకుండా కనీస గౌరవం కూడా ఇవ్వనందుకు సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు. తెలుగు భాషా అధ్యయన, ప్రాచీన భాషా కేంద్రాన్ని మైసూర్ నుంచి నెల్లూరుకు తరలించేందుకు వెంకయ్యనాయుడు కృషి చేశారని, తెలుగు రాష్ట్రాలకు, తెలుగు జాతికి ఆయన చేసిన మేలు అందరికీ తెలుసన్నారు. అది మరిచిపోయి వెంకయ్యపై విమర్శలు చేయడం తగదని కన్నా అన్నారు. "ఆంగ్ల బోధనకు బీజేపీ వ్యతిరేకం కాదు. కానీ ఆప్షన్ ఎంచుకునే అవకాశం విద్యార్థికి ఉండాలి. బలవంతపు ఆంగ్ల బోధన కారణంగా వచ్చే వైపరీత్యాలను కూడా గుర్తించాలి. మాతృభాష చనిపోయినప్పుడు ఆ జాతి చనిపోయినట్లుగానే భావించాలి. ముఖ్యమంత్రి తన నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమబాట పడతాం. ప్రపంచంలో నోబెల్ బహుమతి పొందినవారిలో 98శాతం మంది ప్రాథమిక విద్యను వారి మాతృభాషలోనే పూర్తి చేశారు" అని వివరించారు. 2008లో నాటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి కృషి కారణంగానే తెలుగుభాషకు ప్రాచీన హోదా దక్కిందన్నారు. కాగా, ఉపరాష్ట్రపతి వెంకయ్యపై సీఎం వ్యాఖ్యలను రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు రమేశ్ నాయుడు గర్హించారు. 'ఆయన మనవళ్లు తెలుగు చదువుతారు. మీకు తెలుగు చదవడం రాదనే విషయం ఏపీ అవతరణ దినోత్సవం రోజే వెల్లడైంది' అని ఎద్దేవా చేశారు. బైబిల్‌ను తెలుగులో కూడా చదువుకోవచ్చునని, తాతలకాలంలోనే ఆ గ్రంథాన్ని తర్జుమా చేశారంటూ జగన్‌కు హితవు పలికారు.

వెంకయ్య మనవళ్లది ఏ మీడియం?

(మొదటి పేజీ తరువాయి)

ఈనాడు దినపత్రిక, ఆంధ్రజ్యోతి దినపత్రికలో రోజూ హెడ్‌లైన్స్ ఇదే చంద్రబాబును నేను అడుగుతున్నాను. మీ కొడుకు చదివింది ఏ మీడియం? మీ మనవడు చదవబోతున్నది ఏ మీడియం? ఇదే మాటలు మాట్లాడుతున్న వెంకయ్య నాయుడును అడుగుతున్నాను. అయ్యా వెంకయ్య గారూ, మీ కొడుకు చదివింది ఏ మీడియం? మీ మనవళ్లు చదువుతున్నది ఏ మీడియం?" అని నిలదీశారు. ఇక జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. "సినిమా యాక్టర్ పవన్ కల్యాణ్‌ను అడుగుతున్నాను! అయ్యా పవన్‌కల్యాణ్ గారూ, మీకు ముగ్గురు భార్యలు! బహుశా నలుగురో ఐదుగురో పిల్లలు. వాళ్లందరినీ ఏ మీడియంలో చదివిస్తున్నారు?" అని ప్రశ్నించారు.

జాతి నష్టపోతుంది...

మన పిల్లలు ఇంగ్లీషు మీడియంలో చదవకపోతే మన రాష్ట్రం, మన జాతి నష్టపోతుందని సీఎం జగన్ పేర్కొన్నారు. "అందుకే పిల్లలను ఇంగ్లీషు మీడియం చదివించాలనేది నా తపన. ఏ ఉద్యోగం రావాలన్నా... ప్రపంచంతో పోటీ పడాలి. మన వాళ్లు ఆ పోటీలో తట్టుకోవాలంటే ఇంగ్లీషు మీడియంలో చదవాలి. ముఖ్యంగా పేదరికంలో ఉన్న పిల్లలు చదవాలి. పేదరికం పోవాలంటే మన కుటుంబాల నుంచి డాక్టర్లు రావాలి, కలెక్టర్లుగా ఎదగాలి" అన్నారు. ఇంగ్లీషు చదవగలిగితే మన పిల్లలకు మంచి చేయడం కాదా అని ప్రశ్నించారు. తమ నిర్ణయాన్ని విమర్శించే వారు గుండెమీద చేయి వేసుకుని చెప్పాలన్నారు.

1 నుంచి 6 వరకు ఒకేసారి...

వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెడుతున్నామని... తెలుగు, ఉర్దూ భాషలు సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తామని జగన్ తెలిపారు. మొదట ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు ఇంగ్లీషు మీడియం ప్రారంభిస్తామన్నారు. తర్వాత... ఏటా 7, 8, 9, 10 తరగతులకు ఆంగ్ల మాధ్యమాన్ని పొడిగిస్తూ వస్తామని ప్రకటించారు. వెరసి... నాలుగేళ్లలో అన్ని స్కూళ్లు ఇంగ్లీషు మీడియంలోకి మారతాయని ప్రకటించారు. స్కూళ్లలో ఇంగ్లీషు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని, ప్రతి విద్యార్థి సీబీఎస్ఎఈ, ఐసీఎస్‌ఈ బోర్డు పరీక్షలు రాసే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. "చదువుకోసం ఎవరూ అప్పుల పాలు కాకుండా ఉండాలి. ఆ దిశగా అడుగులు వేస్తూ డిసెంబరు నెలాఖరులో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఈనెల 14న నాడు-నేడు చేపడతాం. ప్రతి స్కూల్‌లో బాత్‌రూం, నీళ్లు, బ్లాక్‌బోర్డు, ఫర్నీచర్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఉండాలి" అని జగన్ చెప్పారు.



మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సభలో చెక్కులు పంపిణీ చేస్తున్న సీఎం జగన్

ప్రతిభా అవార్డులకూ వైసీపీ రంగు!

- విస్తుపోయిన విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పార్టీ రంగు పైత్యం ప్రతిభా అవార్డులకూ పాకింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాలే కాకుండా, ఓవర్ హెడ్ ట్యాంకుల వంటి పలు నిర్మాణాలకు వైసీపీ రంగు వేస్తుండడంపై ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం 10 నుంచి పీజీ వరకు విద్యార్థులకు ఇచ్చే ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా అవార్డులకూ వైసీపీ రంగు పులమడం గమనార్హం. ఈ అవార్డులను సోమవారం విజయవాడలో సాక్షాత్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేయగా, విద్యార్థులకు ఇచ్చిన మెడల్స్ ట్యాగులను వైసీపీ రంగుల(నీలం, తెలుపు, ఆకుపచ్చ)తో ముద్రించడంపై విమర్శలు వచ్చాయి. అనంతపురం, కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 679 మందికి అందించిన అవార్డులదీ ఇదే తీరు. మెడల్ ట్యాగ్ వైసీపీ రంగులో ఉన్నది కావంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు అవాక్కయ్యారు. దీనిపై తీవ్ర విమర్శలు వినిపించాయి. కర్నూలులో కొందరికి మెడల్స్‌కు బదులు కేవలం ప్రశంసా పత్రాలతోనే సరిపెట్టారని విద్యార్థులు, తల్లిదండ్రులు నిరుత్సాహానికి గురయ్యారు. ఇక, ఈ ఏడాది ఈ అవార్డులను ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడంపైనా విమర్శలు వస్తున్నాయి. కాగా, ఇటీవల ఈ అవార్డులను వైఎస్సార్ ప్రతిభ అవార్డుగా పేరు మార్చి ఇవ్వాలని ప్రయత్నించగా, అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిన విషయమూ తెలిసిందే!

వైసీపీ కలర్‌లో ఉన్న మెడల్స్‌తో ప్రతిభ అవార్డులు పొందిన విద్యార్థులు

నాడు మీదే 'మీడియం'?

- అప్పట్లో చంద్రబాబు నిర్ణయంపై జగన్ మీడియాలో తీవ్ర విమర్శలు
- పాక్షికంగా ప్రవేశపెట్టినా ధ్వజం
- ఇప్పుడు 'ఆంగ్లాంధ్రప్రదేశ్' చేస్తున్న సీఎం
- నిపుణుల అభిప్రాయాలు చెప్పిన పత్రికలపైనా సీఎం అక్కసు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మీ మనవళ్లది ఏ మీడియం' అని ఏకంగా ఉప రాష్ట్రపతినే ప్రశ్నించారు! విపక్ష నేత చంద్రబాబునూ అలాగే నిలదీశారు. ఇక.. పవన్ కల్యాణ్‌పైనా వ్యక్తిగత విమర్శలు గుప్పించారు. 'ఆంధ్రజ్యోతి, ఈనాడు' అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. ఇంగ్లీషు మీడియం లేకుంటే రాష్ట్రం, జాతి నష్టపోతాయని తేల్చేశారు. మరి.. ఇదే జగన్ విపక్షంలో ఉన్నప్పుడు ఇంగ్లీషు మీడియంపై ఏమన్నారు? తన పిల్లలను ఆయన ఏ మీడియంలో చదివించారు?.... ఇవి ప్రతిపక్ష నేతలు, భాషాభిమానులు సంధిస్తున్న ప్రశ్నలు! అప్పట్లో కేవలం మునిసిపల్ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడాన్నే జగన్ మీడియా తీవ్రంగా విమర్శించిందని.. ఇప్పుడు జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మొత్తం పాఠశాలలను ఆంగ్లమయం చేస్తున్నారని భాషాభిమానులు చెబుతున్నారు. చంద్రబాబు హయాంలో మునిసిపల్ స్కూళ్లలో మాత్రమే ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు... ఇప్పటికిప్పుడు ఇంగ్లీషు మీడియమా? మాతృభాషకు మంగళం, ఆంగ్లంలో బోధించే వారేరీ అంటూ జగన్ మీడియా రకరకాల వార్తా కథనాలను ప్రచురించింది. ప్రభుత్వ పాఠశాలలపై చంద్రబాబు సర్కారు చిన్నచూపు చూస్తోందంటూ విమర్శలు గుప్పించింది. నిపుణులు సరికాదంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది. తెలుగుభాష పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందని ఆందోళన వ్యక్తంచేసింది. అప్పటి వరకు తెలుగు మాధ్యమంలో బోధన సాగించిన ఉపాధ్యాయులు.. ఇప్పుడు ఆంగ్ల మాధ్యమంలో ఎలా బోధించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారని.. పుస్తకాల్లేకుండా ఇంగ్లీషు మీడియంలో ఎలా బోధించాలని ప్రశ్నిస్తున్నారని ఆయన మీడియా రాసింది. ఆంగ్ల మాధ్యమం అర్థం కాక విద్యార్థులు బడి మానేస్తే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాలు భయపడుతున్నాయని తెలిపింది.

నిజానికి... అప్పటి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మాత్రమే ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టాలని భావించారు. దీనిపైనా భాషాప్రేమికులు, ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో... ఆయా పాఠశాలల్లో తెలుగు మీడియంను కొనసాగిస్తూ, సమాంతరంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పుడు జగన్ ప్రభుత్వం చేస్తున్నది వేరు. ఒకేసారి 1వ తరగతి నుంచి 6వరకు అన్ని పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం చేసేస్తామన్నారు. తెలుగు ఒక సబ్జెక్టుగా మాత్రమే ఉంటుందన్నారు. 7 నుంచి 10వ తరగతి వరకు ప్రతి ఏటా ఇంగ్లీషు మీడియం పెంచుతూ... నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ మొత్తం ఆంగ్ల మీడియం ఉంటుందన్నారు. దీనిపై భాషాభిమానులు, విద్యావేత్తల అభిప్రాయాలను మీడియా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తోంది. దీనిపైనా ముఖ్యమంత్రి ఎదురుదాడికి దిగడం సరికాదని భాషాభిమానులు పేర్కొంటున్నారు.

ఇంగ్లీష్ మీడియంకు వ్యతిరేకంగా జగన్ పత్రికలో వచ్చిన కథనం

అన్నవరం కొండపై అన్యమత భజనలు

- అడ్డుకున్న సూపరింటెండెంట్‌పై తిరగబడే ప్రయత్నం

అన్నవరం, నవంబరు 11: అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఒక భజన బృందం అన్యమత కీర్తనలు ఆలపించడం ఉద్రిక్తతకు దారి తీసింది. తూర్పుగోదావరి జిల్లా ఇరుపాక గ్రామానికి చెందిన అనిమిరెడ్డి నగేశ్ నటరాజ బాల భక్త సంఘం సభ్యులతో కళామందిరంలో భక్తిగీతాలు, భజనలను దేవస్థానం అధికారులు ఏర్పాటుచేశారు. సోమవారం సదరు భజన మండలి అన్యమతపరమైన వ్యాఖ్యలు చేస్తూ, ఏసుక్రీస్తును కీర్తిస్తూ భజన చేయడంతో మైకులో విన్న విజయవాడకు చెందిన భక్తులు ఎన్.సుధాకర్, పి.వెంకటేశ్వరరావు, ఉమాదేవి తదితరులు దేవస్థానం రిసెప్షన్ విభాగంలో ఫిర్యాదు చేశారు. దీంతో చైర్మన్ ఐవీ రోహిత్, సిబ్బంది హుటాహుటిన కళావేదిక వద్దకు వచ్చి భజనను నిలిపివేయించారు. ఈ సందర్భంగా దేవస్థానం సూపరింటెండెంట్ కొండలరావుపై భజన బృందం సభ్యుడొకరు ఎదురు తిరగడం ఉద్రిక్తతతకు దారితీసింది. దీంతో అన్యమత గీతాలు ఆలపించడంపై బృంద సభ్యులపై సిబ్బంది పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వారిని పోలీసులకు అప్పగించారు.

అమరావతి స్టార్టప్‌కు స్వస్తి

- సింగపూర్ కన్సార్షియంతో ఒప్పందం రద్దు చేస్తూ జీవో జారీ

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అమరావతి సత్వరాభివృద్ధికి చుక్కానిగా నిలుస్తుంఉంటుందని ఆశించిన స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రద్దు చేసింది. స్టార్టప్ ఏరియా రూపుదాల్చటం అనుమానమేనని, అది రద్దయ్యేందుకే అవకాశాలు పుష్కలమని 'ఆంధ్రజ్యోతి' ముందునుంచే చెబుతున్న సంగతి విదితమే. గత ప్రభుత్వం ఏర్పాటు చేయదలిచిన ప్రపంచ స్థాయి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు అభివృద్ధి కోసం ఏడీసీఎల్ - సింగపూర్ కన్సార్షియంలు సంయుక్త భాగస్వాములుగా ఏర్పాటు చేసిన జేవీవీ.. ఏడీపీ (అమరావతి డవలప్‌మెంట్ పార్టనర్)ను కూడా రద్దు చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్టార్టప్ ఏరియా అభివృద్ధి కోసం ఒప్పందం కుదుర్చుకుని 17 నెలలు దాటినప్పటికి ప్రాజెక్టు పనుల్లో ఏ మాత్రం పురోగతి లేదని, ఫలితంగా దాని వల్ల అమరావతికి లభిస్తుందని ఆశించిన ప్రయోజనం నెరవేరలేదని ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ ఇచ్చిన నివేదికను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

మమ్మల్ని తొలగించొద్దు సారూ!

- వీవోఏల విజ్ఞప్తి.. నెల్లూరులో మంత్రి అనిల్ ఇంటి ముందు ధర్నా
- ఏఐటీయూసీ సంఘీభావం.. ఎవరినీ తొలగించం: మోపిదేవి

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను విధుల నుంచి తొలగించవద్దంటూ రాష్ట్ర వ్యాప్తంగా పలుప్రాంతాల్లో విలేజ్ ఆర్గనైజేషన్(వీవోఏ) ఉద్యోగులు సోమవారం నిరసన చేపట్టారు. నెల్లూరులో మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఇంటి ముందు వీవోఏలు ధర్నా నిర్వహించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 50 వేలకుపైగా ఉన్న వీవోఏలను తొలగించే జీవోను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వందల మంది వీవోఏలు సోమవారం కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వారిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ దగ్గరకు తీసుకెళ్లారు. మంత్రి మోపిదేవి మాట్లాడుతూ, వీవోఏలు ఎవరినీ తొలగించకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కాగా.. 27 వేల మంది వీవోఏలను చాలా తెలివిగా తొలగించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని, దీనిపై వెనక్కి తగ్గకపోతే ఉద్యమం తప్పదని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హెచ్చరించారు. పాదయాత్ర సమయంలో వీవోఏల జీతాలు పెంచుతామని చెప్పిన జగన్ ప్రభుత్వంలోకి వచ్చాక వారిని రోడ్డున పడేశారని విమర్శించారు.

నెల్లూరులో మంత్రి అనిల్ ఇంటి ముందు వీవోఏల ధర్నా

భాషను చిన్నబరుస్తారా?

- గతంలో మీ పత్రిక ఏం చేసింది?
- తెలుగు కోసం గుండెలు బాదుకోలేదా?
- అప్పటికీ, ఇప్పటికీ మీలో ఇన్ని కపటాలా?
- ఇంగ్లిష్ నేర్పాలి.. తెలుగును అగౌరవపరచొద్దు
- ట్విట్టర్ వేదికగా ప్రభుత్వంపై పవన్ ఫైర్
- గతంలో జగన్ పత్రిక కథనాల పోస్టింగ్

అమరావతి/గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): "మన భాషని, మన సంస్కృతిని మనం చిన్నబరుచుకుంటే ఎలా? ఇంగ్లిష్ నేర్పాలి, కానీ తెలుగుని అగౌరవపరిచే పద్ధతి మానుకోవాలి" అని ప్రభుత్వానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచించారు. తెలుగు మాధ్యమంపై రెండు రోజులుగా ట్విట్టర్ వేదికగా ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న విషయం తెలిసిందే. మాతృభాషను రక్షించుకోవడం, ప్రచారం కల్పించుకోవడంలో కన్నడిగులు, మరాఠీలు, తమిళులు, హిందీ వాళ్లను చూసి నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా గతంలో 'మాతృభాషకు మంగళం' అనే శీర్షికతో జగన్ పత్రిక ప్రచురించిన కథనాలను ట్విట్టర్‌లో పోస్టు చేశారు. వైసీపీ నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగు మీడియం కావాలంటూ డిమాండ్ చేశారని పవన్ గుర్తుచేశారు. దీంతో పాటు 'ఇప్పటికిప్పుడు ఇంగ్లిష్ మీడియమా?' అన్న శీర్షికతో జగన్ పత్రిక ప్రచురించిన మరో కథనాన్ని కూడా పవన్ పోస్టు చేశారు. ఈ కథనంలో అప్పటికీ, ఇప్పటికీ వైసీపీ కపటనాటకాలు బయట పడుతున్నాయన్నారు. 'దేశ భాషలందు తెలుగు లెస్స. మాతృభాష మన ప్రాచీన సంపద. కాపాడుకుందాం. పెంపొందిద్దాం. తెలుగు భాష దినోత్సవ శుభాకాంక్షలు' అని 2016 ఆగస్టులో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో ట్విట్టర్‌లో జగన్ చేసిన పోస్టును పవన్ రీపోస్టు చేశారు. ఈ పోస్టుకు విరుద్ధంగా ఇప్పుడు జగన్ ఏం మాట్లాడుతున్నారని నిలదీశారు. 'ఇంగ్లిష్ మీడియంపై పునరాలోచించాలి' అని అప్పట్లో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రకటనను కూడా పవన్ పోస్టు చేశారు. తెలుగు భాష గురించి మాట్లాడే నాయకులు, స్కాలర్లు ఇలాంటి విషయాలపై మాట్లాడే సమయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించారు. తెలుగు భాష అభ్యున్నతికి ఇంగ్లిష్ వాడైన బ్రౌన్ ఎంతగానో కృషి చేశారని, మన తెలుగు నాయకులు మాత్రం మాతృభాష అంతరించిపోయే విధంగా చేస్తున్నారని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, జనసేన పార్టీకి ప్రధాన కార్యదర్శిగా తమ్మిరెడ్డి శివశంకర్‌ను నియమించారు.

సమాంతరంగా తెలుగు: ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఆంగ్ల భాషలో బోధనను ప్రవేశ పెట్టడాన్ని ఆహ్వానిస్తున్నామని, అయితే, సమాంతరంగా తెలుగు మీడియం పాఠశాలలను కొనసాగించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వానికి సూచించారు. విజయవాడలో జరిగిన ఎస్‌టీయూ సెక్రెటేరియట్ సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేవలం ఇంగ్లీషు మీడియం పాఠశాలలే కొనసాగిస్తే భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయన్నారు.

మీకు, మెకాలేకి తేడా ఏంటి?

- సీఎంపై బీజేపీ నేత సత్యకుమార్ ధ్వజం

న్యూఢిల్లీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌ను జెరూసలేంకు తాకట్టు పెట్టడమే మీ అంతిమ లక్ష్యమా? పేదల పేరు చెప్పి, దొంగ ఏడుపులెందుకు జగన్‌గారు?' అని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ ట్విట్టర్‌లో సీఎం జగన్‌పై ధ్వజమెత్తారు. జగన్ తెలుగుభాషను కించపరుస్తున్నాని అన్నారు. బ్రిటిష్ హయాంలో మెకాలే ఆంగ్ల విద్యా విధానం ద్వారా మన సంస్కృతిని, వైశిష్ట్యాన్ని చంపేసి, మతవ్యాప్తికి శ్రీకారం చుట్టారని, ఇప్పుడు మీకు, మెకాలేకు మధ్య తేడా ఏమిటని ప్రశ్నించారు. 'మీ సొంత జిల్లా కడపలో 1500 మంది చదివే ప్రభుత్వ జూనియర్ మహిళా కాళాశాలలో కేవలం 4 మరుగుదొడ్లే ఉన్నాయన్న విషయం మీకు తెలుసా?' అని సీఎం జగన్‌ను నిలదీశారు. మాతృభాషలో చదువుకున్న మహాత్మాగాంధీ జాతిపిత కాలేదా? అని ప్రశ్నించారు. మీతండ్రి వైఎస్సార్ డాక్టర్, ముఖ్యమంత్రి కాలేదా? అని ప్రశ్నించారు.

అప్పుడు మీ అమ్మాయిలు ఏ మీడియం?

- నాటి నినాదాలు ఏమయ్యాయి?
- సీఎం జగన్‌కు లోకేశ్ ప్రశ్నలు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఇంగ్లీషు మీడియం వద్దు.. తెలుగే ముద్దు' అని విపక్షంలో ఉండగా జగన్ ఉద్యమం చేసినప్పుడు ఆయన అమ్మాయిలు తెలుగు మీడియంలోనే చదివారా? అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశ్నించారు. 'అయ్యా గజిని జగన్! మీ పవిత్ర పత్రిక, మీరు, గతంలో తెలుగు పరిరక్షణ కోసం యుద్ధం చేశారు గుర్తులేదా? నగరపాలక పాఠశాలల్లో అప్పటి మా ప్రభుత్వం ఆంగ్

కదిలించిన కథనాలు

ట్విటర్‌లో మాజీ సీఎం చంద్రబాబు పోస్ట్ చేసిన 'ఆంధ్రజ్యోతి' క్లిప్పింగ్

వైసీపీ పాలకులు సిగ్గుపడాలి!

- 'ఆంధ్రజ్యోతి' మెతుకులాట ఫొటోపై చంద్రబాబు స్పందన

విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'మెతుకులాట' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' విజయవాడ ఎడిషన్‌లో సోమవారం ప్రచురితమైన ఫొటో ఫీచర్‌పై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'మెతుకులాట' క్లిప్పింగ్‌ను ట్విట్టర్‌లో ట్యాగ్ చేసిన ఆయన.. ఈ దుస్థితికి కారణం వైసీపీ పాలకులే అంటూ విమర్శించారు. 'కష్టపడి సంపాదించుకునే దారుల్ని ప్రభుత్వం మూసేస్తే.. పనిలేక ఆకలి చల్లార్చుకోవడానికి మెతుకు కోసం చెత్తకుప్పల్లో వెతుకుతున్న కూలీని తలచుకుంటే కళ్లు చెమర్చుతున్నాయి. ప్రజలకు ఇలాంటి దయనీయ పరిస్థితులు తెచ్చినందుకు వైసీపీ పాలకులు సిగ్గుపడాలి. ఐదు నెలల్లో ఇదేనా మీరు సాధించిన ఘనకార్యం? కనీసం అన్న క్యాంటీన్లు ఉన్నా కూలీలను ఆదుకునేవి. సాకులు చెప్పకుండా వెంటనే అన్న క్యాంటీన్లను తెరిచి పేదలను ఆదుకోండి' అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

తల్లిదండ్రులతో శశిధర్ (ఫైల్)

చిన్నారి ప్రాణానికి సీఎం భరోసా!

- శశిధర్ పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పాయకాపురం, నవంబరు 11: డెంగీ కోరల్లో చిక్కి మృత్యువుతో పోరాడుతున్న బాలుడికి ఉంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. విజయవాడ కస్తూరిబాయి పేటకు చెందిన ఎల్‌కేజీ విద్యార్థి ఎం.శశిధర్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో సోమవారం ప్రచురితమైన 'చిన్నారి ప్రాణానికి చిట్టి చేతుల భరోసా' కథనానికి సీఎం స్పందించారు. సీఎంవో అధికారులతో శశిధర్ కుటుంబసభ్యులకు సోమవారం ఉదయం ఫోన్ చేయించి బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించాలని ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సీఎంతోపాటు, తమ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విజయవాడ ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు

ఉపాధి నిధుల సాధనే లక్ష్యం

- పులివెందులకు మాత్రమే ఇస్తారా: మాజీ ప్రజాప్రతినిధులు

విజయవాడ సిటీ, నవంబరు 11: ఉపాధిహామీ నిధుల సాధనే లక్ష్యంగా పోరాటం చేస్తామని పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీల ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ నిధులు విడుదల చేయకుండా రాష్ట్రప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. పులివెందుల నియోజకవర్గానికి మాత్రమే ఉపాధిహామీ నిధులు విడుదల చేసి, మిగతా నియోజకవర్గాలకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో 25 వేల మంది మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలలో 15 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, షైనార్టీ వర్గాలకు చెందిన పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజాప్రతినిధులు అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

సిబ్బందికి ఇబ్బంది కలిగించే నిర్ణయాలు వెనక్కి

- ఆర్టీసీ ఎండీకి కార్మిక సంఘాల కృతజ్ఞతలు

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్‌ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేస్తోంది. అయితే ఇటీవల జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో 'రివైజ్డ్ నామ్స్' పేరుతో కొన్నింటిని రద్దు చేశారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్న సర్క్యులర్‌ను రద్దు చేయడం, పీఆర్ కోటాలో జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాలంటే డిగ్రీ తప్పనిసరి చేయడం, కారుణ్య నియామకాలను ఐదేళ్ల నుంచి ఏడాదికి కుదించడం తదితర కార్మికులకు నష్టం చేసే నిర్ణయాలను బోర్డు తీసుకుంది. దీంతో గుర్తింపు కార్మిక సంఘం ఎంప్లాయీస్ యూనియన్ ఈ నెల 12, 13న తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా బస్ డిపోల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం బోర్డు నిర్ణయాలపై వెనక్కి తగ్గింది. కార్మికులకు నష్టం కలిగేలా బోర్డు తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవడంపై ఎండీ కృష్ణబాబుకు ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు, అధ్యక్షుడు వైవీ రావు, ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు పీవీ రమణారెడ్డి, వై. శ్రీనివాసరావు, వైఎస్ఆర్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకులు చల్లా చంద్రయ్య, రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆంధ్రను అమ్మకానికి పెట్టారు

- మిషన్ బిల్డ్ మరో క్విడ్ ప్రోకో: టీడీపీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "మిషన్ బిల్డ్ పేరుతో ఆంధ్రని అమ్మకానికి పెట్టారు. మిషన్ బిల్డ్ కాదు మరో క్విడ్ ప్రోకోకు ప్రభుత్వం పాల్పడుతోంది" అని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ ఆరోపించారు. గుంటూరులో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. సంపద సృష్టించడం చేతకాకపోతే చంద్రబాబు దగ్గర క్లాసు తీసుకోవాలని ఎద్దేవా చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకటారావు శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ రివర్స్ విధానాలతో పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. అనుభవరాహిత్యం, తొందరపాటు నిర్ణయాలతో పాలన కుంటుపడిందన్నారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు సోంపేట మండలం అనంతపురంలో మాట్లాడుతూ.. 5నెలల వైసీపీ పాలనలో సీఎం జగన్ రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని విమర్శించారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మంగళగిరిలో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అధోగతి పాలైస్తున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇసుక కొరతతో 40 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలో విమర్శించారు.

హోదాపై మాట తప్పారు: తులసిరెడ్డి

కమలాపురం, నవంబరు 11: "మాట తప్పం.. మడమ తిప్పం అని చెప్పిన జగన్ ప్రత్యేక హోదాపై మాట తప్పి వెనుకడుగు వేశారు" అని పీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి అన్నారు. సోమవారం కడప జిల్లా కమలాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక హోదాపై జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రైతులకు పెట్టుబడి సాయం విషయంలోనూ మాట తప్పారనీ, అగ్రవర్ణ కౌలు రైతులకు మెండిచేయి చూపారని, 11 లక్షల మంది కౌలు రైతులు ఉంటే 51 వేల మందికి మాత్రమే రైతు భరోసా ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఈడబ్ల్యుఎస్ కోటా అమలు చేయకపోవడంతో గ్రామసచివాలయ ఉద్యోగాల్లో 12,859 మంది అవకాశం కోల్పోయారన్నారు. వెలుగు, మెప్మాలో పని చేస్తున్న చిన్న ఉద్యోగులను తొలగించాలనుకోవడం అమానుషమన్నారు. అమ్మఒడి తప్ప మిగిలిన 8 నవరత్నాలు గత ప్రభుత్వాలు చేసినవేనని చెప్పారు.

'మావోయిస్టుల'పై పిల్ ఉపసంహరణ

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు అరుణ, భవాని, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ నారాయణరావులను కోర్టులో హాజరు పరిచేలా పోలీసుల్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను పిటిషనర్ ఉపసంహరించుకున్నారు. ఇటీవల విశాఖ మన్యంలో ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యంలో ఆ ముగ్గురినీ హాజరు పరచాలని న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించి.. న్యాయవాది పిటిషన్ వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో పిటిషన్ ఉపసంహరణకు న్యాయవాది శ్రీమన్నారామణ అనుమతి కోరడంతో ధర్మాసనం అంగీకరించింది.

అనవసర పిల్స్‌తో సమయం వృథా

- పిటిషనర్‌కు హైకోర్టు రూ.25వేల జరిమానా

అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సంబంధం లేని వ్యవహారంలో అనవసరంగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసి సమయం వృథా చేశారంటూ ఓ పిటిషనర్‌కు హైకోర్టు రూ.25వేల జరిమానా విధించింది. నెలరోజుల్లో ఆ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యాపార కూడళ్లు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, విద్యాలయాలు తదితర జనసమూహమున్న ప్రాంతాల్లో పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడాన్ని, 2013లో తీసుకొచ్చిన ప్రజాభద్రత చట్టాన్ని సవాల్ చేస్తూ ఓ న్యాయవాది వేసిన పిల్‌ను సోమవారం ధర్మాసనం విచారించింది. 'న్యాయవాదికి దీంతో ఏం సంబంధం? ఆ చట్టం అమలుతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు కోర్టుకు వచ్చే అవకాశముండగా, ఎలాంటి సంబంధమూ లేని వ్యక్తి ఎందుకు పిల్ దాఖలు చేయాల్సివచ్చింది? ప్రజల భద్రత కోసం తీసుకొచ్చిన ఈ చట్టం నిబంధనల్లో తప్పేముంది' అని ప్రశ్నించింది. పిల్ ఉపసంహరించుకునేందుకు అవకాశమిచ్చినా పిటిషనర్ తరఫు న్యాయవాది తిరస్కరించడంతో పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం.. పిటిషనర్‌కు జరిమానా విధించింది.

వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఔట్

- 3 నెలలు సెలవుపై పంపిన అధికారులు
- కొత్త కమిషనర్‌గా కర్నూలు డీసీహెచ్ఎస్
- ఇప్పటికే హెల్త్ వర్సిటీ వీసీ రాజీనామా
- ఆరోగ్య శాఖ డైరెక్టర్‌నూ సాగనంపే చాన్స్

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో ప్రభుత్వ హయాంలో విభాగాధిపతులుగా ఉన్నవారందరినీ ఉన్నతాధికారులు వరుసగా సాగనంపుతున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీవీ రావుతో రాజీనామా చేయించారు. ఆయన పదవీ కాలం మరో ఏడాది ఉన్నప్పటికీ.. సీఎంవో అధికారులు ఆ శాఖ ఉన్నతాధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయించారని ఆరోపణలున్నాయి. ఆయన రాజీనామాను గవర్నర్ ఆమోదించడంతో వీసీ బాధ్యతలను ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కి అప్పగించింది. ఇప్పుడు రాష్ట్ర వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) కమిషనర్ దుర్గాప్రసాద్ వంతు. 2016 నుంచి విధులు నిర్వహిస్తున్న ఆయన్ను కూడా ప్రభుత్వం బయటకు పంపించింది. ప్రస్తుతం ఉన్న హెచ్‌వోడీల్లో చాలా సౌమ్యుడిగా పేరున్న ఆయనను సెలవుపై సాగనంపారు. బలవంతంగా 3 నెలలు సెలవు పెట్టేలా ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గత వారం సచివాలయానికి పిలిపించుకున్న అధికారులు ఆయన్ను తొలగిస్తున్నట్లు చెప్పారు. వెంటనే సెలవుపై వెళ్లాలని సూచించారు. సెలవుపై వెళ్లడముందుకు.. వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాలని ఆయన కోరారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే ఆమోదించడానికి చాలా సమయం పడుతుందని.. కాబట్టి సెలవుపై వెళ్లడం మంచిదని ఉన్నతాధికారులే సూచించినట్లు సమాచారం. ఆయన కూడా చేసేది లేక మూడు నెలల పాటు సెలవివ్వాలని గత శుక్రవారం సాయంత్రం ఆరోగ్యశాఖ డైరెక్టర్ కార్తికేయ మిశ్రాకు లేఖ రాశారు. లేఖ రాయడమే తడవుగా వెంటనే ఆమోదించిన ఉన్నతాధికారులు సోమవారం జీవో విడుదల చేశారు. ఆదే జీవోలో ఆయన స్థానంలో కర్నూలు జిల్లా డీసీహెచ్ఎస్‌గా ఉన్న డాక్టర్ రామకృష్ణారావును ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో హెచ్‌వోడీలుగా విధులు నిర్వహించిన వారందరిని తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆరోగ్య శాఖ డైరెక్టర్‌ను సాగనంపేందుకు కూడా రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. వీరందరినీ తొలగించి తమకు కావలసినవారిని నియమించేందుకు పైస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నట్లు తెలిసింది. వీరి తర్వాత ఆ తర్వాతి స్థాయి ఉద్యోగులనూ బదిలీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

30 లక్షల మంది అలమటిస్తున్నారు

- వారి కోసమే ఎల్లుండి ఇసుక దీక్ష
- బెజవాడ ధర్నాచౌక్‌కు తరలిరండి
- రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ
- బీజేపీ మద్దతిస్తుందన్న కన్నా
- ఇప్పటికే పవన్, వామపక్షాల సంఘీభావం

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక కొరతతో నలిగిపోతున్న అనేక వర్గాల వారి సమస్యలను ఎత్తిచూపి వారిని ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికే తాను 14వ తేదీన 12 గంటల పాటు ఇసుక దీక్ష చేపట్టనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక విధానం వల్ల ఇసుక కొరత లేకపోవడమే కాకుండా రేట్లు కూడా అందుబాటులో ఉండేవని, జగన్ ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చడంతో చరిత్రలో లేని విధంగా 30 లక్షల మంది కార్మికులు అలమటిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యతో నష్టపోతున్న 125 వృత్తులవారు.. వ్యాపార రంగాల ప్రతినిధులు ఈ దీక్ష లో భాగస్వాములు కావాలని పిలుపిస్తూ సోమవారం రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ విడుదల చేశారు. తెలంగాణలో ఆర్టీసీ సమస్యపై అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమాలు చేస్తున్నాయని.. దానిని స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడ కూడా అన్ని వర్గాల వారు ఈ సమస్యపై పోరాటంలో ఏకం కావాలని విజ్ఞప్తి చేశారు. 'ఇసుక కృత్రిమ కొరత వల్ల రేట్లు పెరిగి భవన నిర్మాణ రంగం కుదేలైంది. భార్యాబిడ్డలకు కడుపు నిండా తిండి పెట్టలేక కొందరు కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 125 వృత్తులు, వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. వీరందరికీ మనో ధైర్యం కల్పించాలి. ఉచిత ఇసుక విధానం తిరిగి ప్రవేశపెట్టాలి. పని చూపే వరకూ కార్మికులకు నెలకు రూ.10 వేలు భృతి ఇవ్వాలి. ప్రభుత్వం వల్ల ప్రాణాలు పోగొట్టుకున్న కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారమివ్వాలి. ఈ డిమాండ్ల సాధనకే విజయవాడ ధర్నాచౌక్‌లో దీక్ష చేపడుతున్నాను' అని తెలిపారు. 'టీడీపీ హయాంలో రూ.10 వేలకు లభించిన లారీ ఇసుక.. ఇప్పుడు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ బ్లాక్‌లో అమ్ముడవుతోంది. వరదల వల్లే ఇసుక కొరత అని ప్రభుత్వ పెద్దలు అబద్ధాలు చెబుతున్నారు. ఇంత కంటే ఎక్కువ వరదలు ఉన్న ఎగువ రాష్ట్రాల్లో కనిపించని కొరత ఇక్కడే ఎందుకు తలెత్తింది. ట్రాక్టరు ఇసుక దొరకడం సామాన్యులకు కష్టంగా ఉంటే వైసీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు యథేచ్ఛగా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి కోట్లు దండుకుంటున్నారు' అని మండిపడ్డారు. కాగా.. ఇసుక దీక్ష ఏర్పాట్లపై చంద్రబాబు బుధవారం గుంటూరులో పార్టీ నేతలతో చర్చించారు. 'కావాలి ఉచిత ఇసుక... పోవాలి ఇసుక మాఫియా' అన్న నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని నిశ్చయించారు.

పయ్యావులను పరామర్శిస్తున్న చంద్రబాబు. చిత్రంలో డాక్టర్ నాగేశ్వరరెడ్డి

కన్నాతో ఆలపాటి భేటీ

ఇప్పటికే చంద్రబాబు దీక్షకు జనసేన అధినేత పవన్ కల్యాణ్, వామపక్షాలు మద్దతు ప్రకటించగా.. తాజాగా బీజేపీ కూడా మద్దతిస్తామని తెలిపింది. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం గుంటూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణతో సమావేశమయ్యారు. చంద్రబాబు దీక్షకు మద్దతివ్వాలని కోరారు. ప్రజా సమస్యలపై ఎవరు పోరాటం చేసినా మద్దతు ఇస్తామని, పోరాటాలు మాత్రం ఒంటరిగానే చేస్తామని కన్నా తెలిపారు. ఇసుక లభ్యత పెరగడంతోనే సిమెంటు ధర పెరగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇసుకను కావాలనే ఆపారని, అదే విషయాన్ని తాను అందరి కన్నా ముందు నుంచే చెబుతున్నానని గుర్తుచేశారు.

పయ్యావులకు పరామర్శ

హైదరాబాద్, అమరావతి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్‌ను టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం పరామర్శించారు. గ్యాస్ట్రిక్ సమస్యతో అస్వస్థతకు గురైన పయ్యావుల హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఆయన కోలుకుంటున్నారని, రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాగేశ్వరరెడ్డి, చంద్రబాబుకు తెలిపారు.

ఉనికి కోసమే బాబు దీక్ష: బొత్స

అనంతపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలతో పాలన సాగించిన చంద్రబాబును ప్రజలు తిరస్కరించినా.. కేవలం రాజకీయ ఉనికి కోసమే ఆయన దీక్ష చేపడుతున్నారని పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఆయన పాలనలో ఉచిత ఇసుక పేరుతో ఆయన మంత్రివర్గంలోని అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు ఏ మేరకు దోపిడీ చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. సోమవారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర రాజధాని ఎక్కడుండాలన్న విషయంపై కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తోంది. దాని నిర్ణయం, ప్రజల ఆకాంక్ష మేరకు ఎక్కడుండాలో నిర్ణయిస్తాం' అని తెలిపారు.

..'ఇసుక' వల్లే చనిపోలేదు!

భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరతవల్ల పనిలేక చనిపోయారనడంలో వాస్తవం లేదని, వారు రకరకాల వ్యక్తిగత కారణాలతోనే మరణించి ఉంటారని, ప్రతిదీ చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. వయసుకు తగినట్లు వ్యవహరించాలని, నిజాలు పలకాలని, జీవితకాలం అబద్ధాలు చెప్పడం తగదని అన్నారు.

కాచిగూడలో రెండు రైళ్లు ఢీ!

- హంద్రీ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొన్న ఎంఎంటీఎస్
- ఎగిరి పడిన ఎంఎంటీఎస్ బోగీలు
- 17 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10.20 గంటలు! కాచిగూడ రైల్వే స్టేషన్! కర్నూలు నుంచి సికింద్రాబాద్ వెళ్లే హంద్రీ ఎక్స్‌ప్రెస్ లెవల్ క్రాసింగ్ వద్దకు వచ్చింది! రెండో నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్లే ట్రాక్‌లో సిగ్నల్ కోసం ఆగింది! ఐదు నిమిషాల తర్వాత.. నాలుగో నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్లాలంటూ సిగ్నల్ వచ్చింది! అదే సమయంలో, లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు వెళ్లే ఎంఎంటీఎస్ ఉదయం 10.30 గంటలకు రెండో నంబరు ప్లాట్‌ఫాంకు వచ్చింది! 10.35కి బయలుదేరింది! అటు రెండో నంబరు ట్రాక్ నుంచి నాలుగో నంబరు ట్రాక్‌లోకి 20 కి.మీ. వేగంతో హంద్రీ ఎక్స్‌ప్రెస్ వస్తోంది. రెండో నంబరు ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరిన ఎంఎంటీఎస్ 50-60 కిలోమీటర్ల వేగంతో వెళుతోంది. సరిగ్గా.. లెవల్ క్రాసింగ్ వద్ద రెండు రైళ్లూ ఒకదానికొకటి ఢీకొన్నాయి! ఢీకొట్టిన తర్వాత మూడు సెకన్లలోనే ఎంఎంటీఎస్‌కు చివర ఉన్న బోగీలు ఎగిరి పక్కకు పడ్డాయి. ఈ ప్రమాదంలో రెండు రైళ్లలో ప్రయాణిస్తున్న 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఎంఎంటీఎస్‌లో 360 మంది వరకూ ప్రయాణిస్తుండగా.. హంద్రీలో 1000 నుంచి 1300 మంది వరకు ఉన్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రమాదంలో ఎంఎంటీఎస్ బోగీలు నుజ్జునుజ్జయ్యాయి. మొత్తం 9 బోగీలతో రైలు బయలుదేరగా.. లోకో పైలెట్ శేఖర్ ఉన్న బోగీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. క్యాబిన్ భాగంలో లోకో పైలెట్ కూరుకుపోయాడు. కాగా, ఎంఎంటీఎస్ 2-3 బోగీలు పట్టాలపై నుంచి ఎగిరి పక్కకు పడ్డాయి. 4, 5 బోగీలు పట్టాలు తప్పాయి. 6, 7 బోగీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇక, డీజిల్ ఇంజిన్‌తో వస్తున్న హంద్రీ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ సహా 18 బోగీలూ పట్టాలు తప్పాయి. ఇందులో ఇంజిన్ ముందు భాగంలో కాకుండా వెనక భాగంలో డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్ ఉండి రైలును నడిపే పద్ధతి ఉండడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. ప్రమాదం జరిగిన వెంటనే బోగీల్లోని ప్రయాణికులు బయటకు దూకి పరుగులు తీశారు. కాగా, సాధారణంగా ఎంఎంటీఎస్ రైలు ప్లాట్‌ఫాంపై నుంచి బయలుదేరిన క్షణాల్లోనే 50 నుంచి 60 కిలోమీటర్ల స్పీడ్ అందుకుంటుంది. సోమవారం కూడా 50 కిలోమీటర్ల స్పీడ్‌తో వచ్చి ఢీకొనడంతో 5 నుంచి 7 ఇంచుల వరకు హంద్రీ ఎక్స్‌ప్రెస్‌లోకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది.

..ఏడున్నర గంటలు

రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో ఎంఎంటీఎస్ కేబిన్‌లో ఇరుక్కుపోయిన లోకో పైలెట్ శేఖర్‌ను బయటకు తీయడానికి ఏడున్నర గంటలు పట్టింది. కేబిన్ పూర్తిగా నుజ్జునుజ్జవడంతో దానిలో ఇరుక్కుపోయిన శేఖర్ కనీసం కాళ్లూ చేతులూ కదిపే పరిస్థితి లేదు. ఎలక్ట్రికల్ కట్టర్లు, రంపాలతో బోగీని కట్ చేసి ఏడున్నర గంటల రిస్క్ ఆపరేషన్ తర్వాత పైలెట్‌ను బయటకు తీశారు. అనంతరం నాంపల్లిలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. మృత్యుంజయుడుగా బయటపడిన శేఖర్ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరువాసి. ఎంఎంటీఎస్ భారీ ప్రమాదానికి గురి కావడం ఇదే తొలిసారి.

నీలం సాహ్నికి కేంద్రం పచ్చజెండా

- ఆంధ్రకు పంపేందుకు అంగీకారం
- రేపు రిలీవ్ కావాలని ఉత్తర్వులు

న్యూఢిల్లీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారిణి నీలం సాహ్నిని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఆమెను రిలీవ్ చేసి రాష్ట్రానికి తిరిగి పంపేందుకు సోమవారం కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సామాజిక న్యాయం, సాధికారిత శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమెను రాష్ట్రానికి పంపుతూ ప్రధాన మంత్రి పరిధిలోని కేంద్ర సిబ్బంది, శిక్షణ, ప్రజాఫిర్యాదులు, పింఛన్ల శాఖకు చెందిన కేబినెట్ పరిపాలన, నియామకాల కమిటీ కార్యదర్శి పీకే త్రిపాఠీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎల్వీ సుబ్రహ్మణ్యాన్ని ఇటీవల ప్రభుత్వం అర్ధాంతరంగా బదిలీ చేసి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఇన్‌చార్జి సీఎస్ బాధ్యతలు అప్పగించింది. కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1984 బ్యాచ్‌కు చెందిన నీలం సాహ్నిని ఎంపిక చేసి.. కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేసి వెనక్కి పంపాలని కేంద్రానికి లేఖరాసింది. కేంద్రం.. సాహ్నీ వ్యక్తిగతంగా పెట్టుకున్న దరఖాస్తును కూడా పరిశీలించి.. బుధవారం రిలీవ్ అయ్యేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

యాప్‌లో పాస్‌పోర్టు సేవలు

- ఎం-పాస్‌పోర్టు ద్వారా దరఖాస్తు
- నకిలీ వెబ్‌సైట్లతో జాగ్రత్త
- ఆంధ్రజ్యోతితో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి ఎన్ఎల్‌పీ చౌదరి

విశాఖపట్నం, నవంబరు 11(

షెఫాలీ వర్మ (69 నాటౌట్)

షెఫాలీ..మళ్లీ

బ్యాటింగ్‌లో అదరగొట్టిన టీనేజర్ ● తిప్పేసిన దీప్తి

10 వికెట్లతో భారత్ గెలుపు ● విండీస్‌తో రెండో టీ20

దీప్తి శర్మ (4/10)

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): టీనేజ్ ఓపెనర్ షెఫాలీ వర్మ (35 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 69 నాటౌట్) వరుసగా రెండో అర్ధ శతకంతో అదరగొట్టగా.. ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ (4/10) కెరీర్ బెస్ట్‌తో మెరవడంతో భారత్ 10 వికెట్ల తేడాతో ఆతిథ్య వెస్టిండీస్‌పై ఘన విజయం సాధించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన రెండో టీ20లో తొలుత విండీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 103/7 స్కోరు చేసింది. చెడియన్ నేషన్ (32) టాప్‌స్కోరర్. ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్ను విరిచిన దీప్తి (4-0-10-4) తన టీ20 కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసింది. స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్లు షెఫాలీ, స్మృతి మంధాన (28 బంతుల్లో 30 నాటౌట్) తొలి వికెట్‌కు అజేయంగా 104 రన్స్ జత చేయడంతో భారత్ 10.3 ఓవర్లలోనే గెలుపు అందుకుంది. షెఫాలీ దూకుడైన బ్యాటింగ్ భారత ఇన్నింగ్స్‌కు హైలైట్‌గా నిలిచింది. హెన్రీ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే షెఫాలీ బ్యాట్‌కు పని చెప్పింది. వరుసగా 4 ఫోర్లు బాది 18 పరుగులు రాబట్టింది. 5వ ఓవర్‌లో 6,4తో టీమ్ స్కోరును 50 పరుగులు దాటించింది. ఈ క్రమంలో సిక్సర్‌తో అర్ధ శతకాన్ని పూర్తి చేసుకుంది. ఆ తర్వాత కూడా షెఫాలీ ఎడాపెడా ఫోర్లు బాదడంతో లక్ష్యం వేగంగా కరిగింది. మంధాన ఫోర్‌తో జట్టును మరో 57 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించింది.

విండీస్ విలవిల..: టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన విండీస్ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. ఓపెనర్ స్టేసీ అన్ కింగ్ (7)ను శిఖా పాండే పెవిలియన్ చేర్చింది. ఆ వెంటనే క్యాంప్‌బెల్‌ను రాధా యాదవ్ డకౌట్ చేసింది. మరో ఓపెనర్ హేలీ మాథ్యూస్ (23), నేషన్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే, హేలీని అవుట్ చేసిన పూజా వస్త్రాకర్.. మూడో వికెట్‌కు 34 రన్స్ భాగస్వామ్యాన్ని విడదీసింది. తర్వాత క్రీజులోకి వచ్చిన నటాషా మెక్‌లీన్ (17).. నేషన్ కలసి నాలుగో వికెట్‌కు 32 రన్స్ జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న వీరిద్దరినీ దీప్తి ఒకే ఓవర్‌లో అవుట్ చేసి విండీస్ స్కోరుకు పగ్గాలేసింది. 17వ ఓవర్ తొలి బంతికి నేషన్‌ను స్టంపౌట్ చేసిన దీప్తి.. ఐదో బంతికి మెక్‌లీన్‌ను అవుట్ చేసింది. ఆఖరి ఓవర్‌లో హెన్రీ (8), షెనేటా గిమ్మోండ్ (0)ను కూడా దీప్తి పెవిలియన్ చేర్చింది.

తొమ్మిది నెలలు కాదు.. మూడేళ్లు!

బీసీసీఐ చీఫ్ గంగూలీ పదవీకాలం పొడిగింపు!

వచ్చే నెలలో బోర్డు రాజ్యాంగ సవరణ

ముంబై: బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే సౌరవ్ గంగూలీ తనదైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. అందులో ప్రధానమైనది భారత జట్టు తొలిసారి డే/నైట్ టెస్ట్ ఆడనుండడం. ఇప్పటి వరకూ పింక్ బాల్ క్రికెట్‌కు సుముఖత వ్యక్తం చేయని కెప్టెన్ విరాట్ కోహ్లీని సైతం సౌరవ్ ఒప్పించగలిగాడు. దాంతో ఈనెల 22న భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభ మయ్యే రెండో టెస్ట్ డే/నైట్‌లో జరగనుంది. అలాగే కోట్లాది రూపాయల వ్యయంతో నిర్వహించే ఐపీఎల్ ఆరంభ వేడుకలను రద్దు చేయడం గంగూలీ తీసుకున్న మరో ముఖ్య నిర్ణయం. అయితే నెలరోజులలోనే రెండు కీలక నిర్ణయాలు తీసుకున్న సౌరవ్.. మూడేళ్లపాటు అధ్యక్ష పదవిలో ఉంటే భారత క్రికెట్ రూపురేఖలు పూర్తిగా మారిపోగలవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ లోధా సంస్కరణలతో ఏర్పడిన బీసీసీఐ కొత్త రాజ్యాంగం గంగూలీ మూడేళ్లు కొనసాగేందుకు అనుమతించడంలేదు. ఏ వ్యక్తి అయినా సరే రెండు సార్లు వరుసగా (ఆరేళ్లు) రాష్ట్ర క్రికెట్ సంఘాలలోగానీ, బీసీసీఐలో గానీ లేదా రెండింటిలోగానీ ఆఫీసు బేరర్లుగా వ్యవహరించుంటే ఆపై మూడు సంవత్సరాల విరామం తర్వాతే మళ్లీ పోటీ చేయాలి. దాంతో సౌరవ్ .బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) చీఫ్‌గా రెండోసారి బాధ్యతలు నిర్వర్తించడంతో అతడు .కేవలం తొమ్మిది నెలలే బోర్డు బాస్‌గా ఉండనున్నాడు. అలాగే జై షా గుజరాత్ క్రికెట్ సంఘం సంయుక్త కార్యదర్శిగా రెండోసారి వ్యవహరించడంతో అతడు కూడా బీసీసీఐ కార్యదర్శిగా పూర్తికాలం కొనసాగలేడు. ఈనేపథ్యంలో బీసీసీఐ రాజ్యాంగానికి సవరణలు చేయాలని కొత్త పాలకవర్గం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బీసీసీఐ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) డిసెంబరు 1న ముంబైలో జరగనుంది. ఈమేరకు అన్ని రాష్ట్ర సంఘాలకు బోర్డు కార్యదర్శి జై షా నోటీసులు పంపాడు. మొత్తం 12 పాయింట్లతో బోర్డు అజెండా రూపొందించారు. అందులో ముఖ్యమైనది బోర్డు అధ్యక్ష, కార్యదర్శులు వచ్చే మూడేళ్లు పదవిలో కొనసాగేలా రాజ్యాంగానికి సవరణ చేయడం. ఇందుకు 3/4 వంతుల మంది సభ్యుల ఆమోదం కావాల్సి ఉంటుంది. అలాగే సుప్రీంకోర్టు కూడా సవరణకు పచ్చజెండా ఊపాల్సి ఉంటుంది.


తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలిచిన కపిల్ డెవిల్స్ కథతో తెరకెక్కుతున్న హిందీ చిత్రం '83'లో.. కపిల్ పాత్ర పోషిస్తున్న హీరో రణ్‌వీర్‌సింగ్ 'నటరాజ్' షాట్ కొడుతున్న ఫస్ట్‌లుక్‌ను సోమవారం సోషల్ మీడియాలో పంచుకున్నాడు.

ఇషా హ్యాట్రిక్ గోల్డ్

- **సౌరభ్ సిల్వర్ షూట్**
- **ఆసియా షూటింగ్**

దోహా: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి ఇషా సింగ్ మరో పతకంతో సత్తాచాటింది. టోర్నీలో ఇప్పటికే రెండు స్వర్ణాలు సాధించిన ఇషా.. తాజాగా మూడో పసిడితో హ్యాట్రిక్ కొట్టింది. జూనియర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఇషా సింగ్-సరబ్‌జ్యోత్ సింగ్ జోడీ విజేతగా నిలిచి స్వర్ణం అందుకుంది. సీనియర్ విభాగంలో 17 ఏళ్ల సౌరభ్ చౌధురి వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం సాధించాడు. ఫైనల్స్‌లో సౌరభ్ 244.5 స్కోరు చేసి రెండోస్థానంలో నిలిచాడు. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో సౌరభ్ చౌధురి, అభిషేక్ వర్మ, శ్రవణ్ కుమార్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం అందుకుంది.

ప్రపంచ స్క్వాష్‌లో ప్రీక్వార్టర్స్‌కు సౌరవ్

దోహా: భారత స్టార్ ఆటగాడు సౌరవ్ ఘోషల్ పురుషుల ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ దిశగా దూసుకెళుతున్నాడు. ఈ మెగా టోర్నమెంట్‌లో ప్రీ క్వార్టర్‌ఫైనల్ చేరాడు. సోమవారం జరిగిన పోరులో సౌరవ్ 11-8, 11-5, 11-5తో ఫ్రాన్స్ క్రీడాకారుడు లుకాస్ సెర్మెపై విజయం సాధించాడు. క్వార్టర్స్ బెర్త్ కోసం మహ్మద్ ఎల్ షార్బగీ (ఈజిప్టు)తో సౌరవ్ తలపడనున్నాడు.

'డైపర్' బుడ్డోడి టెక్నిక్ అదుర్స్..

న్యూఢిల్లీ : మూడేళ్ల బుడతడు. తెలుపు, ఎరుపు టీషర్ట్. కింద డైపర్. గ్లోవ్స్ తొడుక్కుని చిట్టి చేతుల్లో బుజ్జి బ్యాట్‌తో అతడు కొట్టిన షాట్లకు నెటిజన్లతో పాటు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ కూడా ఫిదా అయ్యాడు. ఆ వీడియోను ట్విటర్‌లో షేర్ చేసిన్ వాన్..చిన్నారిపై ప్రశంసలు కురిపించాడు. ఓ గదిలో అతడు చేసిన ప్రాక్టీస్ సోషల్ మీడియాలో హల్ చేసింది. గార్డ్ తీసుకొని ఫ్రంట్ ఫుట్‌పై అతడు చేసిన డ్రైవ్‌లు ఔరా అనిపించాయి. బంతిని తదేకంగా గమనిస్తూ దాని గమనాన్ని అంచనా వేస్తూ అందుకనుగుణంగా బ్యాట్‌ను ఉపయోగిస్తూ కళాత్మకంగా కొట్టిన ఆన్ డ్రైవ్‌లు బుడతడి టెక్నిక్‌కు అద్దంపట్టాయి. సచిన్, స్టీవ్ స్మిత్‌లా ఆడావంటూ నెటిజన్లు ఆ చిన్నారిని పొగిడారు. ఆస్ట్రేలియన్ టెలివిజన్ చానెల్ ఫాక్స్ క్రికెట్ అయితే 'ఇంకా డైపర్‌ను కూడా వీడని బుడతడి టెక్నిక్ క్లబ్ క్రికెటర్లకంటే మిన్నగా ఉంది' అని ప్రశంసించింది.


దీపక్ చాహర్

దీపక్ చాహర్.. అంతర్జాతీయ క్రికెట్‌ను ఒక్కసారిగా తనవైపునకు తిప్పుకొన్న భారత యువ పేసర్. 18 ఏళ్ల వయస్సులో రంజీ ట్రోఫీలో అతడి అరంగేట్రమే అద్భుతం. హైదరాబాద్‌పై 10 పరుగులకే 8 వికెట్లు తీసిన ఈ రాజస్థానీ ధాటికి ఆ జట్టు చేసింది 21 పరుగులే. ఇప్పుడు ఇంతింతై వటుడింతై అన్నట్టుగా పొట్టి ఫార్మాట్‌లో అతి తక్కువ పరుగులకు ఆరు వికెట్లు తీయడంతో పాటు భారత్ తరపున హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గానూ ఘనత దక్కించుకున్నాడు. అయితే ఈ హీరోచిత ప్రదర్శన వెనుక చాహర్ అకుంఠిత దీక్ష దాగుంది. ఐపీఎల్‌లో ఎంఎస్ ధోనీ మార్గదర్శకంలో రాటుదేలిన ఈ నయా స్వింగ్ కింగ్ ఇప్పుడు భారత జట్టు ప్రధాన డెత్ బౌలర్‌గానూ రాటుదేలుతున్నాడు.

నయా స్వింగ్ కింగ్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

బంగ్లాదేశ్‌తో ఆఖరి టీ20లో దీపక్ చాహర్ ప్రదర్శన అతడి తండ్రి లోకేంద్రసింగ్ చాహర్‌ను సంతోషంలో ముంచెత్తింది. 'ఈ ప్రదర్శనతో మా ఇద్దరి కల నెరవేరింది. ఈ షోకన్నా ముందు నెట్స్‌లో చాహర్ కనీసం ఓ లక్ష బంతులైనా విసిరి ఉంటాడు. 12 ఏళ్ల వయస్సులో అతడి ప్రతిభను గమనించిన నేను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ నుంచి తప్పుకొని పూర్తిగా అతడి కెరీర్‌కే అంకితమయ్యా. నేను క్రికెటర్ కావాలనుకున్నా నా తండ్రి అంగీకరించలేదు. అందుకే నా కొడుకు ద్వారా నా కల తీర్చుకోవాలనుకున్నా. ఇందుకోసం కోచ్‌గానూ మారా. మాల్కం మార్షల్, డేల్ స్టెయిన్‌ల వీడియోలు చూసి దీపక్‌కు శిక్షణ ఇచ్చేవాణ్ణి. దీపక్‌ను టెస్టు బౌలర్‌గానూ చూడాలనుంది' అని లోకేంద్ర తెలిపాడు.

లక్ష బంతులు విసిరాడు..

బంగ్లాదేశ్‌తో ఆఖరి టీ20లో భారత్ ఘనవిజయమే సాధించినా మధ్యలో ఓ పది ఓవర్లు మాత్రం ఉత్కంఠను రేపాయి. తన తొలి ఓవర్‌లోనే ఓపెనర్లిద్దరినీ దీపక్ చాహర్ పెవిలియన్‌కు చేర్చాడు. కానీ ఆతర్వాత మహ్మద్ నయీమ్, మిథున్ జోడీ భారత్‌లో గుబులు రేపింది. ఈసమయంలో మిగతా బౌలర్లను వీరు ఆటాడుకున్నారు. దీంతో లక్ష్యం వైపు వేగంగా సాగుతున్న బంగ్లాను నిలువరించేందుకు కెప్టెన్ రోహిత్ తిరిగి బంతిని చాహర్‌కు అప్పగించాడు. అంతే.. తాను వేసిన ఈ రెండో ఓవర్‌లో మిథున్‌ను అవుట్ చేసి అప్పటిదాకా జట్టు పడిన టెన్షన్‌ను తొలగించాడు. ఇక చివర్లో హ్యాట్రిక్ కూడా సాధిస్తూ మ్యాచ్‌ను ముగించాడు. ఈక్రమంలో అతడు వేసిన 20 బంతుల్లో ఏడు పరుగులకు ఆరు వికెట్లు తీశాడు. అందులో 14 డాట్ బంతులుండడం విశేషం. అయితే ఈ అద్భుతం వెనుక దీపక్ చాహర్ పడిన కష్టం అంతా ఇంతా కాదు. భారత జట్టులో పేసర్‌గా రాణించాలంటే వైవిధ్యమైన బంతులు విసరాల్సిందేనని భావిస్తూ ఆ దిశగా తన ప్రయత్నాలు మొదలుపెట్టి ఈస్థాయికి చేరాడు. ఆఫ్ కట్టర్‌లతో బ్యాట్స్‌మెన్‌ను అయోమయంలోకి నెట్టడంతో పాటు స్లో బౌన్సర్లతో బోల్తా కొట్టిస్తూ బుల్లెట్ యార్కర్లతో బెంబేలెత్తించగలడు. అందుకే టీ20ల్లో తను ప్రధాన అస్త్రంగా మారి పవర్‌ప్లేలో కచ్చితంగా చాహర్ వికెట్ తీయగలడనే నమ్మకం కలిగించాడు. ఇప్పుడు డెత్ బౌలర్‌గానూ ప్రభావం చూపిస్తానని భరోసా ఇవ్వడం జట్టుకు పెద్ద రిలీఫ్‌గా భావించవచ్చు.

ధోనీ పాత్ర కీలకం..

చాహర్ విజయం వెనక మహేంద్ర సింగ్ ధోనీ పాత్ర ఎనలేనిది. అతడిలోని సహజ ప్రతిభను గుర్తించడంతో పాటు ఎల్లవేళలా ప్రోత్సాహం అందించాడు. రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు ధోనీ అతడిని మొదటిసారి గుర్తించాడు. ఆతర్వాత చెన్నై జట్టు రీఎంట్రీ ఇవ్వడంతో వెంటనే అతడిని తన సైన్యంలో చేర్చాడు. ప్రతీ మ్యాచ్‌లోనూ కొత్త బంతిని అతడి చేతికే అందించాడు. జీవంలేని పిచ్‌లపై కూడా బంతిని స్వింగ్ చేయగల చాహర్ సత్తా సీఎస్‌కే అమ్ముల పొదిలో ప్రధాన బలంగా మారింది. ఈనమ్మకాన్ని వమ్ము చేయని దీపక్ ఆరంభంలోనే వికెట్లు తీసి ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టేవాడు. 2018 ఐపీఎల్‌లో 10.. ఈ సీజన్‌లో 22 వికెట్లతో రాణించి ఏకంగా జాతీయ జట్టులో బెర్త్ దక్కించుకోగలిగాడు.

బౌలింగ్‌కు పనికిరాడన్నారు..

2008.. రాజస్థాన్ క్రికెట్‌లో యువ ఆటగాళ్ల కోసం ట్రయల్స్ సాగుతున్నాయి. దీనికి 16 ఏళ్ల దీపక్ చాహర్ కూడా హాజరయ్యాడు. అప్పట్లో ఆ రాష్ట్ర క్రికెట్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న గ్రెగ్ చాపెల్.. చాహర్ బౌలింగ్‌ను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. అతడిని టాప్-50లోకి కూడా ఎంపిక చేయకపోగా అసలు నీకు క్రికెట్‌లో భవిష్యత్తే లేదని తేల్చి చెప్పాడు. కానీ సవాళ్లను స్వీకరించే అలవాటున్న దీపక్ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. ఈవిషయంలో అతడి తండ్రి లోకేంద్ర సింగ్.. చాహర్‌కు మద్దతుగా నిలిచాడు. చోటు లేదని వెళ్లగొట్టిన రెండేళ్లకే తానేంటో దీపక్ చాహర్ నిరూపించుకున్నాడు. 18 ఏళ్ల వయస్సులో రంజీలో అరంగేట్రం చేస్తూనే హైదరాబాద్‌పై పది పరుగులకే ఎనిమిది వికెట్లు తీసి అబ్బురపరిచాడు. ఈ అద్భుత ప్రదర్శన యూట్యూబ్‌లోనూ అత్యధిక మంది వీక్షించిన దేశవాళీ మ్యాచ్‌గా నిలిచింది. ఆ సీజన్‌లో 40కి పైగా వికెట్లు తీసి రాజస్థాన్‌ను రంజీ చాంపియన్‌గా నిలిపాడు. అయితే ఆతర్వాతి కాలంలో గాయాలు అతడిని వెనక్కినెట్టినా చివరికి అనుకున్నది సాధించగలిగి అందరూ గర్వించే స్థాయికి ఎదగడం అపూర్వం.

ఒకేసారి 88 స్థానాలు జంప్..

దుబాయ్: బంగ్లాదేశ్‌తో చివరి టీ20లో ఏడు పరుగులే ఇచ్చి ఆరు వికెట్లు తీసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన పేసర్ దీపక్ చాహర్ అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లోనూ రాకెట్ వేగంతో దూసుకెళ్లాడు. సోమవారం ప్రకటించిన బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఈ యువ పేసర్ ఏకంగా 88 స్థానాలను ఎగబాకి 42వ ర్యాంకుకు చేరడం విశేషం. రషీద్ ఖాన్ నెంబర్‌వన్‌గా ఉండగా, టాప్-5 బౌలర్లంతా స్పిన్నర్లే కావడం విశేషం. బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ (7), కేఎల్ రాహుల్ (8) భారత్ నుంచి టాప్-10లో ఉన్నారు. బాబర్ ఆజమ్, ఫించ్, డేవిడ్ మలాన్ తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ జాబితాలో మహ్మద్ నబీ టాప్ పొజిషన్‌కు చేరాడు.

జాతీయ స్పోర్ట్స్ కోడ్‌కు ఐఓఏ నో!

న్యూఢిల్లీ: కొత్త జాతీయ స్పోర్ట్స్ కోడ్ డ్రాఫ్ట్‌ను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తిరస్కరించింది. దీన్ని అమలు చేయాలని చూస్తే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నుంచి ఇబ్బందులు ఎదురవుతాయని, సస్పెన్షన్ వేటు వేసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఐఓఏ స్వయం ప్రతిపత్తిని హరించే విధంగా ఈ కోడ్ ఉందని చెప్పింది. ప్రస్తుతం 2011 స్పోర్ట్స్ కోడ్ అమల్లో ఉంది. జాతీయ స్పోర్ట్స్ కోడ్-2017 డ్రాఫ్ట్‌లో అనేక సవరణలను ప్రభుత్వం ప్రతిపాదించింది. బీసీసీఐ రాజ్యాంగాన్ని అనుకరిస్తూ నిర్దిష్ట పదవీకాలం, గరిష్ఠ వయో నిబంధన, ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు జాతీయ ఫెడరేషన్లలో ఎలాంటి పదవులు చేపట్టకుండా ఉండేలా అనేక సంస్కరణలను డ్రాఫ్ట్‌లో పొందుపరిచారు.

వెస్టిండీస్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ అఫ్ఘాన్ ఓటమి

లఖ్‌నవ్: అఫ్ఘానిస్థాన్‌తో మూడో వన్డేలో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. దాంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 8 బంతులు మిగిలుండగా 253/5 స్కోరు చేసి ఛేదించింది. ఓపెనర్ షాయ్ హోప్ (109 నాటౌట్) సెంచరీతో కదం తొక్కాడు. ముజీబుర్ రహ్మాన్ రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు అఫ్ఘానిస్థాన్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 249 పరుగులు చేసింది. అస్గర్ అఫ్ఘాన్ (86), హజ్రతుల్లా జజాయ్ (50), మహ్మద్ నబీ (50 నాటౌట్) హాఫ్ సెంచరీలు చేశారు. కీమోపాల్ 3, అల్జరీ జోసెఫ్ 2 వికెట్లు పడగొట్టారు.

సింధు ఇక్కడైనా..?

హాంకాంగ్ ఓపెన్ నేటినుంచి

హాంకాంగ్: ఇటీవల వరుస టోర్నీల్లో విఫలమవుతున్న స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్ హాంకాంగ్ ఓపెన్‌తోనైనా ఆరంభ గండాలను అధిగమించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ టోర్నీ మంగళవారం మొదలవనుంది. సింగిల్స్ తొలి రౌండ్‌లో కిమ్ గ ఉన్ (కొరియా)తో సింధు, కయ్ యన్ యన్ (చైనా)తో నెహ్వాల్ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ మొదటి రౌండ్లో వరల్డ్ నెంబర్‌వన్ కెంటా మొమోటాతో ఆడనున్నాడు. ఇక ఇటీవల అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట.. హాంకాంగ్‌లోనూ అదరగొట్టాలని ఆరాటపడుతోంది. గతవారం చైనా ఓపెన్‌లో సెమీస్ చేరడం.. అంతకుముందు ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలవడంతో ఈ జోడీపై అంచనాలు అమాంతం పెరిగాయి. తొలి రౌండ్‌లో జపాన్ ద్వయం టకురో-కబయాషితో సాత్విక్ జంట తలపడనుంది. సింగిల్స్‌లో సాయి ప్రణీత్, సమీర్, కశ్యప్.. డబుల్స్‌లో అశ్విని-సిక్కి, మిక్స్‌డ్‌లో అశ్విని-సాత్విక్, ప్రణవ్-సిక్కి జోడీలు బరిలో దిగనున్నాయి.

స్వర్ణ సుందర్

ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో టైటిల్ నిలబెట్టుకున్న సుందర్ సింగ్

దుబాయ్: తీవ్రంగా బాధిస్తున్న భుజం గాయాన్ని సైతం లెక్కచేయని భారత్ అథ్లెట్ సుందర్ సింగ్ గుర్జార్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ నిలబెట్టుకున్నాడు. అంతేకాదు.. టోక్యో పారా ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా దక్కించుకున్నాడు. ఇక్కడ జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సోమవారం జరిగిన ఎఫ్-46 జావెలిన్ త్రో ఫైనల్లో సుందర్ 61.22 మీ. సీజన్ అత్యుత్తమ దూరంతో స్వర్ణ పతకం అందుకున్నాడు. 23 ఏళ్ల సుందర్ 2017 లండన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లోనూ టైటిల్ గెలిచాడు. భారత్‌కే చెందిన అజిత్ సింగ్ (59.40 మీ.) కాంస్య పతకం నెగ్గాడు. శ్రీలంకకు చెందిన దినేశ్ హెరాత్ (60.59 మీ.) రజత పతకం కైవసం చేసుకున్నాడు. భారత్ అథ్లెట్ రింకూ నాలుగో స్థానంలో నిలిచాడు. సుందర్‌తోపాటు, అజిత్, రింకూ టోక్యో పారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు.

భూగోళం చుట్టూ ఉపగ్రహాలు..

ప్రపంచం అంతటికీ ఒకే నెట్‌వర్క్

60 ఉపగ్రహాలను ప్రయోగించిన స్పేస్ ఎక్స్



కేప్ కానావెరల్, నవంబరు 11: ప్రపంచం అంతటికీ అత్యంత చౌకగా, వేగంగా ఇంటర్నెట్ అందించాలన్న స్పేస్ ఎక్స్ సంస్థ 'స్టార్ లింక్' ప్రాజెక్టులో రెండో దశ పూర్తయింది. నెట్‌వర్క్‌కు సంబంధించిన 60 చిన్న ఉపగ్రహాలను సోమవారం ఉదయం అంతరిక్షంలోకి ప్రయోగించారు. వీటిని ఫాల్కన్ 9 రాకెట్ అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. ఇంతకుముందు మేలో 60 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టారు. కొన్ని వేల ఉపగ్రహాలను నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశపెట్టి ప్రపంచం అంతటికీ ఒకే నెట్‌వర్క్‌తో ఇంటర్నెట్ అందించాలన్న లక్ష్యంతో, స్పేస్ ఎక్స్ ఫౌండర్ ఎలాన్ మస్క్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. వచ్చే ఏడాది నాటికి ఇలాంటి 24 ప్రయోగాలను జరిపి ఇంటర్నెట్ సేవలను అమెరికా, కెనడాలో ప్రారంభించాలని ఆయన భావిస్తున్నారు.

111 అడుగుల శివలింగానికి తొలి పూజ

తిరువనంతపురంలోని చెంకల్ పంచాయతీలో ప్రతిష్ఠించిన ఈ శివలింగం దేశంలోనే ఎత్తైనది. మహేశ్వర శ్రీ శివ పార్వతీ దేవాలయంలో 111 అడుగుల ఈ మహా శివలింగానికి ఆలయ మఠాధిపతి మహేశ్వరానంద స్వామి సోమవారం తొలిపూజ చేశారు. దేశంలోని పవిత్ర పుణ్యక్షేత్రాల నుంచి తెచ్చిన మట్టిని దీని నిర్మాణంలో ఉపయోగించారు. ఎనిమిది అంతస్తుల ఎత్తున ఈ శివలింగంలో ధ్యాన సాధన కోసం మందిరాలను ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో 108 శివలింగాలను, ఎనిమిదో అంతస్తులో కైలాస ప్రతిరూపాన్ని నెలకొల్పారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఈ భారీ శివలింగం చోటు దక్కించుకుంది.

చిత్రమైన చైనా చేప

మనిషి మొహం పోలికలతో ఉన్న ఈ వింత చేపను చూశారా? అచ్చంగా మనిషిలాగానే ముక్కు, రెండు కళ్లు, నోరున్న చేపను ఓ పర్యాటకురాలు గమనించి వీడియో తీశారు. చైనా కన్మింగ్‌లోని చెరువులో ఈ వింత చేప దర్శనమిచ్చింది. మనిషి మొహం పోలికలున్న చేపలు గతంలో తైవాన్, బ్రిటన్‌లోనూ కనిపించాయి.

తెలుగు విద్యార్థులు ఆరుగురికి జైలు

అమెరికాలో ఇమిగ్రేషన్ మోసాలే కారణం

త్వరలోనే మరో ఇద్దరు కూడా..

హైదరాబాద్, నవంబరు 11: ఇమిగ్రేషన్ మోసాల కేసులో అమెరికాలో ఎనిమిది మంది భారతీయ విద్యార్థుల్లో ఆరుగురు జైలుపాలయ్యారు. మరో ఇద్దరికి కూడా త్వరలోనే శిక్షలు ఖరారుచేసే అవకాశం ఉంది. ఈ ఎనిమిది మంది కూడా తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులే! వీరంతా అమెరికాలోని ఫార్మింగ్‌టన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు. అక్రమంగా అమెరికాలో ఉంటున్న విద్యార్థులెవరో తేల్చేందుకు అక్కడి ఇమిగ్రేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)ని ఆ వర్సిటీ ఆశ్రయించింది. దర్యాప్తులో ఎనిమిది మంది విద్యార్థులు అక్రమంగా అమెరికాలో ఉంటున్నట్లు తెలింది. ఈ మేరకు కాలిఫోర్నియాలోని ఫ్రిమాంట్‌కు చెందిన సంతోష్ శర్మకు రెండేళ్లు.. ఫ్లోరిడాలోని లేక్‌మేరీలో ఉంటున్న భరత్ కాకిరెడ్డికి.. వర్జీనియాలోని కుల్పెపర్‌లో ఉంటున్న సురేశ్ కందాలకు 18నెలల చొప్పున.. పెన్సల్వేనియాలోని హారిస్‌బర్గ్‌లో ఉంటున్న అవినాశ్ తక్కళ్లపల్లికి 15నెలలు.. అట్లాంటాలో ఉంటున్న అశ్వంత్ నూనెకు, డల్లాస్‌లో ఉంటున్న నవీన్ ప్రత్తిపాటికి ఏడాది చొప్పున జైలు శిక్ష విధించారు. మిగతా ఇద్దరు.. నార్త్‌కరోలినాలో ఉంటున్న ప్రేమ్ రాంపీసాకు ఈనెల 19న, లాస్‌విల్లేలో ఉంటున్న ఫణిదీప్ కర్నాటికి వచ్చే జనవరిలో శిక్షలు ఖరారు చేస్తారని ఇమిగ్రేషన్ అధికారి తెలిపారు. శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఈ ఎనిమిది మందినీ స్వదేశాలకు పంపేస్తామని వెల్లడించారు.

ఉమ్మడి పౌర స్మృతి

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ, డీఎంకే, ఎన్సీపీ, ఎన్సీ, లెఫ్ట్, తృణమూల్ సహా అనేక విపక్షాలు దీన్ని వ్యతిరేకించాయి. వారిని ఒప్పించి కేంద్రం ముందుకెళ్తుందా? ఆర్టికల్ 370 మాదిరే వ్యవహరిస్తుందా.. అన్నది వేచిచూడాలని రాజకీయ విశ్లేషకులు అన్నారు.

లా కమిషన్ నో!

దీన్ని బీజేపీ 2014ఎన్నికల మేనిఫెస్టోలోనే చేర్చింది. ఉమ్మడి పౌరస్మృతి సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా 2016లోనే మోదీ ప్రభుత్వం లా కమిషన్‌ను కోరింది. నిపుణులు, ఇతర వర్గాల అభిప్రాయాలు తీసుకుని, అధ్యయనం చేశాక 'ప్రస్తుతానికి దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరమూ లేదు.. వాంఛనీయమూ కాదు' అని లా కమిషన్ చెప్పింది. 'భిన్నత్వాన్ని, అభిప్రాయ భేదాన్ని చాలా దేశాలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నాయి. విభేదం ఉన్నంత మాత్రాన వివక్ష ఉన్నట్లు భావించరాదు. నిజానికది బలమైన ప్రజాస్వామ్యం ఉన్నట్లు సంకేతం" అని నిరుడు సెప్టెంబరులో విడుదల చేసిన చర్చాపత్రంలో లా కమిషన్ చైర్మన్ జస్టిస్ బి.ఎస్.చౌహాన్ అన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి అంటే?

మత పరమైన ఆచారాలు, సంప్రదాయాలకు అతీతంగా దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టం. అంటే వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, జీవనభృతి(మనోవర్తి,భరణం లేదా ఇతరత్రా నిర్వహణ) మొదలైన అన్ని అంశాల్లో కుల, మత, వర్గాలకు అతీతంగా పౌరులందరికీ ఒకే చట్టం. ఇంతవరకూ హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. ఉమ్మడి పౌర స్మృతి వస్తే అవన్నీ పూర్తి స్థాయిలో చెల్లవు.

రాజ్యాంగంలో ఉందా?

రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లో దీన్ని రేఖామాత్రంగా ప్రస్తావించారు. అధికరణం 44లో దీని గురించి ఉంది. "దేశంలోని పౌరులందరికీ వర్తించేట్లు ఒకే చట్టాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలి" అని పేర్కొన్నారు. ఉమ్మడి పౌరస్మృతిని రాజ్యాంగ రూపకర్త బీఆర్ అంబేద్కర్ గట్టిగా సమర్థించినా హిందూ-ముస్లిం నేతాగణం నుంచి ఆయనకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది.

సుప్రీంకోర్టు ఏమంది?

ఉమ్మడి పౌరస్మృతి తేవాలని కేంద్రానికి సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో సూచించింది. శాసనవ్యవస్థ ఆ దిశగా ఏ చర్యలూ తీసుకోలేదు. (వ్యక్తిగత) మత చట్టాలే ఇప్పటికీ అమలవుతున్నాయి.

(1) షా బానో కేసు: ఉమ్మడి పౌరస్మృతి దిశగా దేశ అభిప్రాయాన్ని మరల్చిన కేసు ఇది. మహ్మద్ అహ్మద్ ఖాన్ అనే వ్యక్తి 40 ఏళ్ల వైవాహిక జీవితం తరువాత తన భార్య అయిన షా బానోకు మూడు సార్లు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడు. ఆమెకు మనోవర్తి కూడా ఇవ్వడానికి నిరాకరించాడు. స్థానిక కోర్టురూలింగ్ వల్ల తొలుత కొద్దినెలలు ఆమె భరణం అందుకుంది. అయితే అహ్మద్ ఖాన్ దీనిపై సుప్రీంకోర్టు కెక్కాడు. ఇస్లామిక్ చట్టాల ప్రకారం తాను షా బానోకు జీవితాంతం మనోవర్తి ఇవ్వాల్సిన పనిలేదని వాదించాడు. సుప్రీంకోర్టు ఆలిండియా క్రిమినల్ కోడ్‌లోని సెక్షన్ 125ను ఉపయోగించింది. భార్యాబిడ్డల, తలిదండ్రుల పోషణ భారం సదరు భర్త దేనని ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ సందర్భంలోనే సీజేగా ఉన్న జస్టిస్ వైవీ చంద్రచూడ్ ఉమ్మడి పౌర స్మృతి ఆవశ్యకతను చెప్పారు. 'కామన్ సివిల్ కోడ్ ద్వారా జాతీయ సమైకృత, సమగ్రతలను సాధించవచ్చు. పార్లమెంటు దీనిపై వెంటనే దృష్టి పెట్టాలి" అన్నారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. పైగా క్రిమినల్ కోడ్ ముస్లిం మహిళలకు వర్తించకుండా సెక్షన్ 125ను సవరిస్తూ ప్రత్యేక చట్టాన్ని 1986లో చేసింది.

(2) సరళా ముద్గల్ కేసు 1995: హిందూ వివాహ చట్టం ప్రకారం ఒక మహిళను పెళ్లాడిన ఓ వ్యక్తి, అది కొనసాగుతుండగానే ఇస్లాం మతంలోకి మారి ఓ ముస్లిం మహిళను పెళ్లాడిన ఘటన ఇది. దీన్ని పరిశీలించిన సుప్రీంకోర్టు రెండో పెళ్లి చట్టవిరుద్ధమని తేల్చింది. ఆ సమయంలోనే సాధ్యమైనంత త్వరగా ఉమ్మడి పౌర స్మృతితేవాలని కేంద్రానికి సూచించింది. "హిందూ కోడ్ బిల్లును 1954లో తెచ్చారు. ఉమ్మడి పౌర స్మృతి తేవడానికి దేశంలో పరిస్థితులు అనుకూలంగా లేవని నాడు పండిట్ నెహ్రూ అన్నారు. మరి స్వాతంత్ర్యం వచ్చిన 41 ఏళ్ల తరువాత కూడా పరిస్థితులు మెరుగుపడలేదా? ఇక రాజ్యాంగంలోని 44వ అధికరణంలో పేర్కొన్న కామన్ సివిల్ కోడ్ అంశం దుమ్ముకొట్టుకుని పడి ఉండడమేనా? దేశంలోని 80% మంది పౌరులు దీనికి సమ్మతిస్తున్నపుడు ఇంకా దేనికి ఆలస్యం?" అని జస్టిస్ కుల్‌దీప్ సింగ్ నాటి తీర్పులో ప్రశ్నించారు.

(3) జాన్ వల్లమట్టం కేసు 2003: ఈ కేసులో కూడా నాటి సుప్రీం చీఫ్ జస్టిస్ వీఎన్ ఖరే కేంద్రాన్ని ఆక్షేపించారు. '44వ అధికరణంపై ఇప్పటికీ కేంద్రం దృష్టి పెట్టలేదు. దురదృష్టకరం" అన్నారు.

(4) 2015లో: "ప్రతీ అంశంలోనూ మా మతం ప్రకారం ఇది కుదరదు, అది చెల్లదని అంటే సమ్మతించం. ఉమ్మడి పౌరస్మృతి తేవడానికి కేంద్రానికి ఏంటి అభ్యంతరం? పార్లమెంటు చట్టం చేయొచ్చు గదా"అని సుప్రీంకోర్టు ఓ కేసు విచారణ సమయంలో పేర్కొంది.

గోవా ఆదర్శమా?

స్వాతంత్ర్యం వచ్చాక గోవా ప్రభుత్వం పోర్చుగీసులో అమల్లో ఉన్న ఉమ్మడి పౌరస్మృతి విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించుకుంది. దీని ప్రకారం అన్ని అంశాల్లో గోవాలో ఒకటే చట్టం. ఆస్తులన్నింటికీ భార్యాభర్తలిద్దరూ ఉమ్మడిగా యజయానులు. తమ పిల్లలు తమ వారసులు కాదని వారు చెప్పడానికి వీల్లేదు.

జేజే చట్టం ఓ ముందడుగా?

ఉమ్మడి పౌర స్మృతి దిశగా 2014లో చేసిన బాల నేరస్తుల న్యాయ చట్టం ఓ ముందడుగని చెబుతారు. తమ మతపరమైన సంప్రదాయం ప్రకారం నిషేధమైనప్పటికీ ముస్లింలు ఏ మతం వారినైనా దత్తత తీసుకునేందుకు ఆ చట్టం వీలు కల్పిస్తుంది. దానిని సవాలు చేస్తూ దాఖలైన ఓ పిటిషన్ సమయంలోనూ ఉమ్మడి పౌరస్మృతి మాటేంటని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది.

ఆర్టికల్ 25కు విరుద్ధమా?

రాజ్యాంగంలోని 25వ అధికరణంలోని కొన్ని అంశాలతో ఉమ్మడి పౌర స్మృతి విభేదిస్తుందని నిపుణులంటున్నారు. పౌరులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు, అనుసరించేందుకు, వ్యాప్తి చేసేందుకు ఆర్టికల్ 25 వీలు కల్పిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని 'పౌరులపై ఉమ్మడి పౌర స్మృతిని బలవంతంగా రుద్దలేమని' రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. యూనీసీ (వ్యక్తిగత) మతపరమైన చట్టాలు రెంటినీ సమన్వయ పరుచుకోవాలని సూచిస్తున్నారు.

వారే సంస్కరించుకోవాలి

సంస్కరణ అనేది ఒక వర్గంలో అంతర్గతంగా మొదలుకావాలి. బహుభార్యాత్వం మనకి మంచిది కాదని ముస్లింలు తమంత తాముగా నిర్ణయించుకుంటే నేను సంతోషిస్తాను. అంతే తప్ప 'ఇది తప్పు' అని వారిపై నా అభిప్రాయాన్ని బలవంతంగా రుద్దను. ముస్లింలు వారి చట్టాలను వారే సంస్కరించుకోవాలన్నది నా అభిమతం.

- ఆరెస్సెస్ చీఫ్ గోల్వాల్కర్(1972)

ఒకే పద్ధతి అమలు చేయాలి

ప్రతీ జననాన్ని, మరణాన్ని నమోదు చేయాలి. ప్రతీ వివాహానికి, విడాకులకు ఒకే పద్ధతి అమలు చేయాలి. పెళ్లిని చట్టరీత్యా నమోదు చేయడం అవసరం. ఉమ్మడి నేర చట్టాలు ఉన్నపుడు ఉమ్మడి పౌర స్మృతి ఎందుకుండకూడదు?

- శేషాద్రి చారి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త

ఉమ్మడి పౌర స్మృతి

అనుకూలతలు

- కులం, మతం, వర్గం, స్త్రీ పురుష భేదాలకు అతీతంగా దేశంలోని పౌరులందరికీ సమాన హోదా.
- లైంగిక సమానత్వం సాధించవచ్చు. స్త్రీ పురుషులిద్దరూ చట్టప్రకారం సమానమే అని తీసుకోవచ్చు
- క్రిమినల్, సివిల్ చట్టాలన్నీ అందరికీ సమానమవుతాయి.
- ప్రస్తుత పర్సనల్ చట్టాలను సంస్కరించాల్సిన పనిలేదు.
- బహుభార్యత్వం నేరంగా మారుతుంది
- అన్ని మతాల్లో చిన్న కుటుంబం తప్పనిసరి చేసే చాన్స్
- దేశ నిర్మాణంలో యువత సామర్థ్యాన్ని వాడుకోవచ్చు

ప్రతికూలతలు

- దేశంలో భిన్నత్వం వల్ల ఉమ్మడి పౌర చట్టంపై ప్రతిఘటన రావొచ్చు
- ఈ ఉమ్మడి చట్టం తమ మతంపై, సంస్కృతిపై దాడి అని ముస్లింలు సహా కొన్ని వర్గాలు భావించే అవకాశం
- వ్యక్తిగత పనుల్లో ప్రభుత్వ జోక్యానికి నిరసన
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ద్వారా సంక్రమించే మత స్వేచ్ఛకు అడ్డంకి
- ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన సున్నితమైన అంశం కావడం.

అయోధ్య ట్రస్టుకు సన్నద్ధం!

- తీర్పును అధ్యయనం చేస్తున్న అధికారులు
- న్యాయశాఖ, అటార్నీ జనరల్‌తో చర్చలు

న్యూఢిల్లీ, నవంబరు 11: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా అయోధ్యలో రామాలయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సన్నద్ధ మౌతోంది. ఇందుకు అవసరమైన ట్రస్టు ఏర్పాటుకు సంప్రదింపుల ప్రక్రియను మొదలెట్టింది. సోమవారం కేంద్ర ప్రభుత్వంలోని పలువురు కీలక అధికారులు సుప్రీంకోర్టు తీర్పు కాపీని ముందేసుకొని అధ్యయనం ప్రారంభించారు. రామాలయ నిర్మాణ విధివిధానాలను ఖరారు చేయాల్సిన ట్రస్టు ఏర్పాటుపై న్యాయశాఖ, అటార్నీ జనరల్ అభిప్రాయాలను తీసుకుంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పులోని సాంకేతికతలను కొద్ది మంది అధికారులతో కూడిన బృందం అధ్యయనం చేస్తోంది. ట్రస్టు ఏర్పాటు వ్యవహారాలను చూసేది హోంశాఖా? సాంస్కృతిక వ్యవహారాల శాఖా? అనే విషయంలో స్పష్టత లేదు.

ట్రస్టు అధ్యక్షుడిగా యోగే అర్హుడు

అయోధ్య ఆలయ ట్రస్టుకు నేతృత్వం వహించడానికి అన్ని విధాలా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథే అర్హుడని రామ జన్మభూమి న్యాస్ ట్రస్ట్ అధినేత మహంత్ నృత్య గోపాల్ దాస్ అన్నారు. ఆయన కూడా గోరఖ్‌నాథ్ ఆలయానికి మహంతేనని గుర్తు చేశారు. ఆలయ ఉద్యమంలో యోగి గురువు అవైద్యనాథ్ కీలక పాత్ర పోషించారని ప్రస్తావించారు.

ప్రజలకు కృతజ్ఞతలు

అయోధ్య తీర్పు సమయంలో సంయమనంతో వ్యవహరించి, మత సామరస్యాన్ని కాపాడిన ఉత్తరప్రదేశ్ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్రంలో శాంతిభద్రతలపై సమీక్ష సందర్భంగా ఈ ప్రకటన వెలువరించారు. ముఖ్యమంత్రి కూడా సమర్థంగా వ్యవహరించారంటూ రాష్ట్ర మంత్రివర్గం ఆయన్ను అభినందించింది.

పోటెత్తిన భక్తులు

అయోధ్యలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు పోటెత్తారు. సరయూ నదిలో ఐదు లక్షల మంది కార్తీక స్నానాలు చేశారు. సాధారణ రోజుల్లో రోజుకు ఎనిమిది వేల మంది చేస్తారు. అయోధ్య తీర్పు కూడా రద్దీకి కారణమని భావిస్తున్నారు.

రాష్ట్రపతి పాలన?

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టమైన హామీని సాధించడంలో శివసేన సఫలం కాలేకపోయింది. దీంతో గవర్నర్ - మూడో అతి పెద్ద పార్టీ అయిన ఎన్‌సీపీని ఆహ్వానించారు. ఈ పార్టీకి కూడా ఆయన 24 గంటల గడువునే ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పరిచే బలముందా లేదా అన్నది మంగళవారం రాత్రి 8-30 గంటల కల్లా తేల్చిచెప్పేయాలని గడువు పెట్టారు. అంటే ఇపుడు శివసేన మద్దతును ఎన్‌సీపీ కోరాలి. ఉద్ధవ్ ఠాక్రే సహకరిస్తే తప్ప ఎన్‌సీపీ- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడదు. అసలు శివసేనతో దోస్తీకే విముఖంగా ఉన్న కాంగ్రెస్ కలిసొచ్చేదీ లేనిదీ కూడా అనుమానమే. బీజేపీ అంచనా ప్రకారం- ఎన్‌సీపీ కూడా ఈ విషయంలో విఫలం కావొచ్చు. అంతిమంగా గవర్నర్ .. రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేసే పరిస్థితి ఏర్పడవచ్చని విశ్లేషకులు అంటున్నారు. కాగా.. శివసేన కోరిన వెంటనే మద్దతు ఇవ్వడానికి కాంగ్రెస్, ఎన్‌సీపీలు రెండూ ఉత్సాహపడలేదు. ముఖ్యంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సోమవారం ఉదయం ఓ సారి, మళ్లీ సాయంత్రం ఓసారి ఢిల్లీలో సమావేశమై పరిణామాలను చర్చించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. అతివాద హిందూత్వ పార్టీ శివసేనతో చెట్టపట్టాలేసుకు వెళితే కాంగ్రెస్ దీర్ఘకాల ప్రయోజనాలకు గట్టి దెబ్బ తగలవచ్చని నేతలు భావించారు. సైద్ధాంతికంగా పూర్తిగా భిన్న ధ్రువమైన శివసేనతో ఇపుడు కలిస్తే అది పార్టీని నిలువునా ముంచేస్తుందని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పార్టీకి అవకాశాలు సన్నగిల్లుతాయని సీనియర్ నాయకులు ఏకే ఆంటోనీ, కేసీ వేణుగోపాల్ తదితరులు సూచించినట్లు సమాచారం. ఓ పక్క సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతుండగానే శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సోనియాగాంధీకి ఫోన్ చేశారు. గడువు సమీపిస్తోందని అంటూ ఆయన గంటసేపు వ్యవధిలో రెండు సార్లు కాల్ చేశారు. 'నేనింకా మా ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోవాలి. మా పార్టీ నేతలతో మాట్లాడి ఏ విషయమూ మీకు చెబుతా" అని బదులిచ్చి దాటవేశారే తప్ప నిర్దిష్టమైన హామీ ఏదీ ఇవ్వలేదు. ఠాక్రే సాయంత్రం 6 గంటల దాకా ఎదురుచూశారు. శివసేన, కాంగ్రెస్ మధ్య సంధానకర్తగా ఉన్న ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌ను కూడా కలిసి పరిస్థితిని చర్చించారు. విశేషమేమంటే ఎన్‌సీపీ కూడా సేన కోరినట్లు ఏ మద్దతునూ సాయంత్రంలోగా ప్రకటించలేదు. పరస్పరం మాట్లాడుకుని చెబుతామని రెండు పార్టీలూ చివరిక్షణం దాకా నాన్చాయి. ఆఖరికి ఓ దశలో కాంగ్రెస్, ఎన్‌సీపీలు రెండూ మద్దతునిస్తామంటూ లేఖల్ని పంపేశాయని శివసేన అధికారికంగా ప్రకటించింది. సామ్నాలో కూడా అదే విషయాన్ని రాసింది. సాయంత్రం 7-25 సమయంలో- అంటే గవర్నర్ శివసేనకు ఇచ్చిన గడువు ముగియడానికి ఓ ఐదు నిమిషాల ముందు- కాంగ్రెస్ నుంచి ప్రకటన వెలువడింది. "మహారాష్ట్ర విషయంలో మరింత లోతుగా చర్చించాల్సి ఉన్నందున సీనియర్ నేతలు మంగళవారం ఉదయం మళ్లీ సమావేశమవుతారు. ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌తోనూ మరో దఫా సోనియా చర్చించనున్నారు. ఈ కారణం వల్ల శివసేనకు మద్దతుకు సంబంధించి ఏ లేఖా పంపలేదు" అని దాని సారాంశం. దీంతో శివసేన హతాశురాలైంది. అయినా ఆశ చావక- గవర్నర్‌ను మరింత గడువు కోరాలని నిర్ణయించి- షెడ్యూల్ ప్రకారం రాజ్‌భవన్‌కు వెళ్లింది. గవర్నర్ అందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. మీకిచ్చిన సమయం అయిపోయిందని స్పష్టం చేశారు.

బీజేపీ వ్యూహం..!

బీజేపీ కోర్‌కమిటీ సమావేశం సోమవారం రాత్రి ముంబైలో జరిగింది. 'ఇది ఎటు దారితీస్తుందో, అధికారం కోసం ఎవరు వెంపర్లాడుతున్నారో ప్రజలు చూస్తున్నారు' అని బీజేపీ నేత సుధీర్ ముంగంటివార్ వ్యాఖ్యానించారు. ఏ పార్టీ కూడా ప్రభుత్వాన్ని ఏర్పరచలేని పరిస్థితిని కల్పించి- చివరకు రాష్ట్రపతి పాలనను అనివార్యం చేయడం బీజేపీ వ్యూహమని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. శివసేనతో కాంగ్రెస్ జట్టుకడితే ఆ ప్రభుత్వానికి తాము మద్దతిచ్చే ప్రశ్నే లేదని, దీన్ని లిఖితపూర్వకంగా గవర్నర్‌కు తెలియపరుస్తామని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. మజ్లిస్‌కు రాష్ట్ర అసెంబ్లీలో రెండు సీట్లున్నాయి.

ఒవైసీపై ఎంపీలో కేసు

న్యూఢిల్లీ, నవంబరు 11:అయోధ్యకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పుపై రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఆరోపిస్తూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీపై కేసు నమోదయ్యింది. మధ్యప్రదేశ్‌లో న్యాయవాది పవన్‌కుమార్ యాదవ్ ఆయనపై జహాంగీరాబాద్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాబ్రీ మసీదు-రామజన్మభూమి వివాదంలో వాస్తవాలపై విశ్వాసాలకే విజయం లభించిందంటూ అసదుద్దీన్ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని అనేక మసీదుల కింద ఒకప్పుడు దేవాలయాలు ఉండేవంటూ సంఘ్‌పరివార్ ఇక ఈ తీర్పుని వాడుకోవచ్చన్న భయం తనకుందని ఆయన అన్నారు.

25 వేల ఇటుకలు పంపిన తమిళర్ పార్టీ

చెన్నై, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామాలయ నిర్మాణానికి తమిళనాడులోని కడలూరు 'నేను సైతం' అంటోంది! అక్కడి హిందూ తమిళర్ పార్టీ నిర్వాహకులు 25 వేల ఇటుకలను రైలు ద్వారా అయోధ్యకు పంపారు. కడలూర్ జిల్లా తిరుప్పాపులియూర్ రైల్వేస్టేషన్ నుంచి సోమవారం ఉదయం 25 వేల ఇటుకలను రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ రైల్లో పంపించారు. ఐదు ఇటుకలకు కాషాయ వస్త్రం చుట్టి ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నారిని చిదిమేశాడు

(మొదటి పేజీ తరువాయి)

వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం, మొవ్వా అనిల్ అలియాస్ ఏసుపాదం గొల్లపూడిలో ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆయన భార్య వెంకట రమణ ఇంటికి సమీపంలోని ఓ కళాశాలలో పనిచేస్తోంది. ఈ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు. కుమార్తె వయసు ఎనిమిదేళ్లు. నల్లకుంటలోని ఓ కాన్వెంట్‌లో రెండో తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం వెంకటరమణ కళాశాలలో ఉద్యోగానికి వెళ్లిపోయింది. ఏసుపాదం ఒక్కడే ఇంటి వద్ద ఉన్నాడు. అతడు మధ్యాహ్నం భోజనం చేసి నిద్రపోయాడు. పాప తండ్రి పక్కనే కొద్దిసేపు పడుకొని సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చింది. కాలేజీలో పనిచేసి తిరిగొచ్చిన వెంకటరమణకు కుమార్తె కనిపించకపోవడంతో భర్తను నిద్ర లేపింది. వారిద్దరూ కలిసి చుట్టుపక్కల ఎంత గాలించినా పాప జాడ దొరకలేదు. తమ కుమార్తె అదృశ్యంపై వారు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని నల్లకుంట గ్రామం వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించినా, పోలీసులు చిన్న క్లూ కూడా సంపాదించలేకపోయారు. మరోవైపు పాప తల్లిదండ్రులు తమ చుట్టుపక్కల ఉన్న అన్ని ఇళ్లకు వెళుతూ, ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వారి ఇంటికి ఎదురుగా ఉన్న ప్రకాశ్ ఇంట్లోనే నాటకీయంగా పాప మృతదేహం బయటపడింది. ఒక గోనెసంచిలో విగత జీవిలా పడిఉన్న చిన్నారిని చూసి వారు గుండెలు బాదుకొన్నారు. అప్పటిదాకా పాపను తమతో పాటు వెతికిన ప్రకాశే హంతకుడని తెలుసుకొని నివ్వెరపోయారు.

భార్య అరుపులతో బయటపడ్డ ఘోరం..

ప్రకాశ్ సూరయపాలెంలోని ఫినోలెక్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పాప తల్లి పనిచేస్తున్న కాలేజీలోనే అతని భార్య సునీత కూడా పనిచేస్తోంది. ప్రకాశ్ కుమార్తె, కుమారుడు పునాదిపాడులోని సునీత అక్క ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. సునీత వాళ్లను చూడడానికి ఆదివారం ఉదయం వెళ్లింది. ఇంటి వద్ద ప్రకాశ్ ఒక్కడే ఉన్నాడు. ఆ రోజు సాయంత్రం సమయంలో ఒంటిరిగా బయటకు వచ్చిన చిన్నారి అతని కంటపడింది. ప్రకాశ్‌తో పాప చనువుగా ఉండేది. 'పెదనాన్న' అని పిలిచేది. దీంతో పాపను దగ్గరకు పిలిచి, అమాంతం ఎత్తుకొని ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఒకవైపు పాప తల్లిదండ్రులు, మరోవైపు పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేయడంతో.. అదేరోజు రాత్రి పాపపై అత్యాచారం జరిపి చంపేశాడు. అనంతరం ఒక గోనెసంచిలో ఆ మృతదేహాన్ని మూటగట్టి, దానిపై చాపను పరిచి.. బీరువా పక్కన ఉంచాడు. ఏమీ తెలియనట్టు తానూ చిన్నారి కోసం వెతుకుతున్నట్టు నటించాడు. ఇంతలో.. పిల్లల వద్దకు వెళ్లిన సునీత సాయంత్రానికి ఇంటికి చేరుకొంది. ఏదో విషయం మీద సోమవారం మధ్యాహ్నం భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో సునీత తన చేతుల్లోని ఏటీఎం కార్డును విసిరికొట్టింది. ఈ గొడవ తరువాత ప్రకాశ్ బయటకు వెళ్లిపోయాడు. తాను విసిరేసిన ఏటీఎమ్ కార్డుకోసం బీరువ